Samaikyata Sodara Bhavalu (Milli Integration)

# సమైక్యతా సోదరభావాలు


రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సందేశ్ భవన్,
సహారా కాంప్లెక్స్-106, పత్తర్‌గట్టి,
హైదరాబాద్-2, ఫోన్: 9441515414

వెల.........................................................రూ. 35/-లు



| | |
|---|---|
| Name of the Title: | Samaikyata Sodara Bhavalu (Telugu) (Milli Integration) |
| Compilation : | **ABUL IRFAN** Hyderabad-2 |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | February, 2009 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre Sahara Complex, Pathargatti Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, I.R.C. Graphics Sahara Complex, Pathargatti Hyderabad-500002 |
| Printed at: | Unity Graphics Chatta Bazar, Hyderabad-500002 |
| Price: | Rs. 35/- |



# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | సాధారణ మానవసంబంధాలు | 6 |
| 2. | కుటుంబ సంబంధాలు | 10 |
| 3. | బంధువుల సంబంధాలు | 14 |
| 4. | ఇరుగుపొరుగు సంబంధాలు | 19 |
| 5. | వృద్ధులు, మహనీయులు, మిత్రులు | 21 |
| 6. | పేదలు, అనాథలు | 24 |
| 7. | అంతర్జాతీయ సౌభ్రాతృత్వం | 26 |
| 8. | ముస్లింల విభేదాలకు మూలకారణం | 31 |
| 9. | ఖలీఫాపై తిరుగుబాటు ప్రారంభం | 36 |
| 10. | నివురుగప్పిన నిప్పు | 40 |
| 11. | మతపరమైన విభేదాలకు నాంది | 43 |
| 12. | ముస్లింరాజ్యాధినేతల హత్యకు కుట్ర | 48 |
| 13. | గ్రంథప్రజల అడుగుజాడల్లో ముస్లింలు | 51 |
| 14. | ప్రళయకాల సమీపంలోని ముస్లింలు | 54 |
| 15. | ఆంగ్లేయుల రాజనీతికి బలైనవారు | 58 |
| 16. | టార్చిలైట్ పెట్టుకొని చీకటిలో... | 62 |
| 17. | ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్టపథకాలు | 67 |





| | | |
|---|---|---|
| 18. | అమెరికా జియోనిస్టుల క్రూసేడ్ | 75 |
| ✦ | అంతంకాని ఆగడాలు | 77 |
| ✦ | అమెరికా పథకం | 78 |
| ✦ | చేసిన మేలు మరచిన క్రైస్తవులు | 81 |
| ✦ | బతికితే సమరయోధులు, చస్తే... | 84 |
| 19. | ముస్లింల ఉత్థానపతనాలు | 86 |
| 20. | దేవుని దృష్టిలో విశ్వాసి విలువ | 91 |
| 21. | సమైక్యతా సోదరభావాలు | 93 |
| 22. | ఐకమత్యం, అంతఃకలహాలు | 97 |
| 23. | ఫిఖా విభేదాలు | 102 |
| 24. | విభేదాలతో విడిపోతే వినాశం... | 106 |
| 25. | సంఘ వ్యవస్థీకరణ | 114 |
| 26. | నాయకానుచరుల సంబంధాలు | 116 |
| 27. | మధ్యేమార్గమే మనకు మంచిది | 119 |
| 28. | శ్రేష్ఠసమాజం బాధ్యతలు | 122 |

*కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం*

# సమైక్యతా సోదర భావాలు

ఇస్లాం ఎల్లప్పుడూ ప్రజల్లో శాంతి, స్నేహం, సమయిక్యతలనే కోరు కుంటుంది. ఇస్లాంకు శాంతి, సమర్పణ, విధేయత, ఆజ్ఞాపాలన అని నానార్థాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా శాంతే ఇస్లాంకు పర్యాయపదమై పోయింది. సమాజంలో శాంతి విరాజిల్లాలంటే ప్రజలమధ్య సదా స్నేహం, సమైక్యత, సౌభ్రాతృత్వాలు ఉండాలి. ఇలా ప్రపంచంలో శాంతి, స్నేహం, సమైక్యత, సౌభ్రాతృత్వాలతో కూడిన సుహృద్భావ వాతావరణం నెలకొనా లంటే ప్రపంచప్రజలంతా వారిని సృష్టించి పోషిస్తున్న ఏకేశ్వరుడ్ని మాత్రమే ఆరాధించాలి; ఆయన తన అంతిమ సందేశహరుని ద్వారా పంపిన జీవన విధానాన్ని (అంటే శాంతికి పర్యాయపదమైన ఇస్లాం ధర్మాన్ని) సక్రమంగా అనుసరిస్తూ ఉండాలి. దాని అనుసరణలో మాత్రమే మానవుల ఇహపర సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి.

ఒకవేళ ప్రపంచ మానవులందరూ ఇస్లాం జీవనవిధానాన్ని విశ్వసించ లేకపోతే, ఆ జీవనవ్యవస్థను విశ్వసించి దాన్నే తమ జీవిత సంవిధానంగా చేసుకున్న ముస్లింలయినా దాన్ని సక్రమంగా, సంపూర్తిగా అనుసరిస్తూ ఉండాలి. ఈవిధంగా ముస్లింలు మనుగడ సాగిస్తే వారి సమాజంలోనైనా శాంతి, సమైక్యత, సౌభ్రాతృత్వాలు వెల్లివిరుస్తుంటాయి. అంతేకాదు, అలాంటి సత్సమాజాన్ని చూసి ఇతర సమాజాల ప్రజలు కూడా ప్రభావి తులై తమ జీవనవిధానాన్ని మార్చుకునే ప్రయత్నం చేయవచ్చు.

కాని ఇస్లామీయ జీవనవ్యవస్థను తమ జీవితసంవిధానంగా చేసుకున్న ముస్లింలే నేడు దాన్ని పూర్తిగా అనుసరించకపోవడం, వారిలో అత్యధిక మంది ఇస్లాంవ్యతిరేక పద్ధతులు కూడా అనుసరిస్తుండటం ఎంతో విచార కరం. మరికొందరు ముస్లింలు అజ్ఞానం కారణంగానో, స్వార్థ ప్రయోజనా లను ఆశించో ఇస్లాంవ్యతిరేక శక్తుల చదరంగంలో పావులుగా ఉపయోగ



పడుతున్నారు. వాటన్నిటి దుష్పరిణామాలు కూడా వారు చవిచూస్తున్నారు. పరస్పరం అనైక్యత, అంతర్విభేదాలు, ప్రత్యర్థుల కుట్రలు, కుతంత్రాలు, శత్రువుల నుండి మతవిద్వేషం, అపార్థాలు, అప్రతిష్ఠలతో వారు సతమత మవుతున్నారు. మరికొన్ని జాతుల హింసాదౌర్జన్యాలకు, సామూహిక హత్య లకు బలయిపోతున్నారు.

ఇస్లాం శాంతి కోసం కావలసిన స్నేహసమైక్యతలను కుటుంబం నుంచి ప్రారంభించి బంధువర్గం, ఇరుగుపొరుగు, సమాజం, జాతుల మీదుగా మొత్తం ప్రపంచ మానవాళికి విస్తరింప జేస్తుంది. ఇస్లాం ఎవరికి చెంద వలసిన హక్కులు వారికి న్యాయంగా ఇచ్చివేసింది. ఇస్లాంను విశ్వసించని వారి కోసం కూడా 'మానవహక్కులు' నిర్ణయించింది. కనుక ఎవరినైనా అన్యాయంగా హత్యచేయడంగాని, ఎవరి హక్కునైనా అక్రమంగా కాజేయ డంగాని ఇస్లాం ఏమాత్రం సహించదు.

## సాధారణ మానవ సంబంధాలు-1

మానవులు ఒకే దేవుని దాసులు కావడంతో పాటు, ఒకే ఆది మానవు డయిన ఆదం (అలైహి) సంతానం అయిన దృష్ట్యా వారంతా సాధారణ పరిస్థితుల్లో సమానులు. ఇస్లాం దృష్టిలో మానవుల మధ్య ఏదైనా వ్యత్యాసం ఉందంటే అది రెండు విధాలుగా మాత్రమే ఉంది. ఒకటి, లింగపరంగా పురుషులు-స్త్రీలు అనే వ్యత్యాసం. రెండు, విశ్వాసులు-అవిశ్వాసులు అనే వ్యత్యాసం. లింగపరంగా స్త్రీలు-పురుషులు అనే తేడా తప్ప పుణ్యార్జనలో మానవులంతా సమానమే.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదేప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా మరొకరు తమ అవసరాలు గడుపు కోవడానికి దేవుని పేరును సాధనంగా చేసుకుంటారు. అలాంటి దేవునికి భయపడండి." (ఖుర్ఆన్–4:1)

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఖుర్ఆన్-49:13)

అంతిమ దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రజలారా! వినండి. మీప్రభువు ఒక్కడే. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి, నల్లవాడిపై తెల్లవాడికి, తెల్లవాడిపై నల్లవాడికి దైవభీతి పరాయణత ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఘనతా ఔన్నత్యాలు లేవు." (బైహఖి)

దేవుని దృష్టిలో జాతి, తెగ, వంశం, దేశం, ప్రాంతం, భాష, ఐశ్వర్యం, పదవీ, హోదాలకు ఎలాంటి విలువ లేదు. పైన పేర్కొన్న ఖుర్ఆన్ సూక్తి, దైవప్రవక్త (స) హితోక్తి ప్రకారం భయభక్తులకే అంటే దైవభీతి పరాయణతకే విలువ ఉంది. దేవుణ్ని, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించి ముస్లింలయిన వారిలో దేవుని పట్ల ఎక్కువ భయభక్తులు కలవారికే ఆయన దగ్గర విలువ ఉంటుంది. అలాంటి ముస్లింలే తోటి మానవుల పట్ల, ముఖ్యంగా తోటి ముస్లింల పట్ల సత్సంబంధాలు కలిగి ఉంటారని ఆశించగలం.

"ధర్మస్వీకరణలో ఎలాంటి బలాత్కారంలేదు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరుచేయబడింది. కనుక ఇక నుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే." (ఖుర్ఆన్-2:256)

మిథ్యాదైవాలను నిరాకరించి సృష్టికర్త, సర్వశక్తిమంతుడయిన ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధ్యదైవంగా స్వీకరించి తదనుగుణంగా సత్కార్యాలు చేసే మనిషి స్వధర్మస్వీకరణ కోసం ఇతరుల్ని ఎన్నడూ బలాత్కారం చేయలేడు. అతను ఎల్లప్పుడూ మానవతా దృష్టితో శాంతియుతంగానే తన ధర్మప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తాడు.

"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్ మానవాళిని



చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్మానవాళిని కాపాడినట్లే." (ఖుర్ఆన్-5:32)

ఇస్లాం మానవ ప్రాణానికి ఎంత విలువ ఇస్తుందో ఈ సూక్తిని బట్టి అర్థం చేసుకోవచ్చు. హంతకులకు, అరాచక శక్తులకు మాత్రమే ఇస్లాం ప్రభుత్వం మరణశిక్ష విధిస్తుంది. మరొక వైపు దౌర్జన్యపరుల నుండి, అరాచక శక్తుల నుండి ఒక మనిషిని కాపాడితే యావత్తు మానవాళిని కాపాడినట్లేనని చెబుతోంది దైవవాణి దివ్యఖుర్ఆన్.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించిన ఈ హితోక్తులు చూడండి:

"(ముస్లింలారా!) మీరు ఇతరులపై దయజూపండి; దేవుడు మీపై దయజూపుతాడు. మీరు ఇతరుల తప్పులు క్షమించండి; దేవుడు మీ తప్పులు క్షమిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

"ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడతని మెడలో ఏడుభూముల కంఠపాశం వేస్తాడు." (ముస్లిం)

"ఏ ముస్లిం అయినా ఒడంబడికదారునిపై దౌర్జన్యంచేస్తే లేదా అతని హక్కుల్ని తగ్గిస్తే లేదా అతనిపై అతని శక్తికి మించిన బరువుమోపితే లేదా అతని వస్తువేదైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటే ప్రళయదినాన నేనా ముస్లింకు వ్యతిరేకంగా వకీలునై వాదిస్తాను." (అబూదావూద్)

"ఏ ముస్లిమైనా ఒడంబడికదారుడ్ని చంపితే అతను స్వర్గసువాసన ఆఘ్రాణించే అదృష్టానికి కూడా నోచుకోలేడు. స్వర్గసువాసన నలభై యేండ్లపాటు ప్రయాణంచేసినంత దూరందాకా వ్యాపిస్తుంది." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

నేరం ఎవరు చేసినా చట్టప్రకారం శిక్ష అందరికీ సమానంగా వర్తిస్తుంది. విశ్వాసులు-అవిశ్వాసులు, తమవారు-పరాయివారు అన్న వివక్ష ఉండదు.

ఒక ముస్లిం ఓ ముస్లిమేతరుడ్ని చంపాడు. అందువల్ల దైవప్రవక్త (స) ఆ ముస్లింని వధించమని ఉత్తర్వు జారీచేశారు. అప్పుడాయన "ఆ బాధ్యత

వహించడానికి అందరికంటే నేనే ఎక్కువ హక్కుదారుడ్ని" అని అన్నారు. (ఇనాయా షరై హదాయా)

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో బకర్ బిన్ వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా(ప్రాంతాని)కి చెందిన ఒక జిమ్మీని చంపాడు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. దాని ప్రకారం హంతకుడ్ని హతుని వారసులకు అప్పగిస్తే వారతడ్ని హతమార్చారు. (బుర్హాన్)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఈ మూడు లక్షణాలున్న వ్యక్తి విశ్వాస మాధుర్యం ఆస్వాదిస్తాడు. 1-దేవుడు, దైవప్రవక్త (స) తనకు అందరికన్నా ప్రియతములైఉండాలి. 2-దైవప్రసన్నత కోసమే తోటిమనిషిని ప్రేమిం చాలి. 3-దేవుడు తనను అవిశ్వాస స్థితి నుండి రక్షించిన తర్వాత తిరిగి దాని వైపుకు మరలిపోవడాన్ని తాను అగ్నిలో పడటాన్ని ఎంతగా అసహ్యం చుకుంటాడో అంతగా అసహ్యించుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలకవర్గం ప్రజల్ని ఉద్దేశించి ఇలా అన్నారు: "నేను మీకు ఉపదేశిస్తున్నాను. జిమ్మీల (ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతరుల)తో చేసుకున్న ఒప్పందం నెరవేర్చండి. వారి రక్షణ కోసం (అవసరమైతే విదేశీశక్తులతో) యుద్ధం చేయండి. వారిపై వారి శక్తికి మించిన శిస్తుభారం వేయకండి." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

"ఇస్లాం రాజ్యంలోని ముస్లిమేతరులు ఎంతపెద్ద నేరం చేసినా వారితో చేసుకున్న ఒప్పందాన్ని ముస్లింలు తెంచకూడదు. చివరికి వారు జిజ్యా చెల్లించడం మానేసినా, ముస్లింని చంపినా, ముస్లిం స్త్రీని చెరచినా, దైవ ప్రవక్త (స) విషయంలో ఏదైనా అపచారం తలపెట్టినా ఒప్పందం భంగం కాదు. అయితే జిమ్మీలు ఇస్లాంరాజ్యం వదలి శత్రువులతో చేతులు కలిపితే లేదా ఇస్లాంరాజ్యంపై బహిరంగంగా తిరుగుబాటుచేస్తూ అరాచకం సృష్టిస్తే మాత్రం ఒప్పందం భంగమైపోతుంది." (ఫతహుల్ ఖదీర్)



## కుటుంబ సంబంధాలు-2

కుటుంబవ్యవస్థలో మొట్టమొదటి అంశం దాంపత్యవ్యవస్థే. దంపతు ల్లో సఖ్యతాసమైక్యతలు కొరవడితే వారి కాపురంలో అశాంతి తిష్ఠవేస్తుంది. దాని ప్రభావం వారి సంతానంపై కూడా పడవచ్చు. చివరికది విడాకుల క్కూడా దారితీయవచ్చు. అందుకే ఇస్లాం దంపతుల మధ్య సఖ్యత కోసం కొన్ని సూచనలిఇచ్చింది. వాటిని దంపతులు అనుసరిస్తే ఏ చిక్కూరాదు.

"ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనా లున్నాయి." (ఖుర్ఆన్-30:21)

ఈసూక్తిని బట్టి భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యా లున్నప్పుడే వారి సంసారంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి.

ఇస్లాం కుటుంబమనే సంస్థకు పురుషుడ్ని చైర్మన్‌గా, స్త్రీని సెక్రటరీగా నియమించి ఎవరి బాధ్యతల్ని, హక్కుల్ని వారికి న్యాయవంతంగా కేటా యించింది. అంతేగాకుండా ఆ చైర్మన్, సెక్రటరీలు ఎవరి విధుల్ని వారు సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడే కుటుంబం అనే సంస్థ సవ్యంగా, సాఫీగా, సజావుగా సాగుతుందని చెబుతోంది.

ఏ దేశంలోనూ ఇద్దరు అధ్యక్షులు లేదా ఇద్దరు ప్రధానులు ఉండరు. ఏ సైనికదళంలోను ఇద్దరు సేనాపతులు ఇమడలేరు. ఏ కార్యాలయం లోనూ సమానస్థాయిగల ఇద్దరు అధికారులు పనిచేయలేరు. ఏ సంఘాన్నీ ఇద్దరు నాయకులు నడపలేరు. అలాగే కుటుంబం అనే సమాజ వ్యవస్థ కేంద్రకార్యాలయం సవ్యంగా సాగాలంటే భార్యాభర్తల్లో ఒక్కరే అధికారిగా ఉండాలి. శారీరక, మానసిక సామర్థ్యాల్లో స్త్రీకన్నా పురుషుడు కొంత ఆధిక్యత కలిగివున్నందున కుటుంబవ్యవస్థకు ఇస్లాం పురుషుడ్ని నాయకు

నిగా నిర్ణయించింది. అర్ధాంగి అతని సహాయకురాలు (Assistant) మాత్రమే. ఆమె అతనికి విధేయురాలై మంచి పనుల్లో అతనితో సహకరి స్తున్నప్పుడే వారి సంసార శకటం సజావుగా సాగుతుంది.

కనుక చైర్మన్ పురుషుడు, సెక్రటరీ స్త్రీ సమానత్వం పేరుతో రచ్చకెక్కి సంసారంలో చిచ్చు రగుల్చుకోవలసిన పనిలేదు. హక్కులు, బాధ్యతలు సంస్థ నిబంధనావళి (ఖుర్ఆన్)లో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. ఈ బాధ్యతల్ని విస్మరిస్తే ఆ కుటుంబంలో మిగిలేది అశాంతి, అలజడులే. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి.

“సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయ పరంగా పురుషులపై స్త్రీలక్కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది. దేవుడు మహా శక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు. (2:228)

“దేవుడు స్త్రీలపై పురుషులకు కొంతాధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీలకోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహార కర్తలవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు. పురుషులు (ఇంటి పట్టున) లేనప్పుడు దేవుని రక్షణలో వారి హక్కులు కాపాడుతుంటారు.” (ఖుర్ఆన్-4:34)

దైవప్రవక్త (స) ఒకసారి మంచి భర్తను గురించి చెబుతూ “తన భార్య కోసం ఉత్తముడైనవాడే మీలో ఉత్తముడు” అని అన్నారు. (ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) హితోక్తి: “మీరు దైవప్రసన్నత కోసం ఏపని చేసినా దాని పుణ్యఫలం మీకు తప్పక లభిస్తుంది. చివరికి మీరు మీభార్య నోటికి ఒక అన్నంముద్ద అందించినా దానికీ పుణ్యఫలం లభిస్తుంది.” (బుఖారి, ముస్లిం)

“వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు.” (ఖుర్ఆన్-4:19)



మనిషి తన భార్యలో ఏదో నచ్చలేదని తొందరపడి వివాహబంధాన్ని తెంచుకోకూడదు. “ధర్మసమ్మతమైన పనులలో దేవునికి అన్నిటికంటే తలాఖ్ ఎంతో అప్రియమైన పని” అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) హితోక్తి: “మీరు స్త్రీల పట్ల మృదువుగా వ్యవహరించండి. స్త్రీలు ప్రక్కటెముకలతో సృజించబడ్డారు. ప్రక్కటెముకలలో కూడా అన్నిటి కంటే ఎక్కువ వంకరగా ఉండే పైఎముకతో సృజించబడ్డారు. మీరు దాన్ని సరిచేయడానికి ప్రయత్నిస్తే విరిగిపోతుంది. ఒకవేళ దాని మానాన వదిలేస్తే అది అలా వంకరగానే ఉంటుంది. కనుక మీరు స్త్రీలతో మంచిగా (మృదువుగా) మసలుకోండి.” (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: ‘రెండు రకాల మనుషులున్నారు. వారు చేసే నమాజులు వారి శిరస్సుల ఎత్తుకు మించి పైకిపోలేవు. ఒకటి, తన యజ మానిని వదలివెళ్ళి తిరిగిరాని బానిస చేసే నమాజు. రెండు, తనభర్త ఆజ్ఞల్ని ధిక్కరించి ఇక ఎన్నటికీ దారికిరాని భార్య చేసే నమాజు.” (హదీసు)

భార్యాభర్తల మధ్య పరస్పర సదవగాహన, మానసిక ప్రేమానురాగాలు ఉంటే వారి జీవితం ఎలాంటి వడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా సాగుతుంది; కుటుంబ సంబంధాలు పటిష్ఠంగా ఉంటాయి; సంతానానికి సరైన శిక్షణ లభిస్తుంది. దంపతుల మధ్య సదావగాహన, ప్రేమానురాగాలు కొరవడితే వారి జీవితం నరక తుల్యం అవుతుంది. కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమవుతాయి. సంతానం దారంతెగిన గాలిపటాల్లా మారిపోతారు.

దైవప్రవక్త (స) పిల్లల విషయంలో తల్లిదండ్రులకు ఇలా ఉపదేశించారు:

“మన పెద్దలను గౌరవించని, మన పిన్నల పట్ల వాత్సల్యం చూపని వాడు మనలోని వాడుకాదు.” (హదీసు).

“మీ పిల్లలు ఏడేళ్ళ వయస్సుకు చేరుకోగానే వారిని నమాజు గురించి ఆదేశించండి. పదేళ్ళు నిండిన తర్వాత నమాజ్ చేయకపోతే వారిని కొట్టండి. పదేళ్ళు నిండిన తర్వాత వారి పడకలు వేరుచేయండి.” (అబూదావూద్)

“తండ్రి తన సంతానానికిచ్చే కానుకలలో మంచి విద్యాబుద్ధులు గరపడమే గొప్పకానుక. దానికి మించిన శ్రేష్ఠమైన కానుక మరేదీలేదు.” (తిర్మిజి)

“ప్రళయదినాన మనిషితో అందరికన్నా ముందు జగడమాడేవారు అతని సంతానమే. వారు దేవునితో ‘దేవా! ఇతడ్ని గురించి మా ఫిర్యాదు తీసుకో. ఇతను మమ్మల్ని అక్రమ సంపాదనతో పోషించాడు. మాకు విధిగా నేర్ప వలసిన విషయాలు ఇతను మాకు నేర్పలేదు. అంచేత మేము అజ్ఞానులుగా ఉండిపోయాము’ అని అంటారు.” (తిర్మిజి)

ఇస్లాం ప్రకారం మానవుల హక్కులలో తల్లిదండ్రుల హక్కులు అగ్ర స్థానం వహిస్తాయి. దేవుడు, దైవప్రవక్తల తరువాత గౌరవాదరణలకు తల్లిదండ్రులే ఎక్కువ హక్కుదారులు. వారి శ్రమ, కృషి వల్లనే పిల్లవాడు పెరిగి పెద్దవాడైపోతాడు. ఆ పిల్లవాడు విద్యాశిక్షణలు పొంది ఇహపరలోకాలలో సాఫల్యం పొందడానికి యోగ్యుడవుతాడు.

తల్లిదండ్రుల సేవ గురించి ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

“తల్లిదండ్రుల పట్ల సద్భావం, సత్ప్రవర్తనలతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులయి ఉంటే వారిని ‘ఉఫ్’అని కూడా విసుక్కోకండి. వారిని కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయవిధేయతలతో వారి ముందు తలవంచి ఉండండి. ‘ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచిపోషించారో అలా వీరిని కరుణించు’ అని ప్రార్థించండి.” (17:24)

“తల్లిదండ్రులకు సేవచేయాలని మేము మానవుడ్ని ఆదేశించాము. అతని తల్లి బాధ మీద బాధ భరిస్తూ అతడ్ని గర్భంలో పెట్టుకొని మోసింది. అతడ్ని పాలు విడిపించడానికి రెండేళ్ళు పట్టింది. (మేమతనికి ఇలా ఉపదేశించాం:)”

“నాపట్ల కృతజ్ఞుడయి ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో మసలుకో. నీవు నా దగ్గరికే తిరిగిరావలసి ఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటికల్పించమని వత్తిడి చేస్తే మటుకు నీవు వారిమాట



ఎన్నటికీ వినకు. ప్రపంచంలో వారిపట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు.” (31:14,15)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఆయనతో “నేను జిహాద్ చేయాలనుకుంటున్నాను” అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని “నీ తల్లిదండ్రులున్నారా?” అని అడిగారు. దానికా వ్యక్తి “నా తల్లి మాత్రమే ఉంది” అన్నాడు. “అయితే నీ తల్లి పట్ల సత్ప్రర్తన కలిగివుండు. నీవు నీ తల్లికి శక్తివంచన లేకుండా సేవ చేయగల్గితే నీకు జిహాద్ పుణ్యమే కాదు, హజ్-ఉమ్రాలు చేసినంత పుణ్యం కూడా లభిస్తుంది” అని చెప్పారు దైవప్రవక్త (స) (అబూయాలా-తబ్రాని)

## బంధువుల సంబంధాలు-3

“అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించరాదని; తల్లిదండ్రుల పట్ల, బంధువుల పట్ల, అనాథల పట్ల, పేదల పట్ల సద్భావనతో మెలగాలని; ప్రజలతో మంచిమాటలు పలకాలని; ప్రార్థనావ్యవస్థ స్థాపించాలని; జకాత్ చెల్లిస్తుండాలని మేము ఇస్రాయీల్‌సంతతి చేతప్రమాణం చేయించాం.” (ఖుర్ఆన్-2:83)

సామాజికవ్యవస్థలో బంధువులతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యమైన విషయం. రక్తసంబంధీకులతో, సన్నిహిత బంధువులతోనే సంబంధాలు విచ్ఛిన్నం చేసుకునే మనిషి సమాజంలోని ఇతర మానవుల పట్ల చిత్తశుద్ధితో సత్సంబంధాలు కలిగివుంటాడని ఆశించలేము.

“(విశ్వాసులారా!) తల్లిదండ్రుల పట్ల సద్వర్తనంతో వ్యవహరించండి. బంధువులు, అనాథలు, నిరుపేదలతో మంచిగా మసలుకోండి. ఇరుగు పొరుగు బంధువులకు, పరిచయంలేని పొరుగువారికి, (మీ దైనందిన కార్యకలాపాలలో) తారసపడే మిత్రులకు, బాటసారులకు, మీ అధీనంలో వున్న బానిసలకు మేలు చేయండి.” (ఖుర్ఆన్-4:36)

“సత్యాన్ని విశ్వసించి, దైవమార్గంలో ఇల్లూవాకిలి వదలి పోరాడేవారు, (వారికి) ఆశ్రయమిచ్చి సహాయసహకారాలు అందజేసినవారు మాత్రమే

నిజమైనవిశ్వాసులు. వారి పొరపాట్లు మన్నించబడతాయి. వారికి శ్రేష్ఠమైన ఉపాధి లభిస్తుంది. సత్యాన్ని ఆ తర్వాత విశ్వసించి, ఇల్లూవాకిలి వదలి వలస వచ్చి, మీతో కలసి పోరాడేవారు కూడా మీ వర్గానికే చెందుతారు. అయితే దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులే ఒకరికొకరు ఎక్కువ హక్కుదారులు. దేవుడు ప్రతి విషయాన్నీ ఎరిగినవాడు." (ఖుర్ఆన్–8:74,75)

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి తన అతిథిని గౌరవించాలి. దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి తన బంధువులతో సత్సంబంధాలు కలిగివుండాలి. దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించిన మనిషి మాట్లాడితే మంచి మాటనే మాట్లాడాలి లేదా మౌనం వహించాలి." (బుఖారి, ముస్లిం)

మనిషి ఆంతర్యంలో నిజమయిన బంధుప్రేమ ఉంటేనే అతను బంధువులతో సత్సంబంధాలు కలిగివుంటాడు. ఇలాంటి బంధుప్రేమను ఇస్లాంలో "సిలారహ్మి" అంటారు. బంధుత్వాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం, ఆస్తి-అంతస్తులు చూసుకొని మిడిసిపడుతూ నిరుపేద బంధువులకు దూరంగా మసలుకోవడం, వారి హక్కులు కాలరాయడం బంధుప్రేమ అన్పించుకోదు. పైగా ఈ వైఖరి దైవాగ్రహానికి దారితీస్తుంది.

దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుడు సకల సృష్టిరాసుల్ని సృజించిన తర్వాత 'బంధుప్రేమ' లేచినిలబడి 'నేను బంధుత్వాల తెగతెంపుల బారినుండి నీశరణు కోరుతున్నాను' అన్నది. దానికి దేవుడు 'అయితే నీపట్ల సత్సంబంధాలు కలిగివుండేవాడి పట్ల నేనూ సత్సంబంధాలు కలిగివుంటాను. నీతో సంబంధాలు తెంచుకునేవాడితో నేనూ సంబంధాలు తెంచుకుంటాను. ఇది నీకిష్టమేనా?' అన్నాడు. దానికి బంధుప్రేమ "ఇష్టమే ప్రభూ!" అన్నది. అప్పుడు దేవుడు "సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది' అని చెప్పాడు."

"దీన్ని గురించి మీకు ప్రమాణం కావాలంటే ఈ సూక్తులు చదువుకోండి- "మీరు (సత్యానికి) విముఖులైపోతే లోకంలో మళ్ళీ అరాచకం, అల్లకల్లోలాలు రేకెత్తిస్తూ ఒకరి గొంతులు మరొకరు కోసుకుంటారు.



అంతకంటే మీనుండి మరేం ఆశించగలం? వీరసలు దైవశాపగ్రస్తులు. దేవుడు వీరిని (సత్యంకానలేని) అంధులుగా, (హితోక్తులు వినలేని) బధిరులుగా చేశాడు." (47:22,23)- (బుఖారి, ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) హితోక్తి ప్రకారం దేవుడిలా అన్నాడు: "నీతో సత్సంబంధాలు కలిగి వున్నవాడితో నేనూ సత్సంబంధాలు కలిగి వుంటాను. నీతో సంబంధాలు తెంచుకున్నవాడితో నేనూ సంబంధాలు తెంచుకుంటాను" అని ఉంది. (బుఖారి)

హజ్రత్ జుబైర్ బిన్ ముత్యిమ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "బంధుత్వాన్ని త్రెంచివేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు." (బుఖారి)

మహాప్రవక్త (స) మహితోక్తి: బంధుత్వం దైవసింహాసనానికి వ్రేలాడబడి "నాతో సత్సంబంధాలు కలిగివున్నవాడితో దేవుడు కూడా సత్సంబంధాలు కలిగివుండుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని దేవుడుకూడా విచ్ఛిన్నం చేయుగాక!" అని ప్రార్థిస్తూ ఉంటుంది. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నన్ను నరకం నుండి దూరంచేసి, స్వర్గానికి గొనిపోయే ఆచరణ గురించి తెలియజేయండి" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు- "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు మరెవరినీ సాటికల్పించకు. నమాజ్‌వ్యవస్థ నెలగొల్పు. జకాత్ చెల్లిస్తూఉండు. బంధువులతో సత్సంబంధాలు కలిగివుండు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అమ్ర్ బిన్ అబస (రజి) కథనం: దైవప్రవక్త(స)కు ప్రవక్త పదవి లభించిన తొలిరోజుల్లో నేనొకసారి మక్కా వెళ్ళి ఆయన్ని "మీరెవరండీ?" అనడిగాను. దానికి ఆయన "దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించి పంపాడు" అన్నారు. "దేవుడు మిమ్మల్ని ఏలక్ష్యం కోసం పంపాడు?" అని మళ్ళీ అడిగాను. దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "బంధువుల మధ్య సత్సంబంధాలు నెలగొల్పడానికి, విగ్రహాలను తొలిగించడానికి బహుదైవా

రాధన జరగకుండా ఒకే దేవుడు ఆరాధించబడటానికి దేవుడు నన్ను పంపించాడు" అని తెలిపారు. (సునసె తిర్మిజి)

మహాప్రవక్త (స) మహితోక్తి: "ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి ప్రత్యుపకారం చేసేవాడు బంధుప్రియుడు కాడు. బంధువులు తనతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే (నిజమైన) బంధుప్రియుడు." (బుఖారి)

హజ్రత్ మైమూన బిన్త్ హారిస్ (రజి) తన దాసీ ఒకరికి బానిసత్వం నుంచి విముక్తి కల్గించారు. దీని కోసం ఆమె ప్రవక్త(స) అనుమతి తీసుకోలేదు. ఆమె దాంపత్యం వంతు వచ్చినరోజు దైవప్రవక్త (స) ఆమె దగ్గరకు వెళ్ళారు. అప్పుడామె "దైవప్రవక్తా! మీకీ సంగతి తెలుసా? నేను నా దాసీకి బానిసత్వం నుంచి విడిపించాను" అని చెప్పారు. దైవప్రవక్త (స) ఈమాట విని "నువ్వు నిజంగా అలా చేశావా?" అనడిగారు. దానికామె ఔనన్నారు. అప్పుడాయన "నీవా దాసీని నీ మేనమామలలో ఎవరికైనా ఇచ్చివుంటే నీకు మరింత పుణ్యం లభించివుండేది కదా!" అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) హితోక్తి: "పేదవాడికి చేసే దానం (సాధారణ) దానం అవుతుంది. కాని (పేదవాడైన) బంధువుకు చేసే దానం రెండువిధాల ప్రయోజనకరమైనది. ఒకటి, అది దానంగా పరిగణించబడుతుంది. రెండు, బంధుప్రేమతో ఇచ్చినట్లుగా కూడా ఉంటుంది." (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఓసారి బిగ్గరగా ఇలా అన్నారు: "ఫలానా తెగవారు నా మిత్రులు కాజాలరు. దేవుడు, సదాచారులైన విశ్వాసులే నా మిత్రులు. అయితే ఆ తెగవారితో నాకు బంధుత్వం ఉంది గనక నేను బంధుత్వ సత్సంబంధాలను మాత్రం తప్పక కొనసాగిస్తాను." (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం : ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. నేను వారితో సత్సంబంధాలు కొనసాగించాలని ఎంత ప్రయత్నిస్తున్నా వారు మాత్రం నాతో సంబంధాలు తెంచుకోవాలనే చూస్తున్నారు. నేను వారిపట్ల మంచిగా వ్యవహరిస్తుంటే వారు



నాకు కీడు తలపెడ్తున్నారు. నేను వారిపట్ల మృదువైఖరి అనుసరిస్తుంటే వారు నాపట్ల కఠినంగా ప్రవర్తిస్తున్నారు" అంటూ తన గోడు వెళ్ళబుచ్చు న్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నువ్వు చెప్పింది నిజమే అయితే నువ్వు వారినోళ్ళలో వేడిబూడిద పోస్తున్నావనుకో. నువ్వు వారిపట్ల ఇలాగే సత్ప్రవర్తనతో మెలుగుతున్నంత కాలం దేవుని తరఫున వారికి వ్యతిరేకంగా ఒక సహాయకుడు నీవెంట ఉంటాడు" అని అన్నారు. (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: అబూతల్హా (రజి) దైవప్రవక్త (స)తో ఇలా అన్నారు: "దైవప్రవక్తా! 'అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు చేయనంతవరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడన్నాడు కదా! 'బైరహా'తోట నాకెంతో ఇష్టమైనది. నేను దాన్ని దైవమార్గంలో దానం చేయాలనుకుంటున్నాను. దైవంనుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయోగించండి." దైవప్రవక్త (స) ఈమాట విని "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. కాని నాదొక సలహా. ఆతోటను నీ(పేద)బంధువులకు పంచివ్వు"అన్నారు. దానికి అబూతల్హా(రజి) "నేను మీఆజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయనా తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు ఇచ్చేశారు. (బుఖారి)

బంధువులకు సహాయం చేయడం గొప్ప పుణ్యకార్యమే. ఈ సహాయం మనిషి తన సొంతఆస్తుల నుండి ఇవ్వడమో లేదా తన సొంతసంస్థలో ఏదైనా పదవి కట్టబెట్టడమో అయితేనే అది 'బంధుప్రేమ' అన్పించుకుంటుంది. దీనికిభిన్నంగా వ్యవహరిస్తే అది 'బంధుప్రీతి' అవుతుంది. బంధు ప్రేమకు, బంధుప్రీతికి తేడా గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"ఎవరైనా బంధుత్వం లేదా స్నేహం (ఆశ్రిత పక్షపాతం) కారణంగా ఎవరినైనా నాయకునిగా లేక పాలకునిగా నియమిస్తే అతను దేవునికి, దైవప్రవక్తకు, యావత్ ముస్లింలకు ద్రోహం చేసినట్లవుతాడు. ముస్లింలలో అంతకంటే మంచివ్యక్తి లభించే అవకాశం ఉన్నప్పుడు ఇలా చేయకూడదు." (తారిఖ్ఇస్లాం, 2వ భాగం-అక్బర్‌షా ఖాన్, నజీబ్ఆబాది)

## ఇరుగుపొరుగు సంబంధాలు-4

ఇరుగు పొరుగు అంటే మన ఇండ్లకు పొరుగున ఉండేవారని మాత్రమే అర్థంకాదు. మనం పనిచేసే కార్యాలయాల్లో, కర్మాగారాల్లో, దుకాణాల్లో ఉండేవారు, మన కస్టమర్‌లు, ఆయాచోట్ల మనకు తారసపడేవారు, మన సహప్రయాణీకులు కూడా ఇరుగుపొరుగు కిందికే వస్తారు.

దైవప్రవక్త (స) ఓసారి "దైవసాక్షి! అతను విశ్వాసికాడు.."అన్నారు (మూడు సార్లు). "ఎవరు దైవప్రవక్తా!" అనడిగితే, "తన కుచేష్టలతో ఇరుగుపొరుగు వారికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నవాడు" అని చెప్పారు ఆయన. (బుఖారి)

మరోహదీస్‌లో "తన తుంటరిచేష్టలతో ఇరుగుపొరుగువారికి మనశ్శాంతి లేకుండా చేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు" అని ఉంది. (ముస్లిం)

కొందరు పైకి భక్తిపరాయణులుగా కన్పించినా, వారు తమ నోటితో ఇతరుల్ని బాధిస్తుంటారు. అలాంటివారికి ఈక్రింది హదీసు గుణపాఠం.

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "ఫలానా స్త్రీ ఎన్నో ఐచ్ఛిక నమాజులు చేస్తుంది. మరెన్నో ఐచ్ఛిక ఉపవాసాలు పాటిస్తుంది. (పెద్ద ఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరు పొందింది. కానిఆమె తరచుగా నోటితో ఇరుగుపొరుగువారిని బాధిస్తుంది" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "అయితే ఆమె నరకానికి పోతుంది" అన్నారు. తిరిగి ఆ వ్యక్తి ఇలా అన్నాడు: "దైవప్రవక్తా! ఫలానా స్త్రీ ఐచ్ఛిక ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. ఐచ్ఛిక నమాజులు కూడా చాలా తక్కువగానే ఆచరిస్తుంది. ఆమె అప్పుడప్పుడు కొన్ని జున్నుగడ్డల్ని దానం చేస్తుందని కూడా ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగు పొరుగు వారిని బాధించదని జనం చెప్పుకుంటారు." దైవప్రవక్త (స) ఈ మాట విని "ఆమె స్వర్గనివాసి అవుతుంద"ని చెప్పారు. (మిష్కాత్)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా ప్రవచించారు : "(ప్రళయ దినాన) దేవుని న్యాయస్థానంలో అన్నిటికంటే ముందు ప్రవేశపెట్టబడే



ఇద్దరు వ్యక్తుల వ్యాజ్యం- ఇద్దరు పొరుగువాళ్ళకు సంబంధించిన వ్యాజ్యం అవుతుంది." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "తన పొరుగువాడు పస్తుండగా తాను కడుపు నిండా తినేవాడు (నిజమైన) విశ్వాసి కాడు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) స్త్రీలతో ఇలా అన్నారు: "ముస్లిం మహిళల్లారా! ఏ పొరుగింటిస్త్రీ కూడా తన పొరుగింటావిడ (ఇచ్చిన కానుక)ను అల్పమైనదిగా భావించకూడదు, అది ఓ మేక కాలిగిట్ట అయినసరే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూజర్ (రజి) కథనం: నా మిత్రులు (దైవప్రవక్త) నన్ను ఉద్దేశించి "అబూజర్! నీవు చారు వండితే అందులో నీళ్ళు ఎక్కువ పోయి. తర్వాత ఇరుగుపొరుగువారి ఇండ్లలో ఎంతమంది సభ్యులున్నారో అంచనా వేసుకొని, వారిక్కూడా అందులో కొంతివ్వు" అని తాకీదు చేశారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) మంచి స్నేహితుడు, మంచి పొరుగువాడి గురించి ఇలా తెలిపారు: "తన సహచరుల పట్ల మంచిగా మెలిగేవాడే దేవుని దృష్టిలో మంచి సహచరుడు. అలాగే తన ఇరుగుపొరుగువారి పట్ల మంచిగా మసులుకునేవాడే దేవుని దృష్టిలో మంచి పొరుగువాడు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "తన గోడకు పొరుగువాడు గూటం (లేక మేకు) కొట్టుకుంటానంటే దానికి ఎవరూ అభ్యంతరం పెట్టకూడదు." (బుఖారి)

హజ్రత్ ఆయిషా(రజి) కథనం: నేనొకసారి దైవప్రవక్త(స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నాకు ఇద్దరు పొరుగువాళ్ళున్నారు. వారిలో నేను ఎవరికి కానుక ఇవ్వాలి?" అని అడిగాను. దానికి ఆయన "వారిలో ఎవరి గడప నీకు దగ్గరగా ఉంటే వారికివ్వు" అని చెప్పారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "(దైవదూత) జిబ్రయీల్ పొరుగువాని (హక్కుల్ని) గురించి నాకు మాటిమాటికి ఎంతగా తాకీదు చేశారంటే, ఆమాట విని ఆయన నాఆస్తిలో (కూడా) పొరుగువాడ్ని వాటా దారుడిగా చేస్తారేమోనని అన్పించింది నాకు." (బుఖారి, ముస్లిం)

ప్రయాణావస్థలో ఉన్నప్పుడు ప్రయాణీకులు కూడా పరస్పరం ఇరుగు పొరుగు వారవుతారు. కాబట్టి ప్రయాణీకులు అవసరమైనప్పుడు పరస్పరం సహాయ సహకారాలు అందజేసుకోవాలి. తగిన ప్రయాణసామగ్రి లేనివారికి ఉన్నవారు తమ సామగ్రిలో అవసరమైన సామగ్రి ఇచ్చి ఆదుకోవాలి.

హజ్రత్ అనస్ (రజి) కథనం: మేమొక సారి దైవప్రవక్త (స)తో కలసి ప్రయాణం చేస్తున్నాము. అప్పుడు మాలో కొందరు ఉపవాసంతో ఉన్నారు; మరికొందరు ఉపవాసం లేరు. తీవ్రమైన వేసవితాపం రోజున మేమొక ప్రదేశానికి చేరుకొని విడిది చేశాము. అక్కడికి చేరుకోగానే ఉపవాసం ఉన్నవారు (అలసిపోయి చెట్ల క్రింద) పడుకున్నారు. ఉపవాసం లేనివారు నడుం వాల్చకుండా గుడారాలు వేయడంలో, ఒంటెలకు నీరు పెట్టడంలో లీనమైపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఈరోజు ఉపవాసం లేనివారు అమితమైన పుణ్యఫలం దోచుకున్నారు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ప్రయాణావస్థలో ఉపవాసం పాటించడం తప్పనిసరి కాదు. ఒకవేళ ఎవరైనా నఫిల్ ఉపవాసం పాటిస్తే అందులో తప్పు లేదు, పుణ్యకార్యమే. కాని ఆ పుణ్యకార్యం కంటే తోటిప్రయాణీకుల అవసరాలు తీర్చడం మరింత పుణ్యకార్యమని పైహదీసు ద్వారా తెలుస్తోంది.

## వృద్ధులు, మహనీయులు, స్నేహితులు-5

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు : "ఏ యువకుడైనా ఒక వృద్ధుడ్ని అతని వృద్ధాప్యం చూసి గౌరవిస్తే దేవుడు అతని వృద్ధాప్యంలో అతడ్ని గౌరవించేవారిని పుట్టిస్తాడు." (తిర్మిజీ)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం: నేను ఉమ్రాకు వెళ్ళటానికి దైవప్రవక్త (స) అనుమతి కోరాను. ఆయన అనుమతి ఇస్తూ, "సోదరా! (ఉమ్రాలో) నువ్వు దేవుణ్ణి ప్రార్థించేటప్పుడు మమ్మల్ని మరచిపోకు సుమా!" అన్నారు. ఆ మాటకు నేనెంతగా పొంగిపోయానంటే, మొత్తం ప్రపంచం నా సొంత మైనా నాకు అంత ఆనందం కలిగేది కాదు. (అబూదావూద్, తిర్మిజీ)



హజ్రత్ ఉసైర్ బిన్ జాబిర్ (రజి) కథనం: "యమన్ నుండి ముస్లిం యోధులకు సహాయ పడేవారెవరైనా వస్తే హజ్రత్ ఉమర్ (రజి) వారిని "మీలో ఉవైస్ బిన్ ఆమిర్ ఉన్నారా?" అని అడుగుతుండేవారు. ఒకరోజు ఓ బృందంతోపాటు నిజంగానే ఉవైస్ బిన్ ఆమిర్ వచ్చారు. మీరు 'ఉవైస్ బిన్ ఆమిర్ గారేనా?' అని ఉమర్ (రజి) అడిగారు. ఆయన అవునన్నారు. "మీకు మురాద్ కుటుంబంతోనూ, ఖర్న్ తెగతోనూ సంబంధం ఉందా?" అని అడిగారు. ఆయన ఉందని చెప్పారు. తర్వాత ఉమర్ (రజి) "మీ శరీరంపై తెల్లమచ్చలుండేవి. ఇప్పుడు అవన్నీ నయమై దిర్హం నాణెమంత మచ్చ మాత్రమే మిగిలిఉంది కదూ!?" అనడిగారు. ఆయన అవునన్నారు. ఆ తర్వాత "మీ తల్లి బ్రతికేఉందా?" అనడిగారు. "అవును, బ్రతికే ఉంది" అన్నారు ఆయన. (ఆయన ఉవైసే అని నమ్మకం కుదిరాక) ఉమర్ దైవ ప్రవక్త (స) ఇలా చెబుతుండగా తాను విన్నానని తెలియజేశారు:

"యమన్ నుండి ముస్లిం సేనలకు జిహాద్‌లో సహకరించేవారితో పాటు మురాద్ కుటుంబానికి, ఖర్న్‌తెగకు చెందిన ఉవైస్ బిన్ ఆమిర్ అనే మనిషి మీ దగ్గరికి వస్తాడు. ఒకప్పుడు అతని శరీరంపై ఉన్న తెల్లమచ్చలన్నీ నయమై పోయి ఒక దిర్హం నాణెమంత మచ్చ మాత్రమే మిగిలిఉంటుంది. అతను తన తల్లి పట్ల చాలా మంచిగా ప్రవర్తిస్తాడు. అతను దేవుని పేరుతో ఏదైనా ప్రమాణం చేస్తే దేవుడు తప్పకుండా అతని ప్రమాణాన్ని నెరవేరుస్తాడు. కాబట్టి (ఉమర్!) నీకు నీ పాపమన్నింపు కోసం అతనిచేత ప్రార్థన చేయించు కునే అవకాశం లభిస్తే తప్పకుండా చేయించుకో."

తర్వాత ఉమర్ (రజి) "అందుకే అడుగుతున్నాను. మీరు నా పాపాల మన్నింపు కోసం దేవుణ్ణి ప్రార్థించండి" అని అన్నారు. ఉమర్ (రజి) కోరినట్లు ఉవైస్ ఖర్నీ ఆయన మన్నింపు కోసం దేవుణ్ణి ప్రార్థించారు. ఆ తరువాత ఉమర్(రజి) "ఇప్పుడు మీరెక్కడికి వెళ్ళాలనుకుంటున్నారు?" అనడిగారు. కూఫాకు వెళ్ళాలనుకుంటున్నానని చెప్పారాయన. "అలాగైతే నేను కూఫా గవర్నర్‌కు మీగురించి లేఖ రాసివ్వమంటారా?" అనడిగారు. దానికాయన,

"నేను ఎవరికీ తెలియకుండా ఎవరూ పట్టించుకోకుండా ఉండే పేదలు, అభాగ్యులతో పాటు ఉండాలనుకుంటున్నాను" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుడు ఏ దాసుణ్ణయినా అభిమానిస్తే జిబ్రీల్ (అలై)ని పిలిచి "దేవుడు ఫలానా మనిషిని అభిమానిస్తున్నాడు. కనుక నీవు కూడా అతడ్ని అభిమానించు" అని అంటాడు. అప్పుడు జిబ్రీల్ (అలై) అతడ్ని అభిమానించడం ప్రారంభిస్తారు. తరువాత ఆయన ఆకాశంలో ఒక ప్రకటన చేస్తూ "దేవుడు ఫలానా మనిషిని అభిమానిస్తున్నాడు. కనుక మీరంతా అతడ్ని అభిమానించండి" అని అంటారు. దాంతో ఆకాశవాసులంతా (అంటే దైవదూతలంతా) అతడ్ని అభిమానించడం మొదలెడతారు. చివరికి భూమిపై కూడా అతనికి ప్రజాదరణ లభిస్తుంది. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: ప్రళయ దినాన దేవుడు,"నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య)ఛాయ తప్ప మరే ఛాయా లభించని ఈరోజు నేను వారికి నా నీడపట్టున ఆశ్రయం కల్పిస్తాను" అని అంటాడు. (ముస్లిం)

మరోఉల్లేఖనం ప్రకారం దేవుడు ప్రళయదినాన "నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? వారికోసం దైవప్రవక్తలు, అమరవీరులు సైతం అసూయ చెందేటటువంటి జ్యోతిర్మయ వేదికలు (సిద్ధంగా)ఉన్నాయి" అని అంటాడు. (తిర్మిజీ)

హజ్రత్ అబూమూసా (రజి) కథనం: "ఒకతను కొందరిని అభిమానిస్తున్నాడు. కాని సత్కార్యాలు చేయడంలో అతను వారి స్థాయికి చేరుకోలేక పోతున్నాడు. (దీనిపై మీ అభిప్రాయం)?" అని దైవప్రవక్త (స)ను ఎవరో అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మనిషి తాను అభిమానించినవారితో పాటే ఉంటాడు." (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఎవరైనా రోగిని పరామర్శించడానికి లేదా దేవుని కోసం తన సోదరుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు (దేవుని



తరపున) ఒక ప్రకటనకర్త "నీకు అభినందనలు. నీ నడక సార్థకమవుగాక! నీకు స్వర్గంలో స్థానం లభించుగాక!" అని ఎలుగెత్తి ప్రార్థిస్తాడు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) హితోక్తి : "మంచిస్నేహితుడు కస్తూరి అమ్మేవాడితో సమానం. చెడ్డస్నేహితుడు కొలిమి ఊదేవాడితో సమానం. కస్తూరి అమ్మేవాడి దగ్గర కూర్చుంటే అతను నీకు కానుకగా కస్తూరి ఇస్తాడు లేదా దాన్ని నువ్వు కొంటావు. ఈ రెండూ కాకపోయినా కనీసం నీకు అతని దగ్గర్నుంచి సువాసనైనా వస్తుంది. అదే నువ్వు కొలిమి ఊదేవాడి దగ్గర కూర్చుంటే (అతను నీ మీదకు నిప్పురవ్వలు ఎగరేసి) నీ బట్టలు కాలుస్తాడు లేదా అతని దగ్గర్నుంచి నీకు దుర్వాసనైనా అంటుతుంది." (బుఖారీ, ముస్లిం)

## పేదలు, అనాథలు-6

మహాప్రవక్త (సల్లం) మహితోక్తి : "(ఇంటింటా తిరిగి) ఒకటి రెండు ఖర్జూరపండ్లు లేదా ఒకటి రెండు అన్నం ముద్దలు అడుక్కునేవాడు పేదవాడు కాదు. (పేదరికంతో బాధపడుతున్నా) ముష్టెత్తకుండా బ్రతికేవాడే నిజమైన పేదవాడు." (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ సాద్ బిన్ అబూవఖ్ఖాస్ కథనం: మేము ఆరుగురం దైవప్రవక్త (సల్లం) వెంట ఉండేవాళ్ళం. బహుదైవారాధకులు (మమ్మల్ని అల్పులుగా భావించి) దైవప్రవక్త (స)తో "(ముహమ్మద్!) వీళ్ళను దూరంగా తొలగిపొమ్మను. వీళ్ళు మా మీదికి వస్తే మేము సహించం" అన్నారు.

(వారిలో) నేను, ఇబ్నెమసూద్, హుజైల్ తెగకు చెందిన ఒకతను, బిలాల్, ఇంకా ఇద్దరున్నారు. వారి పేర్లు నాకు తెలియవు. (బహుదైవారాధకుల ప్రతిపాదనపై) దైవప్రవక్త (స)కు దైవం తలచిన ఆలోచన వచ్చింది. ఆయన (దానికి అనుకూలంగా) మనసులో (మాగురించి) ఏదో అనుకున్నారు. అప్పుడు అల్లాహ్ (ఆయన్ని మందలిస్తూ) ఈ సూక్తులు అవతరింపజేశాడు-

"(ప్రవక్తా!) కొందరు రేయింబవళ్ళు తమ ప్రభువునే వేడుకుంటూ ఆయన ప్రసన్నత అర్థిస్తూ ఉంటారు. అలాంటివారిని నీ నుండి దూరంచేయకు.

వారి (కర్మల)లెక్క విషయమై నీపై ఎలాంటి బాధ్యతలేదు. అలాగే నీ (కర్మల) లెక్క విషయమై వారిపై ఎలాంటి బాధ్యత లేదు." (6:52)- (ముస్లిం)

ముస్‌అబ్ బిన్ సాద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం (ఆయన తండ్రి) అయిన సాద్ (రజి)కు (ఓసారి) తాను తన క్రిందివారి కన్నా గొప్పవాణ్ణనిపించింది. (ఈ సంగతి తెలుసుకొని) దైవప్రవక్త "ఈ బలహీనుల చలువతోనే నీకు (దైవం నుంచి) సహాయం లభిస్తోందని, ఉపాధి దొరుకుతోందని తెలుసుకో" అన్నారు. (బుఖారీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు నన్ను (పేదలు,) బలహీనుల్లో అన్వేషించండి. నిస్సందేహంగా (పేదలు,) బలహీనుల వల్లనే మీకు సహాయం అందుతోంది; ఉపాధి లభిస్తోంది." (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఓసారి వలీమా విందు ఆహ్వానితుల్ని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు : "పేదవారిని పిలవకుండా ధనికులు మాత్రమే ఆహ్వానించబడే వలీమావిందు అత్యంత నీచమైనది." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "పేదలు, వితంతువుల బాగోగుల కోసం కృషి చేసేవాడు దైవమార్గంలో పోరాడే యోధుడితో సమానం." (హదీసు ఉల్లేఖకుని కథనం:) "అతడు అలుపెరగకుండా దైవారాధన చేసేవాడితో, నిరంతరం ఉపవాసాలు పాటించే వాడితో సమానమని కూడా దైవప్రవక్త (స) అన్నారని నా అనుమానం." (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను, అనాథ పోషకుడు స్వర్గంలో ఇలా ఉంటాం." అప్పుడాయన తన చూపుడు వ్రేలితో మధ్య వ్రేలిని కలపకుండా కొంత సందు ఉంచి చూపించారు. (అంటే స్వర్గంలో ఇద్దరూ దాదాపు ఒకే చోట ఉంటారు)- (బుఖారీ)

మహాప్రవక్త (స) మహితోక్తి : "దైవప్రసన్నత కోసం అనాథబాలుడి తల నిమిరే వ్యక్తి కర్మల చిట్టాలో ఆ బాలుడి తలలోని ప్రతివెంట్రుకకు బదులుగా ఒక్కో పుణ్యం రాయబడుతుంది." (తిర్మిజి)



## అంతర్జాతీయ సౌభ్రాతృత్వం-7

మానవులంతా ఒకే ఆదిదంపతుల సంతతి అయిన దృష్ట్యా ఇస్లాం వారిని ప్రాథమిక స్థాయిలో పరస్పరం అన్నదమ్ములుగా పరిగణిస్తుంది. అయితే మానవుల్లో కొందరు నిజదేవుడ్ని గుర్తించి, ఆయన తన ప్రవక్తల ద్వారా తెలిపిన సత్యధర్మాన్ని స్వీకరించి విశ్వాసులైపోయారు. మరికొందరు నిజదేవుడ్ని విస్మరించి సత్యానికి విముఖులయి అవిశ్వాసులైపోయారు. అందువల్ల ఇస్లాం ద్వితీయ స్థాయిలో విశ్వాసులైపోయిన ముస్లింలను మాత్రమే పరస్పరం అన్నదమ్ములుగా పరిగణిస్తుంది.

ఇలా ముస్లింలు ప్రాథమికస్థాయిలోనే గాక ద్వితీయస్థాయిలో కూడా పరస్పరం అన్నదమ్ములైపోయారు. అంటే వీరి సోదరబాంధవ్యం అవిశ్వాసుల ప్రాథమికబాంధవ్యంకంటే ఎంతోపటిష్ఠమైనది. కనుక ముస్లింలు ఎల్లప్పుడూ పరస్పరం సత్సంబంధాలు కలిగివుండాలని ఇస్లాం కోరుకుంటోంది.

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటి వారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలు నెలకొల్పండి. దేవునికి భయపడండి, మీరు కరుణించబడతారు." (ఖుర్‌ఆన్-49:10)

ముస్లింలు పరస్పరం అన్నదమ్ములైన దృష్ట్యా వారి మధ్య సదా సత్సంబంధాలు ఉండాలని, ఎప్పుడైనా దురదృష్టవశాత్తు ఈ సత్సంబంధాలకు విఘాతం కలిగితే వెంటనే వాటిని పునరుద్ధరించాలని పైసూక్తి సూచిస్తోంది.

"విశ్వాసులారా! మీలో ఎవరైనా తామిప్పుడు అనుసరిస్తున్న ధర్మం నుండి వెనక్కి మరలితే (మరలిపోనివ్వండి), దేవుడు (అంతకంటే మంచివాళ్ళు) చాలామందిని పుట్టిస్తాడు. వారు దేవుడ్ని ఎంతగానో ప్రేమిస్తారు. దేవుడు కూడా వారిని ప్రేమిస్తాడు. అదీగాక వారు తోటివిశ్వాసుల విషయంలో మృదువుగా, అవిశ్వాసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తారు. దైవమార్గంలో నిరంతరం పోరాటం జరుపుతారు. నిందించే వారి నిందలకు ఏమాత్రం బెదిరిపోరు. ఇది దేవుని అనుగ్రహం, తాను కోరినవారికి అనుగ్రహిస్తాడు." (ఖుర్‌ఆన్-5:54)

"ముహమ్మద్ (స) దేవుని సందేశహరుడు. ఆయన అనుచరులు అవిశ్వాసులకు ఏమాత్రం లొంగని దృఢమనస్కులు. అయితే వారు పరస్పరం మృదు హృదయులు, దయామయులు. నీవు ఎప్పుడైనా వారిని చూస్తే వారు రుకూ, సజ్దాలు (ప్రార్థన) చేయడంలో, దేవుని అనుగ్రహం, ఆయన ప్రసన్నతలు అర్థించడంలో నిమగ్నులై ఉండటం కన్పిస్తుంది. వారి ముఖాలపై సాష్టాంగ ప్రణామ చిహ్నాలు ఉంటాయి. ఆ చిహ్నాల్ని బట్టే వారిని గుర్తించవచ్చు. ఇవి తౌరాత్‌లో వారిని గురించి వర్ణించబడిన లక్షణాలు.

"ఇన్జీల్‌లో వారి లక్షణాలు ఇలా పోల్చబడ్డాయి: ఒక పొలం ఉంది. అందులో మొదట విత్తనం నుండి చిన్న మొలక అంకురిస్తుంది. తరువాత అది పటిష్ఠమవుతుంది. ఆ తరువాత అది కాస్త లావెక్కి కాడగా మారుతుంది. ఆపై ఆ మొక్క తన కాండం మీద నిటారుగా నిలబడుతుంది. అప్పుడు రైతుకు ఆ దృశ్యం కనులపండువగా ఉంటుంది; అవిశ్వాసులు అసూయాగ్నిలో మాడిపోవడానికి (ఇలా విశ్వాసుల సద్గుణసంపత్తి పుష్పించి ఫలిస్తుంది). వారిలో సత్యాన్ని విశ్వసించి సదాచారసంపన్నులైన వారిని దేవుడు మన్నించి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు." (ఖుర్ఆన్-48:29)

ముస్లింలు ప్రపంచంలో ఎక్కడున్నా పరస్పరం సత్సంబంధాలు కలిగి వుండాలని, సహాయసహకారాలు అందజేసుకోవాలని, వారిలో ఎల్లప్పుడూ సౌభ్రాతృత్వం నెలకొనిఉండాలని పైన పేర్కొన్న ఖుర్ఆన్ సూక్తుల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ముస్లింల సౌభ్రాతృత్వానికి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆనాడు ముహాజిర్ ముస్లింలకు, అన్సార్ ముస్లింలకు మధ్య నెలకొల్పిన అపూర్వ సోదరీకరణే ప్రబల నిదర్శనం.

ఆయన మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన తర్వాత ముస్లింల పరస్పర సంబంధాలను పటిష్ఠవంతం చేయడానికి తీసుకున్న చర్యలు ప్రపంచచరిత్రలో ఎక్కడా కానరావు. ఆయన తనతో పాటు మక్కా నుండి మదీనాకు వలసవచ్చిన ముస్లింలకు, మదీనాలోని అన్సార్ ముస్లింలకు మధ్య సోదరీకరణ నెలకొల్పారు. అదొక వర్ణనాతీతమైన సంఘటన.



ఆరోజు మదీనా పట్టణం అన్సార్‌లు (ఆదుకున్నవారు), ముహాజిర్‌ల (వలసవచ్చిన వారి) కలయికతో కళకళలాడుతోంది. వారి మధ్య దైవప్రవక్త (సల్లం) నిలబడి విశ్వమానవ సౌభాతృత్వాన్ని గురించి బోధిస్తున్నారు. ఆ మహనీయుని నైతికశిక్షణ వల్ల అనుచరుల్లో ఇదివరకే చాలావరకు పరస్పర సోదరభావం పెనవేసుకున్నది. ఇప్పుడీ ప్రత్యేక సమావేశంలో బోధించే ఇస్లాం హితవులతో వారు మరింత ఉత్తేజితులయ్యారు.

దైవప్రవక్త (స) ప్రసంగం ముగిసిన తరువాత కట్టుబట్టలతో మాత్రమే వచ్చిన ముహాజిర్‌ల (వలస వచ్చినవారి) వైపు చూపిస్తూ "ఇదిగో వీరు మీ సోదరులు" అని అన్సార్‌ల (ఆదుకున్నవారి)కి గుర్తుచేశారు. ఆ తరువాత వరుసగా ఒక్కొక్క ముహాజిర్‌ను, ఒక్కొక్క అన్సార్‌ని పిలిచి "ఈరోజు నుంచి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములు" అని చెప్పనారంభించారు.

దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులకు తమ ప్రియతమ నాయకుని ఆదేశానికి మించిన విషయం మరేదీ లేదు. ఆయన ఆజ్ఞాపిస్తే చాలు, తోటిసోదరుని కోసం తమ ప్రాణలైనా అర్పించడానికి సిద్ధంగా ఉన్నారు. అన్సార్ ముస్లింలు పరమ సంతోషంతో తమతమ ముహాజిర్ ముస్లిం సోదరుల్ని గుండెలకు హత్తుకున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి)తో హజ్రత్ ఖారిజా బిన్ జుబైర్ (రజి)కు, ఉమర్ ఫారూఖ్ (రజి)తో ఉత్బాన్ బిన్ మాలిక్ (రజి)కు, అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి)తో సాద్ బిన్ మాజ్ (రజి)కు, అబ్దుర్రహ్మాన్ (రజి)తో సాద్ బిన్ రబీ (రజి)కు, జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)తో సలామా బిన్‌సలామా (రజి)కు, ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి)తో సాబిత్ బిన్ ముంజర్ (రజి)కు, తల్హా బిన్ ఉబైదుల్లా (రజి)తో కాబ్ బిన్ మాలిక్ (రజి)కు, ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)తో అబూఅయ్యూబ్ (రజి)కు, అమ్మార్ బిన్ యాసిర్ (రజి)తో హుజైఫా బిన్ యమాన్ (రజి)కు మధ్య సోదరసంబంధాలు ఏర్పాడ్డాయి. ఇలా యావత్తు ముహాజిర్ ముస్లింలకు, అన్సార్ ముస్లింలకు మధ్య దృఢమైన సోదరసంబంధాలు నెలకొన్నాయి.

ఆ తర్వాత అన్సార్‌ముస్లిం‌లు తమతమ ధార్మిక సోదరుల్ని తమ ఇళ్ళకు తీసికెళ్ళి తమతో సమానంగా సకలసౌకర్యాలు కల్పించారు. తమకున్న ఆస్తిలో అర్థభాగం వారికి పంచిచ్చారు. తమకు చెందిన ప్రతి వస్తువునీ, అది ఎంత విలువైనదైనా సరే, రెండు సమాన భాగాలుగా విభజించి మరీ ఇచ్చారు. ఈ విషయంలో సాద్ బిన్ రబీ అన్సారీ (రజి) మరింత ముందుకు పోయారు. ఆయన అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్ప ధనికుడు. దేవుడు ఆయనకు సిరిసంపదలతో పాటు విశాలహృదయం కూడా ఇచ్చాడు.

హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి) తన ముహాజిర్ ముస్లింసోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్‌ఔఫ్ (రజి)ను తీసుకొని ఇంటికి వెళ్ళారు. ఆయన ఇంట్లో ఉన్న ప్రతి వస్తువునీ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు చూపించి వీటిలో అర్థభాగం మీదని చెప్పారు. ఆ తరువాత ఆయన్ని మరో గదిలోకి పిలిచికెళ్ళి కూర్చోబెట్టారు.

"సోదరా! నేను నా యావదాస్తిపాస్తుల్ని, సమస్త వస్తుసామగ్రిని మీకు చూపెట్టాను. అందులో మీకు సగం ఇచ్చేశాను. మీకిష్టమైనవి నిస్సంకోచంగా తీసుకోవచ్చు" సాద్(రజి) తన సహజధోరణిలో చెప్పుకుపోతున్నారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆయన మాటల్ని మౌనంగా వింటున్నారు.

"సోదరా! నాకు ఇద్దరు భార్యలున్నారు. వారిలో మీకిష్టమైన ఆమెను ఎన్నుకుంటే నేనామెకు విడాకులిస్తాను. ఇద్దత్ గడువు ముగిసిన తరువాత మీరామెను నిస్సంకోచంగా పెళ్ళి చేసుకోండి. మీరు నా ధార్మిక సోదరులు. నాకున్న ప్రతి వస్తువులో అర్థభాగం మీకు రావలసిన హక్కు. వీటిని నేను సంతోషంగా ఇస్తున్నాను, స్వీకరించండి" అన్నారు సాద్ బిన్ రబీ (రజి).

"ప్రియసోదరా! దైవం మీ వ్యాపారంలో మరింత శుభం కల్గించుగాక! ఈ అసామాన్య సోదరభావానికి తగిన బహుమానం కూడా మీకు ప్రసాదించుగాక! నాకు వీటిలో ఏదీ అవసరం లేదు. నాకు బజారుకు పోయే దారి చూపండి చాలు" అన్నారు అబ్దుర్రహ్మాన్ (రజి) ఎంతో వినయంతో.



కేవలం కట్టుబట్టలతో వచ్చిన ముహాజిర్ ముస్లింలకు ఎన్నెన్ని వస్తువుల అవసరముంటుందో ఊహించండి. అంతకంటే ఎక్కువే ఇవ్వడానికి అన్సార్ ముస్లింలు ముందుకొచ్చారు. కాని ఇక్కడ చూస్తే ముహాజిర్ తనకేమి అవసరం లేదంటున్నాడు. అన్సార్ 'ఇది మీహక్కే, తీసుకోండి' అంటున్నాడు.

సోదరుడుకాని సోదరుని పట్ల సొంత అన్నదమ్ముల్లో కూడా ఇలాంటి అనురాగం, ఆప్యాయతలు కానరావు. గతచరిత్రలో కూడా ఎక్కడా కన్పించవు. మహాప్రవక్త (సల్లం) ఇచ్చిన నైతిక శిక్షణ, ఆయన కనబరచిన సమయస్ఫూర్తి అలాంటివి మరి! ఇస్లాంలోని విశ్వమానవ సౌభ్రాతృత్వం ముహాజిర్‌లు, అన్సార్‌ల మధ్య విడదీయని అనుబంధం ఏర్పరచింది. వారిలో ఎనలేని సోదర వాత్సల్యం జనింపజేసింది. ప్రతి ఒక్కడూ తనకు ఇష్టమయినదే తన సోదరుని కోసం ఇష్టపడుతున్నాడు. ఆ సోదరునికి చీమకుట్టినా తనకే ఆ చీమ కుట్టినట్లు బాధపడేవాడు.

ముహాజిర్ ముస్లింలు స్వతహాగా కష్టజీవులు. వారికి ఇలా రోజుల తరబడి అన్సార్ ముస్లింల ఆస్తులు హరిస్తూ కూర్చోవడం ఇష్టం లేదు. అంచేత కాస్త అవకాశం దొరగ్గానే కష్టపడి పనిచేయనారంభించారు. కొంత మంది వ్యాపారం చేపట్టారు. మరి కొంతమంది అన్సారుల పొలాల్లో సేద్యం చేయడానికి, ఇంకొందరు ఇతర కాయకష్టం చేయడానికి పూనుకున్నారు. కష్టేఫలే అన్నారు. దైవానుగ్రహం వల్ల వారు అనతికాలంలోనే గణనీయమైన అభివృద్ధి సాధించారు. వారి ఆత్మాభిమానం కూడా వారిని ఇతరుల మీద ఆధారపడకుండా సొంతకాళ్ళ మీద నిలబడటానికి ప్రేరేపించింది.

మక్కాలో హజ్‌సమయంలో మనకీ అంతర్జాతీయ సౌభ్రాతృత్వం కొంత వరకు కన్పిస్తుంది. జిల్‌హజ్జ 9, 10 తేదీలలో అరఫాత్, ముజ్దల్ఫాలలో ఎలాంటి అరుపులు, అలజడులు, కేకలు, కలహాలు మచ్చుకైనా కన్పించవు. ఒకేసారి, ఒకేచోట 30 నుంచి 50 లక్షల మంది హాజీలు గుమికూడే ఈ మానవ మహాసాగారం ఎలాంటి పోలీసుబందోబస్తు లేకుండా ఎంత ప్రశాంతంగా, నిశ్చింతగా ఉంటుందో ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తుంది.

ఒకేరోజు, ఒకేచోట అంతమందిని, అన్ని దేశాల, జాతుల వాళ్ళను, ఒకరి భాష మరొకరికి తెలియని ఆ మహా జనసంద్రాన్ని ఒక్క గొడుకు క్రిందకు చేర్చగలిగిన ఆ మహత్తరశక్తి ఏమిటీ? అదే "ఖుర్ఆన్"- అదిచ్చే మానవీయవిలువలతో కూడిన ఏకదైవారాధనా సందేశం! "లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ ఆయన ప్రవక్త) అనే సద్వచనం బహిరంగంగా పఠించ గానే మనిషి విశ్వప్రభువు సైన్యంలో భర్తీ అయిపోతాడు.

ఆ పరమప్రభువు ఆదేశంతోనే ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చే ఈ 'సైనికులు' మక్కా నుండి మినాకు, మినా నుండి అరఫాత్‌కు, అరఫాత్ నుండి ముజ్దల్ఫాకు, ముజ్దల్ఫా నుండి మళ్ళీ మినాకు, మినా నుండి కాబాకు, కాబా నుండి తిరిగి మినాకు, మినా నుండి మక్కాలోని తమతమ స్థావరాలకు 'మార్చ్'చేస్తారు. ఈ 'హజ్' నమాజ్, రోజా, జకాత్‌ల మాదిరిగానే ఒకవిధమైన శిక్షణ లాంటిది. అన్యాయం, అక్రమాలతో సమాజంలో అశాంతి, అలజడులు రేకెత్తించే దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు విశ్వపాలకుడు ఇచ్చే సైనికశిక్షణ ఇది.

ఈ క్రమశిక్షణ, సౌభ్రాతృత్వాలు హజ్ సమయంలోనే గాక ఎల్లప్పుడూ ఉంటే ఎంత బాగుంటుంది! కాని ఇహలోకం "పరీక్షా సదనం" కదా! మానవుల్ని పరీక్షించడానికి సృష్టికర్త మంచి వెనుక చెడును, మేలు వెనుక కీడును, విశ్వాసం వెనుక అవిశ్వాసాన్ని, సత్యం వెనుక అసత్యాన్ని, వెలుగు వెనుక చీకటిని ఉంచాడు. ఈ సూత్రం ఆధారంగానే విశ్వకర్మాగారం నడుస్తోంది. ఈ పాజిటివ్-నెగటివ్‌ల సంఘర్షణలో ఒక్కోసారి పాజిటివ్, మరొక్కోసారి నెటివ్ ఆధిక్యత వహిస్తుంటాయి.

## ముస్లింల విభేదాలకు మూలకారణం-8

ముస్లింల మధ్య సమైక్యతా సోదరభావాలు దైవప్రవక్త (స) (మదీనా) జీవితకాలం నుంచి ప్రారంభమై, మూడవ శ్రేష్ఠఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలంలో హిజ్రీశకం 33వ సంవత్సరం వరకు దాదాపు 30



ఏండ్లపాటు కొనసాగాయి. ఆ తర్వాత పరిస్థితులు క్రమేణా మారసాగాయి. 'సనా' పట్టణనివాసి అయిన **అబ్దుల్లా బిన్ సబా** అనేయూదుడు ముస్లిం వేషంలో మదీనా వచ్చి ముస్లింల మధ్య విభేదాలకు, రాజకీయ సంక్షోభా నికి బీజంవేసి ఇస్లాంవ్యతిరేకోద్యమం ప్రారంభించాడు. అతను మదీనాలో ఉంటూ ముస్లిం జనసామాన్యంలోని బలహీనతలను అధ్యయనం చేస్తూ తగిన పథకాలు రూపొందించడంలో తలమునకలైపోయాడు.

ఆరోజుల్లోనే బస్రాపట్నంలో హకీం బిన్‌జబలా అనే ముస్లిం ధనపిపాసి ఉండేవాడు. అతను యుద్ధసమయాల్లో వీలు చిక్కినప్పుడల్లా జిమ్మీలను (ఇస్లామీయరాజ్యంలోని ముస్లిమేతరుల్ని) దోచుకునేవాడు. అతనికీ పనిలో మరికొందరు తోడుదొంగలు దొరికారు. అతని దోపిడీ వార్తలు రాజధాని (మదీనా) వరకు ప్రాకాయి. ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) అతడ్ని పట్నం సరిహద్దులు దాటి పోనివ్వకుండా బస్రాలోనే నిర్బంధించి ఉంచమని బస్రా గవర్నర్‌కు ఉత్తర్వు జారీచేశారు. ఆవిధంగా హకీం బిన్ జబలా బస్రా పట్నంలోనే నిర్బంధానికి గురయి ఉండసాగాడు.

ముస్లింవేషంలో కుట్రలు పన్నుతున్న అబ్దుల్లా బిన్ సబా ఈ సంగతి తెలుసుకొని బస్రా వెళ్ళి హకీం బిన్ జబలా ఇంట్లో ఉండసాగాడు. ఇక్కడ తననుతాను ముస్లింలశ్రేయోభిలాషిగా, ప్రవక్త కుటుంబాభిమానిగా చెప్పు కుంటూ తన దుష్టపథకాన్ని అమలుచేయనారంభించాడు. మొదట అతను తన మాయమాటలతో హకీంని, అతని మిత్రమూకను బుట్టలో వేసు కున్నాడు. తర్వాత క్రమంగా అతని బాహ్యవతారం చూసి కొందరు అమాయకులు, మరికొందరు స్వార్థపరులు అతని వలలో పడిపోయారు.

వీరందరి సహకారంతో అబ్దుల్లా బిన్ సబా తన దుష్టపథకానికి అను గుణంగా ప్రజల హృదయాల్లో కల్లోలం రేకెత్తించే ఆలోచనలు, నమ్మకాలు నూరిపోయడం మొదలెట్టాడు. అతను ఒక్కోసారి "ముస్లింలు ఈసా (అలై) మళ్ళీ ప్రపంచంలోకి వస్తారని నమ్ముతారు. కాని ముహమ్మద్ (సల్లం) కూడా మళ్ళీ ప్రపంచంలోకి వస్తారనే విషయాన్ని నమ్మకపోవడం నాకు

ఆశ్చర్యం కలిగిస్తోంది'' అని చెప్పేవాడు. ఖుర్‌ఆన్‌లోని "ఇన్నల్లజీ ఫరజ అలైకల్ ఖుర్‌ఆన లరద్దుక ఇలా మఆద్" (పవక్తా! నీపై ఈ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన దేవుడు నిన్ను తప్పకుండా అత్యంత శ్రేష్ఠమైన స్థానానికి చేర్చుతాడు–28:85) అనే సూక్తికి తప్పుడువ్యాఖ్యానం చేస్తూ ''ముహమ్మద్ (సల్లం) మళ్ళీ ప్రపంచంలోకి తప్పక వస్తార''నే విశ్వాసంపై ప్రజలను స్థిరంగా ఉంచే ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.

దాంతో బుద్ధిహీనులు అనేకమంది అతని మాయాజాలంలో పడి పోయారు. ఆ తర్వాత అతను 'ప్రతి దైవప్రవక్తకూ ఒక ఖలీఫా(ప్రతినిధి), ఒక వారసుడు ఉంటాడు, హజ్రత్ అలి(రజి) ముహమ్మద్ (సల్లం)కు వారసుడు. ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్త అయినట్లే హజ్రత్ అలి (రజి) అంతిమ వారసుడవుతారు' అనే విశ్వాసంపై ఆ బుద్ధిహీనుల్ని స్థిరంగా ఉంచే పని ప్రారంభించాడు. ఈ పని కాస్త వేడి పుంజుకోగానే ''దైవప్రవక్త (స) తదనంతరం ప్రజలు హజ్రత్ అలి (రజి)ని వదిలేసి వేరే వ్యక్తిని ఖలీఫాగా చేసి పెద్ద తప్పు చేశారు. అంచేత ఇప్పుడు అందరూ హజ్రత్ అలీ (రజి)కి తమ సహాయసహకారాలు అందజేయాలి. ప్రస్తుత ఖలీఫాను హతమార్చిగాని, పదవీచ్యుతుడ్ని చేసిగాని హజ్రత్ అలీ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకోవాలి'' అని అతను ప్రచారం మొదలెట్టాడు.

ఈవిధంగా అబ్దుల్లా బిన్ సబా తన దుష్టపథకాన్ని చాలా తెలివిగా అమలుపరుస్తూ ఒక వర్గం ముస్లింలకు హీరోగా తయారు కాసాగాడు. ఈ అరాచకం క్రమక్రమంగా విస్తరిస్తూ బస్రా గవర్నర్ కుర్చీకి తాకింది. వెంటనే బస్రాగవర్నర్ అతడ్ని పిలిపించి చీవాట్లు పెట్టాడు. దాంతో అతను బస్రాలో తన అనుచరమూకకు తగిన సూచనలిచ్చి బస్రా నుంచి కూఫా పట్నానికి వెళ్ళిపోయాడు. కూఫాలో కూడా అతను తన పైశాచిక కార్యకలాపాలు సాగించాడు. కూఫాలో అంతకుముందు నుంచే ఖలీఫాకు కొందరు ప్రత్యర్థులు తయారైవున్నారు. అందువల్ల అబ్దుల్లా బిన్ సబాకు తన దుష్ట పథకాన్ని ముందుకు తీసికెళ్ళేందుకు సువర్ణవకాశం లభించింది.



అతను కొద్ది కాలంలోనే తన ధర్మపరాయణత, తపోనిష్ఠల పగటి వేషంతో కూఫా ప్రజల హృదయాలను చూరగొన్నాడు. ప్రజలు భక్తిశ్రద్ధలతో అతడ్ని ఎంతగానో గౌరవించేవారు. అయితే కూఫాగవర్నర్ కూడా, అబ్దుల్లా బిన్ సబా పైశాచికవిశ్వాసాల ప్రచారం గురించి వినగానే అతడ్ని పిలిపించి చీవాట్లు పెట్టాడు. కూఫాలోని కొందరు విజ్ఞులు, పెద్దలు కూడా అతడ్ని అనుమానాస్పదంగా చూడసాగారు. అంచేత అతను కూఫా కూడా వదలి సిరియా రాజధాని డెమాస్కస్‌కు వెళ్ళిపోయాడు. అతను బస్రాలో లాగే కూఫాలో కూడా తన అనుచరమూకకు తగిన సూచలిచ్చి వెళ్ళిపోయాడు. డెమాస్కస్‌లో తన పాచిక పారకపోవడంతో అతను అక్కడ్నుంచి కూడా మూటాముల్లే సర్దుకొని వెళ్ళి ఈజిప్టు రాజధాని నగరంలో తిష్ఠవేశాడు.

అబ్దుల్లాబిన్‌సబా గతానుభవాలను దృష్టిలోపెట్టుకొని ఇక్కడ మరెంతో చాకచక్యంతో ''ప్రవక్త కుటుంబాభిమానం, అలీ (రజి)కి మద్దతు'' అనే తన స్వయంకృత విశ్వాసాల్ని ప్రజల మెదళ్ళలో జొప్పించడం ప్రారంభిం చాడు. దానికోసం ఈజిప్టులో అనేకచోట్ల రహస్య స్థావరాలు కూడా నెల కొల్పాడు. ఇక్కడ్నుంచి బస్రా, కూఫా పట్టణాల్లోని తన అనుచర గణంతో ఉత్తర ప్రత్యుత్తారాలు జరిపేవాడు. ఇలా బస్రా, కూఫా, ఈజిప్టుల నుంచి అక్కడి పాలకులు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మదీనా ప్రజలకు; మదీనా నుండి ఈజిప్టు, బస్రా, కూఫా ప్రజలకు ప్రారంభించిన ఉత్తరప్రత్యుత్తరాల పరంపర ఓ పెద్ద 'నెట్‌వర్క్'గా తయారైపోయింది.

ఈజిప్టుగవర్నర్‌కు ఆఫ్రికా, కాన్‌స్టాంటినోపిల్ వగైరా విదేశీసైన్యాల ఎడ తెరిపిలేని దాడుల్ని ప్రతిఘటించడంలో నిమగ్నమైపోవడంవల్ల దేశ అంతర్గత వ్యవహారాల్ని గురించి ఆలోచించడానికి తీరికే లభించేది కాదు. దానికి తోడు ఈజిప్టువాసుల్లో కొందరికి గవర్నర్‌వ్యవహారాలు నచ్చలేదు. ఈరెండు విషయాలు అబ్దుల్లా బిన్ సబా పనిని మరింత సులువుచేశాయి.

అబ్దుల్లా బిన్ సబా, అతని మిత్రమూకలు ప్రారంభించిన ఉత్తరప్రత్యు త్తరాల''నెట్‌వర్క్'' ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపింది. ప్రతి రాష్ట్రంలోని

ప్రజలు తమకంటే ఎక్కువ ఇతర రాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యం జరుగుతోందని, ఖలీఫా ఉస్మాన్ గని (రజి) ఆ రాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యపరులైన గవర్నర్‌లను బలవంతంగా రుద్దారని, వాళ్ళను పదవుల నుంచి తొలగించడానికి నిరాకరిస్తున్నారని భావించసాగారు.

హజ్రత్ ఉస్మాన్(రజి) వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఈజిప్ట్‌కు హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి)ని, కూఫాకు ముహమ్మద్ బిన్ ముస్లమాని పంపించారు. ఈజిప్టులో అబ్దుల్లా బిన్ సబా అనుచరులు, అక్కడి గవర్నర్‌పట్ల అయిష్టంగా ఉన్నవారు హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి)కు ఖలీఫా వైఖరి గురించి లేనిపోని మాటలుచెప్పి ఆయన్ని మదీనా పోనీయకుండా ఆపుకున్నారు. ముహమ్మద్ బిన్ ముస్లమా కూఫాలో నానాటికి దిగజారుతున్న పరిస్థితుల్ని గురించి ఖలీఫాకు లేఖ రాశారు. ఆ రోజుల్లోనే కూఫాలోని ఖిలాఫత్‌వ్యవస్థ మద్దతుదారులు, ప్రజా ప్రతినిధులు, జన శ్రేయోభిలాషులయిన కొందరు ప్రముఖులు రాష్ట్రంలో ఏర్పడిన అరాచక పరిస్థితి పట్ల విసుగెత్తి వేరే ప్రాంతాలకు తరలిపోయారు.

కూఫా గవర్నర్ హజ్రత్ సయీద్ బిన్ ఆస్ (రజి) రాష్ట్రంలో తీవ్రమవుతున్న తిరుగుబాటు, అల్లకల్లోల పరిస్థితి చూసి, తన స్థానంలో ఖాఖా బిన్ అమ్రని ఇన్‌చార్జ్ గవర్నర్‌గా నియమించి, రాష్ట్రపరిస్థితి గురించి వివరించడానికి మదీనా వెళ్ళారు. ఆయన మదీనా వెళ్ళిన తరువాత కూఫాలో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ప్రజలలో అనేకమంది ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి)ని, ఆయన నియమించిన గవర్నర్‌లను దూషిస్తూ అల్లర్లు, అల్లకల్లోలాకు పాల్పడ్డారు.

ఇదిలాఉంటే మరొకవైపు యజీద్ బిన్ ఖైస్ అనేవాడు కొందరు జనాన్ని వెంటేసుకొని హజ్రత్ ఉస్మాన్(రజి)పై వత్తిడితెచ్చి ఆయన్ని ఖిలాఫత్ పదవి నుండి తొలిగించే ఉద్దేశంతో మదీనా బయలుదేరాడు. అతని దురుద్దేశం తెలుసుకున్న ఇన్‌చార్జ్ గవర్నర్ ఖాఖా బిన్ అమ్ర్ ఓ చిన్న సైనికదళంతో వెళ్ళి దారిలోనే అతడ్ని అణచి దారికి తీసుకొచ్చారు. అయితే మరికొన్నాళ్ళలోనే డెమాస్కస్ నుండి మాలిక్ ఇష్ట్రా అనే ఓ తలబిరుసు ముస్లిం తన అనుచరులతో కూఫాకు వచ్చేశాడు. అతని రాకతో కూఫా అల్లరిమూకకు, యజీద్ బిన్ ఖైస్ అనుచరులకు మరింత ధైర్యం వచ్చింది. వారంతా హజ్రత్ ఉస్మాన్ (రజి)కు వ్యతిరేకంగా పెద్దఎత్తున తిరుగుబాటు బావుటా ఎగరవేసి కూఫా నుండి బయలుదేరారు.



## ఖలీఫాపై తిరుగుబాటు ప్రారంభం-9

ఈ గుంపు మదీనా నుండి తిరిగొస్తున్న కూఫా గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి)ని అడ్డగించి, 'కూఫా గవర్నర్‌గా అబూమూసా అష్‌అరీ (రజి)ని నియమించి పంపమని ఖలీఫాకు చెప్పాలంటూ ఆయన్ని వెనక్కి తిప్పి పంపింది. అబూమూసా (రజి) గవర్నర్‌గా నియమితులై కూఫా వచ్చి ప్రజలకు నచ్చజెప్పడంతో చాలామంది ఖలీఫాకు విధేయులయిఉంటామని ఒప్పుకున్నారు. అయితే ఇబ్నెసబా వర్గం 'ఉత్తరప్రత్యురాల నెట్‌వర్క్' ద్వారా తన తిరుగుబాటు కార్యకలాపాల్ని మరింత విస్తృతం, వేగవంతం చేసింది. అతని గూఢచారులు, అనుచరులు ఇస్లామీయ రాజ్యమంతటా వ్యాపించారు. వారు ఖలీఫా ఉస్మాన్(రజి)కు, ఆయన గవర్నర్‌లకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే పనులను ముమ్మరం చేశారు.

ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిస్థితులు విషమిస్తూ పోవడం చూసి ప్రవక్త అనుచరుల్లో నమ్మకస్థులైన కొందరు ప్రముఖుల్ని ఎన్నుకొని రాజ్యంలోని మొత్తం గవర్నర్లపై వస్తున్న ఆరోపణల్ని గురించి నిజానిజాలేమిటో తెలుసుకొని రమ్మని పంపించారు. వారంతా వెళ్ళివచ్చి గవర్నర్‌లందరూ న్యాయంగా, నిజాయితీగానే ప్రజలను పాలిస్తున్నారని తెలియజేశారు.

జనంలో అనేకమంది హజ్రత్ ఉస్మాన్ (రజి) బంధుప్రేమ (సిలారహ్మా) "బంధుప్రీతి"గా మారి హద్దు మీరిపోయిందని భావించసాగారు. అంచేత ఖలీఫా పిలిచిన ఒక సభలో వారాయనపై రకరకాల ఆరోపణలు చేశారు. ఖలీఫా వారికి తగిన సమాధానాలిచ్చి పంపివేశారు. కాని వారు ఖలీఫా ఇచ్చిన సమాధానాలతో పూర్తిగా తృప్తిచెందలేదు.

'బంధుప్రేమ' ధర్మసమ్మతమైన విషయమే. కాని అది హద్దుమీరితేనే ప్రమాదం ముంచుకొస్తుంది. హజ్రత్ ఉస్మాన్ (రజి) తన మారుసోదరుడు వలీద్ బిన్ ఉఖ్బాని కూఫాగవర్నర్‌గా నియమించారు. వలీద్ మద్యసేవ నానికి అలవడ్డాడు. ఒకసారి అతను ఫజర్ నమాజ్‌లో ఇమామ్‌గా రెండు రకాతులకు బదులు నాలుగు రకాతులు పఠించి, ఇంకా పఠించాలా అని అడిగాడు తన వెనుకనున్న నమాజీలతో. మద్యసేవనం రుజువుకావడంతో అతనికి కొరడాదెబ్బల శిక్ష కూడా పడింది.

అలాగే హజ్రత్ ఉస్మాన్ (రజి) తన పినతండ్రి కుమారుడైన మర్వాన్‌ని కార్యదర్శిగా నియమించారు. మర్వాన్ తండ్రి హకం దుశ్చర్యల కారణంగా దైవప్రవక్త (స) వారిద్దర్నీ మదీనా నుండి బహిష్కరించారు. పూర్వఖలీఫాలు అబూబకర్(రజి), ఉమర్ (రజి)లు కూడా తమ పాలనాకాలాల్లో వారిద్దర్నీ మదీనాలో అడుగుపెట్టడానికి అనుమతించలేదు. కాని హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫా కాగానే మర్వాన్‌ని చేరదీసి అతనికి కార్యదర్శి పదవి కట్టబెట్టారు. అతను ఖలీఫా అనుమతి లేకుండానే ఇష్టానుసారం ప్రభుత్వ కార్యకలాపాలు సాగిస్తూ ప్రజల అయిష్టతకు గురయ్యాడు.

హజ్రత్ ఉస్మాన్ (రజి)లోని బంధుప్రేమ, మృదుస్వభావాలు ఎరిగిన హజ్రత్ ఉమర్ (రజి) ఈ ప్రమాదాన్ని ముందే ఊహించి ఓసారి హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి)తో ఇలా అన్నారు: " నేను గనక ఉస్మాన్‌ని (ఖలీఫా పదవికి) నా వారసునిగా ప్రతిపాదిస్తే ఆయన (తనతెగ) బనూఉమయ్యా వారిని ప్రజలపై బలవంతంగా రుద్దుతారు. వారు ప్రజల వ్యవహారాల్లో దైవాజ్ఞల్ని ఉల్లఘించి అక్రమాలకు పాల్పడతారు. దైవసాక్షి! నేనిలా చేస్తే ఉస్మాన్ (రజి) ఇలాగే వ్యవహరిస్తారు. ఒకవేళ ఆయన అలా చేస్తే వారు పాపాలకు పాల్పడతారు. దాంతో ప్రజలు అల్లర్లు లేవదీసి ఆయన్ని హత మారుస్తారు." చివరికి హజ్రత్ ఉమర్ (రజి) ఊహించినట్లే జరిగింది.

హజ్రత్ ఉస్మాన్ (రజి) సతీమణి హజ్రత్ నాయిలా (రజి) ప్రభుత్వ కార్యదర్శి మర్వాన్ విషయంలో తన భర్త ముందు ఇలాంటి అభిప్రా



యమే వ్యక్తపరుస్తూ "మీరు గనక మర్వాన్ చెబుతున్నట్లు నడచుకుంటే అతను మిమ్మల్ని వధింపజేసి గాని వదలిపెట్టడు. అతనిలో దేవుని పట్ల భయమూ, భక్తీ ఏమాత్రం లేదు" అని అన్నారు.

ఓసారి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఖలీఫా ఉస్మాన్ (రజి)తో మాట్లాడుతూ "మీరు ప్రజలపట్ల మితిమీరిన మృదుత్వంతో వ్యవహరిస్తున్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఇలా వ్యవహరించేవారు కాదు. వందలమైళ్ళ దూరంలో ఉన్న గవర్నర్లు, అధికారులు ఆయన సన్నిధిలో బానిసలకంటే కూడా ఎక్కువ భయపడేవారు. ముస్లింలలో అనైక్యతాబీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్న అసాంఘిక శక్తుల్ని గుర్తించి కూడా మీరు వారిని శిక్షించడం లేదు" అని అన్నారు. హజ్రత్ ఉస్మాన్(రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. అల్లరిమూకపై ఎలాంటి చర్యా తీసుకోలేదు.

సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి 'ఖలీఫా భద్రత కోసం తాను సిరియా నుంచి బ్రహ్మాండమైన సైనిక పటాలాన్ని మదీనా పంపిస్తానని హజ్రత్ ఉస్మాన్ (రజి)కు విన్నవించుకున్నారు. కాని ఆయన అందుకు అంగీకరించ లేదు.

ఈజిప్టులో ఇబ్నెసబా తన దుష్టపథకానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకున్నాడు. అతని మాయాజాలంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి), వరఖా బిన్ రాఫె(రజి) లాంటి ప్రముఖ సహాబీలు కూడా చిక్కుకున్నారు. ఇబ్నెసబా అసలు లక్ష్యం గురించి ముస్లింవేషాల్లో ఉన్న అతని యూద సహచరులకు తప్ప మరెవరికీ తెలియదు. అతను ఖిలాఫత్ వ్యవస్థను తుదముట్టించడానికి హజ్రత్ అలీ(రజి)కి మద్దతు, ప్రవక్త కుటుంబాభిమానాల బూటకపు ప్రచారాన్ని ఓ సాధనంగా వాడుకుంటున్నాడు. అంచేత అతని ఉద్యమకారుల్లో కపటముస్లింలు, స్వార్థపరులు, అజ్ఞానులు, అమాయకులు అనేకమంది చేరిపోయారు.

చివరికి 'హజ్' దినాలు సమీపించగానే ఆ దుర్మార్గుడి ఆజ్ఞల ప్రకారం దాదాపు మూడు వేలమంది తిరుగుబాటుదారులు హజ్ సాకుతో వివిధ

ప్రాంతాల నుంచి బయలుదేరి మదీనా సమీపానికి చేరుకున్నారు. అల్లరి మూకలకు, మదీనాలోని ప్రముఖులకు మధ్య అనేకసార్లు చర్చలు కూడా జరిగాయి. కాని అవి ఫలవంతం కాకపోవడంతో వేలసంఖ్యలో ఉన్న ఆ దుండగులు ఓరోజు హఠాత్తుగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నగరంలోకి జొరబడి ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇంటిని చుట్టుముట్టారు.

పరిస్థితి పూర్తిగా విషమించింది. హజ్రత్ అలీ(రజి), మరికొందరు సహాబీలు దుండగులకు నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించారు. కాని వారు తమ మంకుపట్టు వదల్లేదు. తత్ఫలితంగా హజ్రత్ ఉస్మాన్ (రజి) 30 రోజులపాటు నిర్బంధానికి గురయ్యారు. ఆరోజుల్లో ఆయన నమాజు కోసం ఇంటికి దగ్గర్లోనే వున్న మసీదుకు మాత్రమే పోయివస్తుండేవారు. చివరి మూడురోజులు దుండగులు ఆయన్ని ఇంటినుంచి గడప కూడా దాటనివ్వలేదు. ఇంటికి నీటిసరఫరా కూడా నిలిపివేశారు. అప్పుడు ఓ పొరుగింటి ముస్లిం రహస్యంగా నీటిసరఫరా చేస్తుండేవాడు. ఖలీఫా తన గవర్నర్లందరికీ పరిస్థితులు వివరిస్తూ లేఖలు రాశారు. వెంటనే గవర్నర్లు తమ తమ సైన్యాలు తీసుకొని మదీనా బయలుదేరారు. ఈ సైన్యాలు మదీనా చేరుకోక ముందే పరిస్థితి చేయిదాటి పోయింది.

దుండగులకు, ఖలీఫా ప్రతినిధులకు మధ్య చర్చలు జరుగుతున్నప్పుడు మర్వాన్ అనేకసార్లు తన నోటిదురుసు, సూటిపోటి మాటలతో అలి(రజి), ఆయన సహచరుల మనస్సుల్ని నొప్పించాడు. అంచేత మదీనా వాసులు దుండగుల్ని కలుసుకొని, మర్వాన్‌ని మదీనా నుండి తీసే విషయం మాట్లాడమని అడిగారు. మర్వాన్‌ని మదీనా నుండి తీసి దుండగులకు అప్పగించివుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో! అలా జరగలేదు.

ప్రవక్త అనుచరుల్లో ప్రముఖులు కొందరు ఖలీఫాను కాపాడేందుకు శతవిధాల పోరాడారు. కాని అల్లరిమూకల ముందు వారి ప్రయత్నాలు ఫలించలేదు. వారిలో అనేకమంది పోరాడుతూ అమరగతులైపోయారు. దుండగులు తలుపుకు నిప్పెట్టి లోపలికి జొరబడ్డారు. అప్పుడు హజ్రత్



ఉస్మాన్(రజి) ఖుర్ఆన్ పఠిస్తున్నారు. కనానా బిన్ బషీర్ అనే దుర్మార్గుడు లోపలికి రాగానే హజ్రత్ ఉస్మాన్ (రజి)పై ఖడ్గంతో వ్రేటు వేశాడు. వాడు ఖడ్గం పైకెత్తగానే హజ్రత్ ఉస్మాన్(రజి) అర్ధాంగి నాయిలా (రజి) చేత్తో కత్తివ్రేటును నిరోధించడానికి ప్రయత్నించారు. దాంతో ఆమె చేతివ్రేళ్ళు తెగిపడ్డాయి. మరొకవ్రేటుతో హజ్రత్ ఉస్మాన్ (రజి) నేలకొరిగి ఊపిరి విడిచారు. ఇలా యూదలకుట్రతో హి.శ.35వ ఏట జిల్హజ్ 18వ తేదీన 12 ఏండ్ల ఉస్మానియా పరిపాలన అంతమైపోయింది.

ఆ తర్వాత ఇబ్నెసబా, అతని అనుచరమూకలు అలి, తల్హా, జుబైర్ (రజి)ల దగ్గరకు పోయి ఖలీఫా పీఠం అధిరోహించమని అడిగారు. దానికి వారు అంగీకరించకపోవడంతో దుండగులు మదీనా పౌరుల్ని సంబోధిస్తూ "రెండురోజుల్లో కొత్త ఖలీఫాను ఎన్నుకోవాలని; లేకుంటే అలి, తల్హా, జుబైర్ (రజి)లను చంపివేస్తామని ప్రకటించారు. దాంతో మదీనా ప్రజలు భయపడి ఆ ముగ్గురు సహాబీల దగ్గరికెళ్ళి సంప్రదించారు. కాని వారిలో ఎవరూ ఖలీఫా కావడానికి అంగీకరించ లేదు. చివరికి ఎలాగో ప్రజల వత్తిడి, అభిమానాలతో హజ్రత్ అలి (రజి) ఖలీఫాగా ఎన్నికయ్యారు.

## నివురుగప్పిన నిప్పు-10

ఈ ఎన్నిక అల్లర్లు, అలజడులు, విభేదాలు, వైషమ్యాలతో నిండిన విషపూరితమైన వాతావరణంలో జరిగింది. అంచేత ప్రముఖ సహాబీలలో అనేకమంది హజ్రత్ అలీ (రజి)తో 'బైత్' (ప్రమాణస్వీకారం) చేయడానికి రాలేదు. దాంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉండిపోయింది.

హజ్రత్ అలి(రజి) ఖలీఫా అయిన తర్వాత ఈ 'నివురు గప్పిన నిప్పు' మరో అరాచకానికి బీజం వేసింది. ఇక్కడ్నుంచి ఖిలాఫత్ వ్యవహారకర్తలు రెండువర్గాలుగా విడిపోయారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఉమయ్యా వర్గం"గా, హజ్రత్ అలి(రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఅబ్బాసీ వర్గం"గా విడిపోయారు. బనూఉమయ్యా వర్గం హజ్రత్ ఉస్మాన్ (రజి) హంతకులకు

ప్రతీకారశిక్ష విధించాలని డిమాండ్‌చేసింది. హజ్రత్ అలి (రజి) పరిస్థితులు చక్కబడిన తరువాత హంతకుల్ని శిక్షిస్తానని చెప్పారు. కాని ఆ వర్గంవారు హంతకుల్ని వెంటనే శిక్షించాలని పట్టుబట్టారు. ప్రముఖ సహాబీలైన తల్హా, జుబైర్(రజి)ల డిమాండ్ కూడా అదే.

హజ్రత్ అలి(రజి) మద్దతుదారుల్లో (బనూఅబ్బాసీ వర్గంలో) అత్యధిక మంది 'ముస్లింముఖయూదుడు' అబ్దుల్లా బిన్ సబా అనుచరులే ఉన్నారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య తర్వాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తిరుగుబాటుదారులు వెంటనే తమతమ ప్రాంతాలకు తిరిగివెళ్ళి పోవాలని హజ్రత్ అలి(రజి) ఆదేశించారు. కాని అబ్దుల్లా బిన్ సబా, అతని అనుచర మూకలు హజ్రత్ అలీ(రజి)కి మద్దతుదారులుగా నిలిచినప్పటికీ ఆయన ఆజ్ఞను త్రోసిపుచ్చి మదీనాలోనే తిష్ఠవేశారు.

బనూఉమయ్యా వర్గంలోని కొందరు హజ్రత్ ఉస్మాన్(రజి) గారి రక్త సిక్తమైపోయిన చొక్కా, ఆయన భార్య హజ్రత్ నాయిలా (రజి) గారి తెగిన చేతివ్రేళ్ళు తీసుకొని సిరియా గవర్నర్ హజ్రత్ ముఆవియా (రజి) దగ్గరి కెళ్ళారు. ఆయన ఆదేశంతో వాటిని రాజధాని డెమాస్కస్‌లోని జామియా మస్జిద్ ప్రసంగవేదికపై ఉంచి ప్రజలకు చూపిస్తూ హజ్రత్ అలి (రజి)కి వ్యతిరేకంగా వారిని సంఘటిత పరచడం ప్రారంభించారు.

అమీర్ ముఆవియా (రజి), ఆయన వర్గీయులు సాగిస్తున్న తిరుగు బాటు కార్యకలాపాల సంగతి తెలియగానే హజ్రత్ అలి (రజి) మొదట సిరియాపై దాడి చేయడానికి సిద్ధమయ్యారు. అయితే హజ్రాత్ తల్హా, జుబైర్, ఆయిషా (రజి)లు మదీనా నుండి మక్కా వెళ్ళిపోయాక మక్కా పరిస్థితి మారిపోయింది. ప్రజలు హజ్రత్ ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) నేతృత్వంలో అనేకమంది సహాబీలతో పాటు మూడువేల మంది సాయుధులు బస్రా చేరుకొని యుద్ధంచేసి దాన్ని ఆక్రమించుకున్నారు.



ఖలీఫా అలీ (రజి)కి ఈసంగతి తెలియగానే ఆయన సిరియాపై దాడి నిర్ణయం వాయిదావేసి, బస్రాకు బయలుదేరారు. కూఫా ప్రజలు కూడా ఆయన సైన్యంలో చేరారు. రెండు పక్షాలు బస్రా సమీపంలోని ఓచోటికి చేరుకొని ఎదురెదురుగా ఆగిపోయాయి.

యుద్ధ ప్రారంభానికి ముందు అలి(రజి) ప్రత్యర్థివర్గంలో ఉన్న జుబైర్ (రజి), తల్హా(రజి)లను పిలిపించి వారికి ప్రవక్త(స)హితోక్తులు గుర్తు చేస్తూ, యుద్ధంనుండి తొలిగిపొమ్మని చెప్పారు. దాంతో వారిద్దరు పరిస్థితి అర్థం చేసుకున్నారు. హజ్రత్ జుబైర్(రజి) యుద్ధమైదానం వదలి వేరే వైపుకు వెళ్ళిపోయారు. హజ్రత్ తల్హా(రజి) ఖడ్గం పారేసి ముందుపంక్తుల నుండి వెనుకపంక్తుల్లోకి పోయినిల్చున్నారు. అయితే అలి (రజి) పక్షంలో ఉన్న అమ్ర్ బిన్ జర్మూజ్ అనే ఓ దుర్మార్గుడు హజ్రత్ జబైర్ (రజి)ని, ఆయిషా (రజి) పక్షంలో ఉన్న మర్వాన్ బిన్‌హకమ్ అనే మరోదుర్మార్గుడు హజ్రత్ తల్హా(రజి)ని అన్యాయంగా పొట్టనబెట్టుకున్నారు. తరువాత హజ్రత్ జుబైర్ (రజి) హంతకుడు ఇబ్నెజర్మూజ్ సంతోషంతో భుజాలు ఎగరేస్తూ బహుమానం పొందడానికి అలి (రజి) దగ్గరకు వస్తే, ఆయన మండిపడుతూ ఆ దుర్మార్గుడికి నరక దుర్వార్త విన్పించారు.

యుద్ధం నివారించడానికి హజ్రత్ అలి(రజి) సంధికోసం అనేకసార్లు ప్రయత్నించారు. చివరికి ఓరోజు సాయంత్రం రాజీ కుదిరింది. మరునాడు దయం సంధిపత్రంపై సంతకాలు చేయవలసి ఉండింది. అయితే సంధి సంగతి తెలుసుకున్న 'సబాయీదుండగులు' ఆందోళనచెందారు. ఈసంధి విజయవంతమైతే ముస్లింలంతా ఏకమై తమ భరతం పడ్తారని భావించి వణికిపోయారు. అంచేత వారా రాత్రంతా నిద్రపోకుండా రహస్యమంత నాలు జరిపారు. చివరికి నాయకుని ఆదేశం ప్రకారం తెలతెల వారు తుండగా వారు దొంగచాటుగా వెళ్ళి హజ్రత్ ఆయిషా(రజి) సైన్యంపై మెరుపుదాడి చేశారు. దాంతో ఆ సైనికులు తమపై అలి(రజి) సైనికులు దాడిచేశారని భావించి అరుపులు, కేకలతో అప్రమత్తులైపోయారు.

ఈ గందరగోళానికి అలి (రజి) లేచి విచారిస్తే, ఇబ్నెసబా అనుచరులు "తల్హా, జుబైర్‌లు మన సైన్యంపై దాడిచేశారని, మనవాళ్ళు గత్యంతరం లేక ఆత్మరక్షణ పోరాటానికి సిద్ధమయ్యారని" అబద్ధమాడారు. అలి (రజి) ఈ మాట వినగానే సైనికుల్ని సమాయత్తపరిచారు. కొన్నిక్షణాల్లోనే యుద్ధ మైదానం వేడెక్కింది. కాని యుద్ధానికి దారితీసిన అసలు విషయం తెలియక ప్రతిమనిషీ ఎదుటి పక్షంవారినే దుర్మార్గులుగా భావించసాగాడు. చివరికి ఆయిషా (రజి) సైన్యం ప్రత్యర్థిసైన్యం ముందు నిలువలేక చేతు లెత్తేసింది. ముస్లింముఖయూదుడైన ఇబ్నెసబా కుట్ర ఫలితంగా రెండు పక్షాలకుచెందిన పదివేల మందికిపైగా ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. హి.శ. 36లో జరిగిన ఈ యుద్ధాన్ని "ఉష్ట్రయుద్ధం" అంటారు.

## మతపరమైన విభేదాలకు నాంది-11

ఇబ్నెసబా, అతని అనుచరులు ఆతర్వాత సమరసొత్తు పంపిణీ చేయ లేదన్న సాకుతో హజ్రత్ అలీ(రజి)కి ప్రత్యర్థులయి రహస్యంగా బస్రా నుంచి వేరేప్రాంతాలకు తరలిపోయారు. అంతటితో వారు తమ కుట్రల పరంపరకు తెరదించలేదు. వారు తమ దుష్టపథకంలోని ఒక భాగంగా ముస్లింలను రాజకీయపరంగా చీల్చి విజయం సాధించారు. ఇక రెండవ భాగమైన మతపరంగా ముస్లిం సముదాయాన్ని చీల్చవలసి ఉంది.

హజ్రత్ అలి(రజి) యుద్ధం ముగిసిన తర్వాత హజ్రత్ ఆయిషా (రజి) ను, ఇతర సహాబీలను ఎంతో గౌరవప్రదంగా మక్కా పంపివేశారు. ఆ తర్వాత రాజధానిని మదీనా నుండి కూఫాకు మార్చి, కేంద్రప్రభుత్వానికి అవిధేయుడైపోయిన అమీర్ ముఆవియా (రజి)ను దారికి తెచ్చేందుకు వివిధరాష్ట్రాల నుంచి నలభైవేల మంది సైనికుల్ని సమీకరించి సిరియా బయలుదేరారు. అటు సిరియాగవర్నర్ ముఆవియా(రజి) హజ్రత్ ఉస్మాన్ (రజి) రక్తసిక్త దుస్తుల్ని, ఆయనభార్య తెగిపోయిన చేతివ్రేళ్ళను ప్రజల ముందు అనేకసార్లు ప్రదర్శించి, వారిని తనకు అనుకూలంగా కూడగట్టి అరవైవేల మంది సైనికులతో బయలుదేరారు.



ఇలా ఉభయసేనలు ఫురాత్‌నదికి పశ్చిమదిశలోని సిఫ్ఫీన్ ప్రాంతానికి వచ్చిఆగాయి. మొదట సంధికోసం రెండుమూడు సార్లు చర్చలుజరిగాయి. అవి విఫలంకావడంతో చిన్నచిన్న దళాలతో స్వల్పస్థాయి యుద్ధాలు జరిగాయి. తర్వాత మళ్ళీ చర్చలు జరిగాయి. అవీ ఫలించకపోవడంతో తీవ్రస్థాయి యుద్ధాలు జరిగాయి. ఇలా కొన్నినెలలు గడిచాయి.

ఇరుపక్షాలలోనూ ఉన్న సహాబీలలో చాలామంది సత్యం ఏపక్షం వైపు న్నదో అర్థం చేసుకోలేకపోయారు. అయితే హజ్రత్ అలి(రజి) పక్షంలోని 'హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్' (రజి) గురించి దైవప్రవక్త (స) "నిన్ను ఓ తిరుగుబాటువర్గం వధిస్తుంద"ని భవిష్యత్‌వాణి పలికారు. ఈ యుద్ధంలో హజ్రత్ అమ్మార్ (రజి) ముఆవియా వర్గంతో పోరాడుతూ వధించబడ్డారు. దాంతో సత్యం అలి(రజి) వర్గంవైపే ఉందని, ముఆవియా (రజి) వర్గం వైపు లేదని, అది తిరుగుబాటు వర్గమని స్పష్టమైపోయింది.

ఈయుద్ధంలో ఇరుపక్షాలకు భారీప్రాణనష్టం జరిగింది. ముఆవియా (రజి) సైన్యంలోనే అధిక ప్రాణనష్టం జరిగింది. అంచేత ఆ సైనికులు తమ సేనాని ఆదేశంతో ఈటెలకు ఖుర్‌ఆన్ ప్రతులు కట్టి రాజీకి వచ్చారు.

సమస్య పరిష్కార కోసం ముఆవియా (రజి) తరఫున అమ్ర్ బిన్ ఆస్ (రజి), అలి(రజి) తరఫున అబూమూసా అష్‌అరీ (రజి)లు మధ్యవర్తులుగా నియమించబడ్డారు. వారిద్దరు ఆర్నెల్లలో తాము తీసుకుబోయే నిర్ణయం పై ఇరుపక్షాల తరఫున అంగీకారపత్రాలు తీసుకున్నారు. ఆ తర్వాత ఇరు పక్షాల సైన్యాలు తమతమ ప్రాంతాలకు తిరుగుప్రయాణమయ్యాయి. హిజ్రీశకం 37లో జరిగిన ఈ యుద్ధాన్ని "సిఫ్ఫీన్ యుద్ధం" అంటారు.

'సబాయీ దుండగులు' చర్చలు విఫలం చేయడానికి, రెండు సేనల మధ్య యుద్ధజ్వాలలు రగిలించడానికి తమవంతు పాత్ర కూడా నిర్వహిం చారు. అంతటితో ఊరుకోకుండా కూఫాకు తిరుగుప్రయాణంలో చర్చలు, యుద్ధ సందర్భాల్లో తీసుకోబడిన నిర్ణయాల్ని మతపరంగా సందేహాస్పదం చేయడానిక్కూడా ప్రయత్నించారు. దాంతో హజ్రత్ అలి (రజి) సైనికుల్లో

భిన్నస్వరాలు వ్యక్తమయ్యాయి. క్రమంగా ఈ భిన్నస్వరాలు విభేదాలుగా, విభేదాలు విద్వేషాలుగా మారిపోయాయి. యుద్ధానికి పోయేటప్పుడు ఎంతోక్రమశిక్షణతో ఉండిన సైనికులు తిరుగుప్రయాణంలో మతపరమైన విభేదాలు, విద్వేషాలతో విభిన్నవర్గాలుగా చీలిపోయారు.

ఇలా చీలినవారిలో రెండువర్గాలు ముఖ్యమైనవి. వాటిలోఒకటి "మన పనులన్నీ సలహాసంప్రదింపులతో, అధికసంఖ్యాకుల ఏకాభిప్రాయంతోనే జరగాలి. ఖలీఫా, నాయకుడు ఎవరూ ఉండరాదు. అలి, ముఆవియా ఇద్దరూ పాపాత్ములే" అని భావిస్తోంది. ఈవర్గాన్ని 'ఖార్జీవర్గం' అంటారు.

రెండోవర్గం హజ్రత్ అలీ(రజి)ని ఏ పాపం ఎరగని పరమపవిత్రునిగా, ప్రియాతిప్రియతమ నాయకునిగా భావిస్తోంది. ఖిలాఫత్ లేక నాయకత్వం హక్కు దైవప్రవక్త(స) తర్వాత అలీ(రజి)కి, ఆయన సంతతికి మాత్రమే ఉంటుందని అది నమ్ముతుంది. ఈ వర్గాన్ని 'షియావర్గం' అంటారు.

ఈ రెండు వర్గాలు తీవ్రమైన అతివాదం ఊబిలో కూరుకుపోయాయి. ఖార్జీవర్గీయులు హజ్రత్ అలీ(రజి)కి బద్ధశత్రువులయి, ఆ పుణ్యపురుషుడ్ని దూషించడానికి సైతం వెనుకాడేవారు కాదు. వారికి భిన్నంగా షియావర్గీయులు హజ్రత్ అలీ(రజి)కి వీరాభిమానులయి, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా(అలైహి) విషయంలో కూడా యూదులు, క్రైస్తవులు ఇలాంటి వైఖరే అవలంబించారు. యూదులు హజ్రత్ ఈసా(అలైహి)కు బద్ధశత్రువులై, ఆ పుణ్యపురుషుడ్ని చంపడానికి సైతం వెనుకాడ లేదు. వారికి భిన్నంగా క్రైస్తవులు హజ్రత్ ఈసా(అలైహి)కు వీరాభిమానులయి, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు.

ఈ రెండువర్గాలో ఒకవర్గం దైవాగ్రహానికి గురయింది. రెండోవర్గం రుజుమార్గం తప్పింది. అందుకే మన సృష్టికర్త "దేవా! మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులైనవారి మార్గమే మాకు చూపించు" (1:5-7) అని వేడుకోవాలని ఖుర్ఆన్‌లో మానవులకు ఉపదేశిస్తున్నాడు.



అయినప్పటికీ ఈనాడు సున్నీ ముస్లింలలో ఒక వర్గం షియాలకు తామేమీ తీసిపోమని, మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని దాదాపు దేవుని స్థాయికి చేర్చింది. ఆయన మానవమాత్రుడు కాదని, అగోచర జ్ఞానసంపన్నుడని, ముస్లింలు ఎన్ని పాపాలు చేసినా ఆ మహనీయుని (సల్లం) సిఫారసుతో నరకశిక్షకు గురికాకుండా నేరుగా స్వర్గానికి చేరుతామని ఆశలు పెట్టుకుంది. అదీగాక ఈ వర్గం శుద్ధ ఏకదైవారాధకుల పట్ల ద్వేషం కూడా పెంచుకుంది.

సిప్ఫీన్ యుద్ధసమయంలో జరిగిన సంధి ప్రకారం రెండు పక్షాలు నియమించిన మధ్యవర్తులు ఆ తరువాత ఖిలాఫత్ హక్కు విషయమై చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు. కాని ప్రజల ముందు దాన్ని వ్యక్త పరచడంలో ఒక మధ్యవర్తి తన ప్రత్యర్థి మధ్యవర్తిని మోసగించడంతో మోసపోయిన మధ్యవర్తి తరపు ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వీలుచిక్కితే కాటువేయడానికి అలి(రజి) వర్గంలో కాచుకొనివున్న 'సబాయిదుండగులు' అలీ (రజి)తో "దేవుడ్ని వదలి మానవుల్ని (మధ్యవర్తుల్ని) న్యాయనిర్ణేతలుగా అంగీకరించి మీరు అవిశ్వాసి అయిపోయార"ంటూ ఆయనకు ప్రత్యర్థులై కూఫా నుంచి 'నహ్రెవాన్' వెళ్ళిపోయారు.

ప్రారంభంలో హజ్రత్ అలీ(రజి)కి మద్దతుదారులుగా ప్రకటించుకొని, కుట్రలతో ముస్లింలలో విభేదాలు సృష్టించి, అరాచకం రేపి హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పొట్టనబెట్టుకున్న సబాయిదుండగులు ఆ తరువాత రాజకీయంగా రెండువర్గాలుగా విడిపోయిన ముస్లింలలో యుద్ధజ్వాలలు రాజేసి, చివరికి హజ్రత్ అలీ(రజి)కి కూడా శత్రువులైపోయారు. పైగా తాము విభేదించిన విషయానికి మతరంగు పులిమి, తమతో విభేదించిన ముస్లింలను అవిశ్వాసులుగా జమకట్టి హతమార్చడం ప్రారంభించారు.

హజ్రత్ అలి(రజి) ఈవార్త విని 40వేల సైన్యంతో నహ్రెవాన్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన చేసిన హితోపదేశం, హెచ్చరికలతో 25 వేల మంది సబాయివర్గంసైనికుల్లో దాదాపు 17 వేలమంది పక్కకు తప్పుకు

న్నారు. వారిలో కొందరు హజ్రత్ అలి (రజి) వర్గంలో చేరిపోతే, మరి కొందరు వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారు. 9 మంది మాత్రం ఎలాగో తప్పించుకున్నారు. మిగిలినవారు హజ్రత్ అలి(రజి) సైన్యంతో పోరాడి నేలకొరిగారు. ఈ యుద్ధాన్ని 'నహ్రెవాన్ యుద్ధం' అంటారు.

నహ్రెవాన్ యుద్ధానికి ఎంతో ఉత్సాహంతో బయలుదేరిన అలి(రజి) వర్గం సైనికులు సిరియాపై దాడిచేయడానికి పిలిస్తే అందుకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. వారి అనాసక్తి, అంతర్విభేదాల కారణంగా ఈజిప్టు, అరేబియాలు హజ్రత్ అలి(రజి) నుండి చేజారి అమీర్ ముఆవియా (రజి) స్వాధీనంలోకి పోయాయి. ఈరాన్, ఇరాఖ్‌లు మాత్రమే అలి(రజి) స్వాధీనంలో మిగిలిపోయాయి. అవి కూడా ఏమంత పటిష్ఠంగా లేవు. అమీర్ ముఆవియా (రజి) వర్గంలో ఆయనకు సానుభూతిపరులైన అరబ్బులు అత్యధికంగా ఉంటే, హజ్రత్ అలి(రజి) వర్గంలో ఆయనపట్ల సానుభూతి లేని అరబ్బేతరులు అత్యధికంగా ఉన్నారు. అందువల్ల ఈ రెండు వర్గాల మధ్య విద్వేషాగ్ని నిరంతరం మండుతుండేది.

ఇక్కడ ముస్లింలలో ఇలా అంతఃకలహాలు, అంతర్యుద్ధాలు సాగుతుంటే మరోవైపు రోమన్లు, క్రైస్తవులు ఈ అంతఃకలహాలతో తమ రాజ్యవిస్తరణ ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నించారు. అలి(రజి) అధీనంలోని ఇరాఖ్‌పై దాడిచేస్తే, అలి(రజి) ప్రత్యర్థి ముఆవియా (రజి) తమతో సహకరిస్తారని లేదా కనీసం సంతోషిస్తారని భావించి వారు యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు.

హజ్రత్ ముఆవియా (రజి)కు ఈ సంగతి తెలియగానే ఆయన రోమ్ చక్రవర్తి సీజర్‌ను ఓ ఉత్తరం ద్వారా "నీవు గనక అలి(రజి) మీద దాడి చేయడానికి వస్తే, నీపని పట్టడానికి అలి(రజి) సైన్యంలో అందరికంటే ముందుండే దండనాయకుడు ముఆవియయే అవుతాడు" అని తీవ్రంగా హెచ్చరించారు. ఈ హెచ్చరికతో రోమ్‌చక్రవర్తి తోకముడిచి యుద్ధనిర్ణయం మానుకున్నాడు.



## ముస్లిం రాజ్యాధినేతల హత్యకు కుట్ర-12

'నహ్రెవాన్'యుద్ధంలో తప్పించుకున్న 9మంది సబాయి దుండగులు ఈ పరిస్థితిని వాడుకుంటూ హజ్రాత్ అలి, ముఆవియా, (ఈజిప్టులో) అమ్ర్ బిన్ ఆస్ (రజి)లను ఒకేసారి చంపడానికి కుట్రపన్నారు.

దానిప్రకారం నిర్ణీతతేదీన డెమాస్కస్ జామియామస్జిద్‌లో ఫజర్‌నమాజ్ చేయిస్తున్న అమీర్ ముఆవియా (రజి)పై కత్తి వేటువేసి పారిపోయారు. అయితే ముఆవియా(రజి) చిన్నగాయంతో బ్రతికిపోయారు. కొన్నాళ్ళకు గాయం మానిపోయింది. హంతకుడు పట్టుబడి హతమార్చబడ్డాడు. ఈజిప్టులో ఆరోజు అమ్ర్ బిన్ ఆస్(రజి) జబ్బుపడటం వల్ల నమాజ్ చేయించడానికి ఆయన తనస్థానంలో ఓ సైనికాధికారిని నియమించారు. దుండగుడు ఆయన్నే అమ్ర్ బిన్ ఆస్(రజి) అనుకొని హతమార్చాడు. అదేరోజు మరోదుండగుడు కూఫా జామియామస్జిద్‌లో ఫజర్‌వేళ హజ్రత్ అలి(రజి)ని వధించాడు. హజ్రత్ అలి(రజి) ఆ గాయంతో రెండు రోజుల తర్వాత 63ఏండ్ల వయస్సులో, అయిదేండ్ల ఖిలాఫత్‌పాలన తర్వాత హి.శ. 40వ ఏట రమజాన్ నెల 17వ తేదీన అమరగతులయ్యారు.

హజ్రత్ అలి(రజి) అమరగతి తరువాత (కూఫా రాజధానిగా ఉండిన) ఇరాఖ్‌ప్రజలు ఆయన పెద్దకుమారుడు ఇమామ్ హసన్(రజి)ని ఖలీఫాగా ఎన్నుకున్నారు. కొన్నాళ్ళకు సిరియా నుంచి అమీర్ ముఆవియా (రజి) 60 వేల సైన్యంతో కూఫాపై దాడిచేయడానికి వస్తున్నారని తెలిసి ఇమామ్ హసన్ 40వేల సైన్యంతో కూఫా నుండి బయలుదేరారు. మార్గమధ్యలో ఓచోట ఆగి సైనికుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ "దైవసాక్షి! నాకు ఎవరిపట్లా ద్వేషం లేదు. నేను అనైక్యత, విరోధాల కంటే శాంతి, సంధి, సమైక్యతలే శ్రేష్ఠమైనవని భావిస్తున్నాను" అని అన్నారు.

ఆయన సైన్యంలో ఉన్న ఖార్జీలు, కపటులు ఈ మాటలు వినగానే ఇమామ్ హసన్(రజి) అవిశ్వాసి (కాఫిర్) అయిపోయారని ప్రచారం చేశారు. ఈ దుష్ప్రచారానికి ప్రభావితులైన అనేకమంది సైనికులు పెద్ద అలజడి

రేపుతూ ఇమామ్ హసన్ (రజి)ని చుట్టుముట్టారు. ఆయన శిబిరాన్ని ధ్వంసం చేసి ఆయన చొక్కా లాగి చింపివేశారు. ఇమామ్ హసన్ (రజి) వెంటనే గుర్రమెక్కి రబియా, హమ్దాన్ తెగల సహకారంతో దుండగుల బారినుండి తప్పించుకున్నారు.

ఈ చేదుఅనుభవం చవిచూసిన ఇమామ్ హసన్(రజి) ఇరాఖ్‌ప్రజలు నిలకడలేని మనుషులని తెలుసుకొని ముఆవియా (రజి)తో సంధి చేసుకున్నారు. సంధిప్రకారం హి.శ. 41లో ముఆవియా(రజి)ను యావత్ ఇస్లామీయ సామ్రాజ్యానికి ఏకైక ఖలీఫాగా అంగీకరిస్తూ 'బైత్' చేసి ఇరాఖ్ ఖిలాఫత్ నుంచి తప్పుకున్నారు. ఈవిధంగా ఆయన "నాయీ కుమారుడు నాయకుడు. దేవుడు ఇతని ద్వారా రెండు ముస్లింవర్గాల మధ్య సయోధ్య కుదురుస్తాడు" అనే దైవప్రవక్త (స) భవిష్యవాణిని నిజం చేశారు.

ముస్లింసముదాయంలో విభేదాలు సృష్టించి నిరంతరం యుద్ధజ్వాలలు రగిల్చే (ఖార్జీలైన) సబాయీదుండగులు ఈసంధితో తీవ్రంగా నిరుత్సాహపడ్డారు. వారి కుట్రలకు బ్రేకుపడింది. ఆ తరువాత దాదాపు పదేళ్ళపాటు ముస్లింల అంతర్‌యుద్ధాలు ఆగిపోయాయి. అమీర్ ముఆవియా (రజి) ఖార్జీలందర్నీ పూర్తిగా అణచివేసి విదేశీరాజ్యాల ప్రమాదం వైపు దృష్టి కేంద్రీకరించారు. రోమ్‌రాజ్యం రాజధాని కాన్‌స్టాంటినోపిల్‌ని కొంతకాలం పాటు దిగ్బంధించడం ద్వారా రోమన్‌లను బెదరగొట్టి అటువైపున్న ఇస్లాం సామ్రాజ్య సరిహద్దుల్ని పటిష్ఠపరిచారు. ఆఫ్రికాలోని అల్జీరియా, సూడాన్, మరికొన్ని ఆటవిక జాతులుండే ప్రాంతాల్లో, భారతఉపఖండం-బెలుచిస్తాన్‌లోని కొన్నిప్రాంతాల్లో కూడ ముస్లింలు విజయపతాకాలు ఎగరవేశారు.

హి.శ. 51లో ఇమామ్ హసన్ (రజి), కూఫా గవర్నర్ ముగైరా బిన్ షాబ (రజి) చనిపోవడం, అమీర్ ముఆవియా (రజి) తన కొడుకు యజీద్‌ని ఖిలాఫత్ పదవికి తన వారసునిగా ప్రకటించడం జరిగిన తర్వాత ముస్లింలలో అంతర్‌యుద్ధాలు మళ్ళీ మొదలయ్యాయి. మదీనాగవర్నర్ మర్వాన్ బిన్ హకమ్, కూఫా-బస్రాల గవర్నర్ జియాద్ బిన్ అబూసుఫ్యాన్‌ల



ద్వారా అమీర్ ముఆవియా(రజి) ఎలాగో యజీద్ ఖిలాఫత్ వారసత్వానికి దాదాపు ప్రజలందరి అంగీకారం సంపాదించగలిగారు. కాని ఇమామ్ హుసైన్ బిన్ అలి (రజి), అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)లు తిరస్కరించడంతో ముఆవియా (రజి) ఆ నలుగురిని బలవంతం చేయకుండా వదిలేశారు.

హి.శ.58లో మర్వాన్ బిన్ హకం కుట్ర ఫలితంగా విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా(రజి) మరణం, హి.శ.59లో హజ్రత్ అబూహురైరా (రజి) మరణం, హి.శ.60లో అమీర్ ముఆవియా (రజి) మరణం తర్వాత యజీద్ పాలనలో ముస్లింలపై దుర్భర దౌర్జన్యకాండలు మొదలయ్యాయి.

ఉత్తరాలద్వారా కూఫాప్రజలు ఇచ్చిన మద్దతుతో యుద్ధానికి బయలుదేరిన ఇమామ్ హుసైన్ బిన్ అలి(రజి) వారి పిరికితనం వల్ల హి.శ. 61లో యజీద్ సైనికుల రక్తదాహానికి బలైపోయారు. ఆ సైనికులు ఇమామ్ హుసైన్(రజి) శిరస్సును ఖండించి, ఆయన మొండెంపై గుర్రాలు పరుగెత్తించారు. హి.శ.63లో మదీనాలో సామూహిక హత్యలు, లూటీలు, మానభంగాలతో అక్కడి ప్రజలపై ప్రళయం విరుచుకుపడింది. "ఏ మనిషి అయినా మదీనా ప్రజలకు కీడు తలపెడ్తే దేవుడు అతడ్ని నరకాగ్నిలో పడేసి సీసంలా కరగిస్తాడు" అనే దైవప్రవక్త (స) హితోక్తిని సైతం విస్మరించి ఆ దుర్మార్గులు ఘోరాతిఘోరమైన ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

ఆ తరువాత కూడా ప్రజలపై హింసాకాండల పరంపర శతాబ్దాల తరబడి సాగింది. హి.శ.41వ సంవత్సరంలో ప్రారంభమైన బనూఉమయ్యా పాలకుల పరిపాలనాకాలాల్లో బనూఅబ్బాసీ ప్రజలపై, ఆ తర్వాత బనూ అబ్బాసీ పాలకుల పరిపాలనాకాలాల్లో బనూఉమయ్యా ప్రజలపై జరిగిన దౌర్జన్యకాండలు ఇస్లాం చరిత్రలో మాయనిమచ్చలుగా మిగిలిపోయాయి.

అమీర్ ముఆవియా(రజి) కాలంలో కూఫాగవర్నర్‌గా ఉండిన జియాద్ బిన్ అబూసుఫ్యాన్ కపటముస్లింలు, 'సబాయీదుండగుల'తో కూడిన ఖార్జీలందరినీ దాదాపు అంతమొందించాడు. అయితే వారి కుట్రలు,

దుష్టపథకాలు పుణికిపుచ్చుకున్నవారు ఈనాడు కూడా ప్రపంచమంతటా విస్తరించివున్నారు. వారు గ్రంథప్రజలు, బహుదైవారాధకుల రూపాల్లోనే గాకుండా కపటముస్లింల రూపాల్లో కూడా ఉండవచ్చు. నేడు ఇస్లాంపై, ముస్లింలపై, ముస్లిందేశాలపై జరుగుతున్న వివిధరకాల దాడులకు ఈ దుష్టశక్తులే మూలకారణం.

## గ్రంథప్రజల అడుగుజాడల్లో ముస్లింలు-13

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) భవిష్యత్తులో ముస్లింల విశ్వాస బలహీనత, ఆచరణల దుస్థితి గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

"గతంలో ఇస్రాయీల్ సంతతి ప్రజలకు వచ్చి నటువంటి కాలం నా అనుచర సముదాయానికి తప్పకుండా వస్తుంది, ఒక పాదరక్ష మరోక పాదరక్షను పోలినట్లు. ఇస్రాయీల్ సంతతిలో ఎవరైనా తన తల్లితో వ్యభిచరించిఉంటే, నా అనుచర సముదాయంలో కూడా అలాంటి వారుంటారు. ఇస్రాయీల్‌సంతతిలో 72 మతవర్గాలు ఏర్పాడ్డాయి. అలాగే నా అనుచరసముదాయంలో కూడా 72 మతవర్గాలు ఏర్పడుతాయి. వాటిలో ఒక్క వర్గం తప్ప మిగిలిన వర్గాలన్నీ నరకానికి పోతాయి."

అప్పుడు కొందరు అనుచరులు "స్వర్గానికి పోయేవారు ఎవరూ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నేను, నా అనుచరులు నడిచినబాటలో నడిచేవారు" అని తెలిపారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స), ఆయన అనుచరులు నడచిన బాట తెలుసుకోవడానికి ముస్లింల దగ్గర నేటికీ ఖుర్ఆన్, హదీసులు సురక్షితంగా ఉన్నాయి. కాని నేటి ముస్లింలు ఖుర్ఆన్, హదీసులు వదిలేసి అంధానుకరణకు గురయి పోయి విభిన్న వర్గాలుగా చీలిపోయారు.

"స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్పటికీ పరస్పరం విభేదించు కొని విభిన్నవర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి. అలాంటివారికి ఘోరమైన (నరక) యాతనలు కాచుకొని ఉన్నాయి." (ఖుర్ఆన్-3:105)



పైసూక్తి యూదులు, క్రైస్తవుల వైపు సూచిస్తోంది. వీరు తమకు రుజు మార్గం చూపడానికి దైవప్రవక్తలు, దివ్యగ్రంథాలు రాకపోవడంతో అజ్ఞానం కారణంగా పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోలేదు. దైవ ప్రవక్తలు, దివ్యగ్రంథాల ద్వారా స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చిన తరువాతే పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోయారు. వారి ధర్మవేత్తలు డబ్బు కోసం దైవగ్రంథాలయిన తౌరాత్, ఇన్జీల్‌లను మార్పు లకు, చేర్పులకు గురిచేయడంవల్ల జనం విభేదాలలో పడి చీలిపోయారు. వారికి స్వార్థపరులైన ధనికులు, పాలకులు వత్తాసు పలికారు. పేదలకు, బలహీనులకు మతపరంగా చాలా అన్యాయం జరిగేది.

"గ్రంథప్రజలకు గుర్తు చెయ్యి: "మీకు ప్రసాదించబడిన గ్రంథంలోని విషయాలు దాచకుండా (యధాతథంగా) ప్రజలకు బోధించాలి" అని దేవుడు వారిచేత ప్రమాణం చేయించాడు. కాని ఆ తర్వాత వారు దాన్ని అటకా కెక్కించారు. అతిస్వల్ప మూల్యానికి అమ్మివేశారు. ఇలా వారు అతినీచమైన సంపాదనకు పాల్పడ్డారు." (ఖుర్ఆన్-3:187)

"వారు తమ ప్రమాణం ఉల్లంఘించినందువల్లనే మేము వారిని మా కారుణ్యానికి దూరంగా విసిరేసి, వారి హృదయాలను కఠినంచేశాం. చివరికి వారిప్పుడు దైవవాక్కుల్ని తారుమారుచేసే స్థితికి దిగజారిపోయారు. తమకు బోధించిన ఉపదేశాల్లో అత్యధిక భాగం విస్మరించారు. వారు పాల్పడుతున్న మోసాల్లో ఏదోఒకటి ఈనాడూ నీ దృష్టికి వస్తూనేఉంది. వారిలో బహుకొద్ది మంది మాత్రమే ఈ బలహీనతకు దూరంగా ఉన్నారు." (ఖుర్ఆన్-5:13)

ఖుర్ఆన్ దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే "సత్యతిరస్కారులు" (కాఫిరూన్) అని 5:44వ సూక్తిలో, "దుర్మార్గులు" (జాలిమూన్) అని 5:45వ సూక్తిలో, "దుర్జనుల" (ఫాసిఖూన్) అని 5:47వ సూక్తిలో చెప్పబడింది. జీవితంలోని ఏరంగంలోనైనా దైవాజ్ఞలు, దైవచట్టాల ప్రకారమే మనిషి తన వ్యవహారాలు పరిష్కరించుకోవాలి. అలా చేయని వారిని ఈ సూక్తులలో తీవ్రంగా హెచ్చరించడం జరిగింది.

అయితే కొందరు ముస్లింలు ఈ సూక్తులను యూదులకు, క్రైస్తవులకు మాత్రమే వర్తింపజేయడానికి ప్రయత్నించారు. కాని ప్రముఖ సహాబీ హజ్రత్ హుజైఫా (రజి) దీనికి చక్కని సమాధానమిచ్చారు. ఆయనతో ఒకతను "ఈ మూడుసూక్తులు ఇస్రాయీలీలకు సంబంధించినవి కదా?" అన్నాడు. దానికి హజ్రత్ హుజైఫా (రజి) ఇలా అన్నారు: "ఈ ఇస్రాయీలీలు మీకోసం ఎంతమంచి సోదరులు! చేదువిషయలన్నీ వారి కొరకునూ, తియ్యటి విషయాలన్నీ మీ కొరకునా!! అలా ఎన్నటికీ కాదు. దైవసాక్షి! మీరు వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు."

"వారు (చెడ్డపని చేసినప్పుడల్లా) 'మేము క్షమించబడతామని ఆశిస్తున్నాం' అంటారు (లేనిపోని ఆశలతో ఆత్మవంచనకు పాల్పడుతూ). అందువల్లనే వారిముందుకు ఏదైనా ఐహికసంపద వస్తేచాలు, దాని మీదికి లంఘిస్తారు. దేవుని పేరుమీద ఏంమాట్లాడినా సత్యం, న్యాయమే మాట్లాడాలని దైవ గ్రంథం గురించి వారిచేత ప్రమాణం చేయించ లేదా? వారు గ్రంథంలోని విషయాలు చదివిఉన్నారు. (అయినా పాపకార్యాలుచేస్తూ దేవుడు తమను క్షమిస్తాడని భ్రమపడుతున్నారు.)" (ఖుర్ఆన్-7:169)

"మేము వారిని అనేక జాతులుగా చీల్చి లోకంలో చెల్లాచెదురు చేశాము. వారిలో కొందరు సజ్జనులుంటే మరికొందరు వేరేవారున్నారు. వారిని మేము మంచివైపు తిరిగొస్తారేమోనని మంచిస్థితి ద్వారా, దుస్థితి ద్వారా పరీక్షకు గురిచేశాం. పూర్వతరాలు గతించిన తర్వాత అంతకంటే దిగజారిన తరాలు వారికి ప్రాతినిధ్యం వహించాయి. వీరు దైవగ్రంథానికి వారసులై కూడా తుచ్ఛమైన ప్రాపంచికప్రయోజనాల వెంటపడ్డారు." (ఖుర్ఆన్-7:168)

ఈనాడు ముస్లింల పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది. ఆచరణ ఎలా ఉన్నా తాము ముస్లింలు గనక దేవుడు తమను క్షమిస్తాడని, తమ దైవప్రవక్త (స) సిఫారసుతో ఎలాగైనా స్వర్గానికి చేరుతామని వారు లేని పోని ఆశలు పెట్టుకున్నారు. ఈ లేనిపోని ఆశల కారణంగానే వారు తమ విధ్యుక్తధర్మాన్ని విస్మరించి ప్రాపంచిక ప్రయోజనాల వెంటపడ్డారు.



## ప్రళయకాల సమీపంలోని ముస్లింలు-14

చెడుల్ని అరికట్టడం, మంచిని పెంచడం, ముస్లింల విధి. ముస్లింలు ఈవిధి నిర్వహించకుండా పాపకార్యాల్లో కూరుకుపోతే వారు కూడా ప్రపంచంలో దైవశిక్ష చవిచూడవలసివస్తుంది. దైవప్రవక్త(స) ఇలా తెలిపారు:

"నా అనుచరసమాజంలో ఎప్పుడైతే పదిహేను (దుర్)లక్షణాలు చోటు చేసుకుంటాయో అప్పుడు దానిపై ఆపదలు రావడం మొదలవుతాయి." (కొందరీ మాట విని) 'అయితే దైవప్రవక్తా! ఆ లక్షణాలు ఏమిటీ?' అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఈవిధంగా సెలవిచ్చారు:

(1) ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తులుగా పరిగణించడం. (2) అమానత్ (భద్ర పరచడానికి అప్పగించబడిన సొత్తు)ను సమరసొత్తు (మాలెగనీమత్)గా తలచడం. (3) (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ ధనాన్ని జరిమానాగా భావించడం. (4) భర్త తన భార్యకు విధేయుడైపోవడం. (5) కొడుకు తన తల్లి పట్ల అవిధేయుడయి ప్రవర్తించడం. (6) మనిషి తన స్నేహితులకు మాత్రమే మేలుచేసి, (7) తన తండ్రిపై దౌర్జన్యం చేయడం. (8) మసీదులో అల్లరి చేయడం. (9) ఒక జాతిలోని అత్యంత నీచుడు ఆజాతికి నాయకుడై పోవడం. (10) వ్యక్తిలోని చెడుకు భయపడి జనం అతడ్ని గౌరవించడం. (11) మత్తు పదార్థాలను బహిరంగంగా వినియోగించడం. (12) పురుషులు పట్టువస్త్రాలు ధరించడం. (13) సంగీత వాయిద్యాలను అవలంబించడం. (14) గాయకురాళ్ళను సమావేశ పరచడం. (15) అప్పటి ప్రజలు తమ పూర్వీకులను నిందించడం, దూషించడం.

ఈ లక్షణాలు చోటుచేసుకోవడం ప్రారంభించగానే ప్రజలు ఇక ఎల్లవేళలా దైవశిక్ష కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈశిక్ష ఎర్రటి గాలిదుమారం రూపంలోనైనా రావచ్చు, లేదా భూకంపం రూపంలోనైనా రావచ్చు, లేదా సబ్బత్ (శనివారం) వాళ్ళకు వచ్చినట్లు ముఖాలు వికృతంగా మార్చివేసే శిక్షయినా రావచ్చు." (తిర్మిజి)

దైవదూత జిబ్రీల్ (అలైహి) ప్రళయసూచనలను గురించి అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "ఆ సూచనల్లో ఒకటి, బానిస మహిళ తన యజమానురాలిని కంటుంది. (అంటే కుమార్తెలు తమతల్లుల మీద పెత్తనం చెలాయిస్తూ వారిచేత చాకిరి చేయించుకుంటారు.) రెండవ సూచన, కాళ్ళకు చెప్పులు, ఒంటికి సరిపడదుస్తులు లేకుండా మేకలు కాసేవారు పెద్దపెద్ద భవంతులు కట్టడం మొదలెడతారు. ఆ విషయంలో వారు ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నిస్తారు." (బుఖారి, ముస్లిం)

బుఖారి గ్రంథంలోని హదీసుల ప్రకారం ముస్లింలలో సంభవించే అంతఃకలహాలను గురించి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

'రెండు పెద్దవర్గాలు పోట్లాడుకొని వారిమధ్య తీవ్రంగా యుద్ధం జరగనంతవరకు ప్రళయంరాదు. ఆ రెండు వర్గాల వాదన ఒక్కటే"; "సమీప కాలంలో మీ మధ్య కల్లోలాలు చెలరేగుతాయి. అప్పుడు నిలబడినవాని కంటే కూర్చున్నవాడు, నడుస్తున్న వానికంటే నిలబడి ఉన్నవాడు, పరుగెత్తుతున్న వానికంటే నడుస్తున్నవాడు క్షేమంగా ఉంటారు. ఆ కల్లోలాల వైపు ఎవరైనా తొంగిచూసినా అవి అతడ్ని తమ వైపుకు లాక్కుంటాయి. ఆ పరిస్థితిలో ఎవరికే ఆశ్రయం దొరికితే అతనా ఆశ్రయంలో దాక్కోవాలి."

ఈ కలహాలు ఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) పాలనాకాలం నుంచి ప్రారంభమయి ఇమామ్ హుసైన్ (రజి) అమరగతితో తగ్గుముఖం పట్టాయి. దైవప్రవక్త (స) చెప్పిన మరికొన్ని భవిష్యత్ ప్రకటనలు చూడండి:

"మీరు తప్పకుండా యూదులు, క్రైస్తవుల్లా మసీదుల్ని అలంకరిస్తారు." (అబూదావూద్); "మీరు మసీదుల్ని అలంకరించడం, ఖుర్ఆన్ గ్రంథాలను అందంగా తీర్చిదిద్దడం ప్రారంభించగానే మీ వినాశకాలం సమీపించిందని గ్రహించండి." (కన్జుల్అమాల్)

"ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ప్రజలు తమ ప్రాపంచిక విషయాల్ని మసీదులలో మాట్లాడుకుంటారు. మీరు వారి దగ్గర కూర్చోకండి. దేవునికి వారి అవసరం ఎంత మాత్రం లేదు." (బైహఖి)



"వినండి! నాకు నిస్సందేహంగా ఖుర్ఆన్ ఇవ్వబడింది. అలాగే ఖుర్ఆన్ ఆజ్ఞల్లాంటి ఇతర ఆజ్ఞలు(హదీసులు) కూడా ఇవ్వబడ్డాయి....జాగ్రత్త! ఒక కాలం రానున్నది. ఆ కాలంలో కడుపునిండిన వాడొకడు హాయిగా కూర్చొని 'మీకు ఖుర్ఆన్ ఒక్కటే చాలు. అందులో ధర్మసమ్మతమైనవని తెలిపిన వాటిని ధర్మసమ్మతమైనవిగా, నిషిద్ధమైనవని తెలిపిన వాటిని నిషిద్ధమైనవిగా భావించండి. (హదీసు మనకవసరం లేదు.)' అని అంటాడు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఓసారి ఇలా తెలిపారు: "(ముస్లింలారా!) ఉదయం ఒక జతబట్టలు, సాయంత్రం ఒకజత బట్టలు ధరించి ఇళ్ళ నుండి బయలుదేరే కాలం వచ్చినప్పుడు మీ పరిస్థితి ఎలా ఉంటుంది? ఆ కాలంలో మీ ముందు ఒక గిన్నె ఉంచబడుతుంది, మరోగిన్నె మీముందు నుంచి తీసేయబడుతుంది. కాబాకు వేలాడదీసినట్లు ఆ కాలంలో మీరు మీ ఇండ్లకు ఖరీదైన పరదాలు వేలాడదీస్తారు."

ప్రవక్త అనుచరులు (రజి) ఈ మాటలు విని "అయితే దైవప్రవక్తా! ఈనాటికన్నా రాబోయే కాలంలో మా పరిస్థితి చాలా మెరుగ్గా ఉంటుందన్న మాట. సంపాదన కోసం ఎక్కువగా కష్టపడవలసిన అవసరముండదు. ఆరాధన కోసం మాకు కావలసినంత సమయం దొరుకుతుంది కదా!" అని అన్నారు. దైవప్రవక్త (స) వారి మాటలను ఖండిస్తూ "కాదు. మీరు రాబోయే ఆ రోజులకంటే ఈనాడే మంచివాళ్ళు. (ఈనాడు మీరు సిరిసంపదలరీత్యా పేదలయిన్నప్పటికీ విశ్వాసంరీత్యా ఎంతో భాగ్యవంతులు. ఆ కాలంలో మీరు సిరిసంపదలరీత్యా భాగ్యవంతులయినప్పటికీ విశ్వాసం రీత్యా చాలా పేదవాళ్ళుగా ఉంటారు)" అని చెప్పారు. (తిర్మిజి)

కొన్ని హదీసులలో "మనిషి అక్రమ సంపాదన-సక్రమసంపాదన అనే విషయాన్ని పట్టించుకోకుండా ఎలాగైనా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకునే రోజులు వస్తాయి" అని; మరికొన్ని హదీసులలో "వడ్డీ తినని వారంటూ ఉండని రోజులు వస్తాయి. ఒకవేళ ఎవరైనా వడ్డీ తినకపోయినా వారిపై వడ్డీధూళి మాత్రం వచ్చిపడుతుంద"ని ఉంది.

హజ్రత్ సౌబాన్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (స) హితబోధ చేస్తూ ఇలా ప్రవచించారు: "మిమ్మల్ని అంతమొందించడానికి త్వరలోనే (సత్యవ్యతిరేక) జాతులన్నీ ఏకమయ్యే కాలం రానున్నది. భోజనం చేసేవారు ఒకర్నొకరు పిలుచుకుంటూ కంచాల మీద ఎగబడినట్లు వారు మీమీద విరుచుకుపడతారు." ఒకతను ఈమాట విని "ఆ కాలంలో మా జనాభా తక్కువగా ఉంటుందా?" అని ప్రశ్నించాడు.

దానికి దైవప్రవక్త (స) "తక్కువగా ఉండదు. ఆ కాలంలో మీ జనాభా అత్యధికంగా ఉంటుంది. అయితే (వరదనీటి నురుగులా లేక) వరదనీటిలో కొట్టుకుపోయే గడ్డిపోచల్లా ఉంటారు మీరు. దేవుడు మీ శత్రువుల హృదయాల నుండి మీపట్ల ఉన్న భయాన్ని తీసివేస్తాడు. మీ హృదయాల్లో పిరికితనం చోటుచేసుకుంటుంది" అని చెప్పారు. అప్పుడు ఒకతను "ఈ పిరికితనం ఎందువల్ల వస్తుంది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "మీరు ప్రాపంచిక వ్యామోహానికి గురవుతారు; మృత్యువుని అసహ్యించుకుంటారు" అని జవాబిచ్చారు. (అబూదావూద్)

ప్రాపంచికవ్యామోహం, పరలోకపు జవాబుదారిభావనల పట్ల ఏమరుపాటులే ముస్లింలను పిరికిపందలుగా చేసింది. ఈ రెండు విషయాలు వారిని ఖుర్ఆన్ బోధనలక్కూడా దూరంచేసింది. నమాజ్, రోజాలు పాటించేవారిలో సైతం సమైక్యతా సోదరభావాలు సన్నిగిల్లిపోయాయి. ఒక ముస్లింపై దౌర్జన్యం జరుగుతుంటే తోటిముస్లిం తనకేమీ పట్టనట్లు చూస్తుండిపోతున్నాడు. ఒకవర్గానికి అన్యాయం జరుగుతుంటే మరొకవర్గం సంబరపడిపోతోంది. చివరికి ఒక ముస్లింకు మరొకముస్లిం ఎదురైనప్పుడు వారిలో ప్రతి ఒక్కడూ మరొకడికి సలాం చేయడంలో ముందంజవేయడం తన వ్యక్తిత్వానికి నామోషిగా భావిస్తున్నాడు. మణిహారం తెగిన తర్వాత దారం పట్టుకొని పరుల ముందు దేబరించినట్లయింది నేటి ముస్లింల పరిస్థితి.

'మేము సృష్టించినవారిలో ఒకవర్గం (సదా) సత్యం వైపుకే దారిచూపుతుంది; సత్యానికి అనుగుణంగానే నిర్ణయాలు చేస్తుంది." (ఖుర్ఆన్-7:181)



ఇది నిరాశాచీకటిలో ఓ ఆశాకిరణం. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"నా అనుచరసముదాయంలో ఒక వర్గం దైవాజ్ఞలు పాటించడంలో ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. జీవితాంతం అలాగే ఉంటుంది. వ్యతిరేకత, సహాయనిరాకరణలు దానికి ఏమాత్రం నష్టం కలిగించలేవు." (మిష్కాత్)

"నా సముదాయానికి చెందిన అంత్యకాలంలో ఉండేవారికి వారికి పూర్వముండినవారికి లభించిన పుణ్యఫలమే లభిస్తుంది. వారు సత్కార్యాల్ని గురించి ఆదేశిస్తారు; చెడుల నుండి వారిస్తారు; అల్లర్లు, అలజడులు రేకెత్తించేవారితో పోరాడుతారు." (బైహఖి)

## ఆంగ్లేయుల రాజనీతికి బలైనవారు-15

ముస్లింల దుస్థితికి అసలుకారణం ఆనాడయినా, ఈనాడయినా వారు ఖుర్ఆన్ బోధనలకు దూరమయి అంతగా ప్రాధాన్యంలేని విషయాల్ని గురించి పరస్పరం వాదులాడుకోవడమే.

ఖుర్ఆన్ వివిధ జీవనరంగాలలో ఆవరించిన అజ్ఞానాంధకారాన్ని తొలగించి యావత్‌మానవాళికి వెలుగుబాట చూపదలచింది. 1400 ఏండ్ల క్రితం అజ్ఞానాంధకారంలో తచ్చాడుతూ, అనేక దురాచారాలకు గురయి, అసంఖ్యాకమైన చెడుగుల్లో కూరుకుపోయిన అరబ్బులు ఖుర్ఆన్ సందేశం స్వీకరించగానే వారి జీవనసరళి పూర్తిగా మారిపోయింది. వారు ఆధ్యాత్మిక, నైతిక రంగాల్లోనే గాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో సైతం అత్యున్నత ప్రమాణాలు నెలగొల్పారు. ఆనాడు వారి జీవనసరళిని చూడగానే ప్రతివ్యక్తీ, ఖుర్ఆన్‌లో అంతటి విప్లవాత్మక శక్తి ఉందని, అలాంటి ఉన్నత సమగ్ర జీవనవిధానం ఉందని భావించేవాడు.

అయితే మానవాళికి ఖుర్ఆన్ తెచ్చిన ఈ శుభాలను మానవతా వ్యతిరేక శక్తులు ఎలా సహిస్తాయి? మహాప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిన కొన్ని దశాబ్దాలకే ఈ దుష్టశక్తులు ముస్లింలను ఖుర్ఆన్ నిజధ్యేయానికి, దాని ముఖ్యబోధనలకు దూరంచేయడానికి ప్రయత్నాలు ఆరంభించాయి.

ఇస్లాంలో ప్రధాన భాగమైన రాజకీయ రంగాన్ని వేరుచేయడానికి, ఖుర్ఆన్ పూజాపురస్కారాలు, కర్మకాండలకు పనికొచ్చే మతగ్రంథం తప్ప మరేమీ కాదని నమ్మించడానికి అనేక కుట్రలు పన్నాయి. వాటి కుట్రల ప్రభావం క్రమేణా ముస్లింలపై కూడా పడింది. దాంతో వారు ఖుర్ఆన్ లక్ష్యానికి, దాని నిజభావాలకు దూరమైపోయారు. ఖుర్ఆన్‌ని తమకు తెలిసిన భాషలో అధ్యయనం చేసి, అది మానవాళికిచ్చే సందేశాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ ప్రయత్నించడం లేదు. ముస్లింల ఈ అజ్ఞాన వైఖరినే ఎత్తి చూపిస్తూ దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"వారు ఖుర్ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుక మీదనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు." (మిష్కాత్)

ఒకప్పుడు మన దేశంలో ముస్లింలు దివ్యఖుర్ఆన్‌ని ఇతర భాషల్లో అనువదించడమే పాపంగా భావించేవారు. చివరికి ఎలాగో ఢిల్లీలో షాహ్ వలియుల్లా (రహ్మాలై) ధైర్యంచేసి మొదటిసారిగా ఖుర్ఆన్‌ని ఫార్సీ భాషలో అనువదించారు. ఈ సంగతి తెలియగానే యాభై మంది వ్యక్తులు కర్రలు, కత్తులతో వచ్చి ఢిల్లీ జామియామసీదు మెట్లమీద కూర్చున్నారు. అక్కడ కూర్చొని వచ్చేపోయేవారి ప్రశ్నలకు జవాబిస్తూ "షాహ్‌వలియుల్లా ఖుర్ఆన్‌ని ఫార్సీభాషలో అనువాదం చేసి దైవమర్మాలు బయటపెట్టారు. అంచేత మా మౌల్వీలు ఆయన అంతుచూడమని చెప్పారు" అని చెప్పేవారు.

ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్టపథకాలకు కొందరు మతవేత్తల స్వార్థం, సంకుచిత భావాలు కూడా తోడయ్యాయి. ఇతర మతాలకు చెందిన పండితులు తమ మతగ్రంథాలను సామాన్య జనానికి ఎలా దూరంగా ఉంచగోరుతున్నారో, ముస్లిం నాయకుల్లో కూడా ఒక వర్గం సామాన్య ప్రజల్ని ఖుర్ఆన్‌కు దూరంగా ఉంచగోరుతోంది. ఖుర్ఆన్‌ని సామాన్యులు అర్థం చేసుకోలేరని, అంచేత దాని జోలికిపోకుండా తాము చెప్పిందే 'ఖుర్ఆన్‌వాక్యం'గా భావించి నడుచుకోవాలని వీరు ప్రజల్ని శాసిస్తున్నారు.



ఒకవేళ ఎవరైనా ఖుర్ఆన్ పట్ల ఆసక్తి కలిగి దాన్ని తమకు తెలిసిన భాషలో వ్యాఖ్యాన సమేతంగా అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తే ఆ ప్రయత్నాన్ని వీరు నిరోధించడానికి కూడా వెనకాడరు.

తత్ఫలితంగా అనేకమంది ముస్లింలు ఖుర్ఆన్ అధ్యయనం చేయడం మానేసి ఈ 'పెద్ద మనుషులు' చెప్పిన ప్రకారం తమ ధార్మికతను నమాజ్, రోజా, హజ్, ధ్యానం లాంటి కొన్ని ఆరాధనలకు పరిమితం చేసుకున్నారు. పండితులు, ధర్మవేత్తలు తప్ప ఇతరులు ఖుర్ఆన్‌ని నిజంగా అర్థం చేసుకోలేరన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

ఈ అపోహ వల్ల ఖుర్ఆన్‌తో ముస్లింల సంబంధం నామమాత్రంగా ఉండిపోయింది. కాకపోతే తీరిక దొరికినప్పుడు అర్థం చేసుకోకుండా దాని అరబీమూలాన్ని చిలకపలుకుల్లా పారాయణం చేయడం, అత్తరు పన్నీరు పూసి కళ్ళకద్దుకోవడం, ప్రమాణం చేయవలసివచ్చినప్పుడు దాన్ని తీసుకొని తలమీద పెట్టుకోవడం, కంఠస్థంచేసి మసీదుల్లో ఇమామత్ లేక ఉపాధ్యాయవృత్తి చేపట్టడం వరకే వారి సంబంధం పరిమితమైయిపోయింది.

1869లో బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశంలోని ముస్లింల పరిస్థితి ఎలా ఉందో, ప్రత్యేకంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వారి మనస్తత్వం ఏమిటో తెలుసుకొని రమ్మని ఒక కమీషన్‌ని పంపింది. ఈ కమీషన్ మన దేశంలో ఓ ఏడాది పాటుండి ముస్లింల మనోభావాలు, వారి మత విశ్వాసాలు, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులన్నీ పరిశీలించి తిరిగొచ్చింది. రాగానే 1870లో లండన్‌లో ఓ చారిత్రక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో కమీషన్ సభ్యులతో పాటు భారతదేశంలో పనిచేసిన క్రైస్తవ మిషనరీ ఫాదరీలు కూడా కొందరున్నారు. ఆ సందర్భంలో కమీషన్ అధ్యక్షుడు సర్ విలియం హైండ్ సమర్పించిన నివేదిక చూడండి:

"ముస్లింల మతవిశ్వాసం ప్రకారం వారు ఏ పరదేశ ప్రభుత్వ పంచనా ఉండలేరు. పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం వారికి చాల అవసరం. ఈ ఆలోచనే వారి హృదయాల్లో ఓ నూతన ఉత్సాహాన్ని,

ఉద్రేకాన్ని జనింపజేస్తుంది. వారా పోరాటానికి అనుక్షణం సిద్ధంగా ఉంటారు. ఈస్థితి వారిని పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ సమయం లోనైనా ఉద్రేక పరచగలుగుతుంది.''

క్రైస్తవ మిషనరీ ఫాదరీల నివేదికను కూడా చూడండి:

"ఇక్కడి ప్రజల్లో ఒక వర్గం వైరాగ్యభావాలు, మతగురు పీఠం తత్వం గల ముస్లింలు కూడా ఉన్నారు. కనుక ఇప్పుడు మనం తాను దైవప్రవక్త నని ప్రకటించుకోగల ఒక ద్రోహిని అన్వేషించగలిగితే అమితమైన ఉత్సా హంతో వేలాదిమంది ప్రజలు అతని నకిలీ దైవదౌత్య పరిధిలోకి వస్తారు. ముస్లింలలో అలాంటి వ్యక్తిని తయారుచేయడం చాలా కష్టం. కష్టతరమైన ఈపని సాధించగలిగితే అతడ్ని ప్రభుత్వం తరపున ఆశ్రయం, అండ దండలు ఇచ్చి మన పనిని సులువుగా నెరవేర్చుకోవచ్చు...."

(వైట్‌హౌస్ కాన్ఫరెన్స్ రిపోర్ట్- "ది ఎరైవల్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ ఆఫ్ ఇండియా'')

ఖాదియానీ మతస్థాపకుడు ఆనాటి ఆంగ్లేయుల మేధాజనితమే

ఆ రోజుల్లోనే బ్రిటిష్ పార్లమెంటులో హౌస్ ఆఫ్ కామన్స్ అధ్యక్షుడు గామెండ్ ఐసన్ చేతిలో ఖుర్ఆన్ ప్రతి పట్టుకొని "ముస్లింల మధ్య ఈ పుస్తకం ఉన్నంతవరకూ మనం (ఇండియాలో) ప్రశాంతంగా పరిపాలన చేయలేం'' అని చెబుతూ ఆ దైవగ్రంథాన్ని విసిరి నేలకేసి కొట్టాడు.

ఇలా ఆంగ్లేయుల దుష్ట రాజనీతి కారణంగా ముస్లింలు ఖుర్ఆన్ ఇచ్చే నిజమైన శిక్షణకు దూరమైపోయారు. సమాజ సంస్కరణకు ఉపక రించని కొన్ని వ్యక్తిగత మతాచారాలు పట్టుకొని, అదే అసలైన ఖుర్ఆన్ శిక్షణ అని భావిస్తున్నారు. ఇలాంటి ముస్లింలనే దృష్టిలో పెట్టుకొని ఓసారి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "ముస్లింలు తమ ఖుర్ఆన్‌ని గురించి మహా గొప్పలు చెప్పుకుంటారు. కాని వారిదగ్గర ఓ ప్రత్యేక వేషధారణ, జపమాల, ఉజూచెంబు తప్ప మరేదైనా ఉందా?'' అని ఎత్తిపొడిస్తే ఈ మతపండి తులు చేతకాని రోషంతో కుతకుత లాడిపోయారు.



20వ శతాబ్దం మూడో దశకం నుండి పరిస్థితి క్రమంగా మారసాగింది. ప్రఖ్యాతతత్వవేత్త అబుల్‌ఆలా మౌదూదీ (రహ్మ) తెచ్చిన విప్లవం భారత ఉపఖండంలోని మేధావుల భావజగత్తునే మార్చివేసింది. ఆయన రాసిన అద్భుత ఖుర్ఆన్ వ్యాఖ్యానం, ఆయన రచించిన విప్లవాత్మక సాహిత్యం కారణంగా ఇస్లాం సార్వకాలిక సమగ్ర జీవనవ్యవస్థ అన్న వాస్తవం ప్రజ లకు తెలిసిపోయింది. మన దేశంలో మొదటిసారిగా మౌలానా సులైమాన్ నద్వి, మౌలానా అబుల్‌ఆలా మౌదూదీ గార్లు ప్రాంతీయభాషల్లో ఇస్లాం సాహిత్యం ప్రాముఖ్యంగురించి నొక్కిచెప్పారు. దాంతో ఖుర్ఆన్ వాస్తవికత ప్రాంతీయ భాషల్లో కూడా వెలువడ నారంభించింది.

## టార్చిలైట్ సంచిలో పెట్టుకొని చీకటిలో తచ్చాడేవారు-16

దీపం చీకటిని దూరం చేస్తుంది. జ్ఞానజ్యోతి అజ్ఞానాంధకారాన్ని పటా పంచలు చేస్తుంది. కాని చేతిలో టార్చిలైట్ పెట్టుకున్న ఆ 'ముస్లిం బాటసారి' పరిస్థితే చాలా దయనీయంగా ఉంది. పాపం! దగ్గర దేదీప్యమానమైన కరదీపిక వున్నా దాన్ని ఉపయోగించుకోలేక చీకటిలో తచ్చాడుతున్నాడు.

అదొక అరణ్య ప్రదేశం. నడిరేయి కటిక చీకటిలో ఆ ముస్లిం బాటసారి ప్రయాణం చేస్తున్నాడు. మినుకు మినుకుమంటున్న నక్షత్రాలను కూడా కారుమబ్బులు కప్పివేయడంతో అతను అడ్డదిడ్డంగా నడుస్తున్నాడు. అతను నడుస్తున్న దారిలో ఓ పెద్ద అగాధం ఉంది. మరో అయిదు నిమిషాలు అటువైపే నడిస్తే అతను అమాంతం ఆ అగాధంలో పడిపోయి ప్రాణాలు కోల్పోవడం ఖాయం. అంతలో ఎటునుంచో ఒక వ్యక్తి టార్చిలైట్ తీసుకొని కేకలు పెడుతూ అతని దగ్గరకు దూసుకువచ్చాడు. అతని వేషం, వాలకం చూస్తే ఫారెస్టు రేంజర్‌లా ఉన్నాడు.

ఫారెస్టు రేంజర్‌కు ఆ ప్రదేశంలో ఎక్కడ అగాధాలున్నాయో, మరెక్కడ క్రూర జంతువుల గుహలున్నాయో క్షుణ్ణంగా తెలుసు. అందుకే అతను బాటసారికి జరగనున్న ప్రమాదాన్ని పసికట్టి వచ్చాడు. అలా ఇంకాస్త దూరం నడిచివుంటే అగాధంలో పడిపోయి సజీవసమాధి అయ్యేవాడివని బాటసారి

తో చెబుతూ, అతనికి సరైన దారి చూపాడు. ఎంతో సానుభూతితో రేంజర్ తన టార్చిలైట్‌ని కూడా బాటసారికిచ్చి వెళ్ళిపోయాడు.

బాటసారి రేంజర్‌కు కృతజ్ఞతలు చెప్పి ప్రయాణం సాగించాడు. అతను బ్యాటరీ లైట్ వెలుగులో ఆ దారిన రెండు మైళ్ళు నడిచాడు. ఆ తరువాత ఆకాశంలో మబ్బులు వీడి మిలమిల మెరుస్తున్న నక్షత్రాలు కన్పించగానే, ఇక బ్యాటరీలను అనవసరంగా తగలెట్టడం ఎందుకని భావించి అతను టార్చిలైట్‌ని సంచిలో పెట్టుకున్నాడు.

ఈసారి అతను నక్షత్రాల కాంతిలో నడుస్తూ, లాటరీలో వచ్చిన లక్షలాది రూపాయలను గురించి ఆలోచించసాగాడు. ఈ డబ్బుతో ఓ అందమైన బంగళా కట్టించుకోవాలి. అందులో ఖరీదైన ఫర్నీచర్, టివి, ఫ్రిజ్ మొదలైన విలాస వస్తువులన్నీ తెచ్చిపెట్టుకోవాలి. మిగతా డబ్బుతో వడ్డీ వ్యాపారం చేసి కూడబెట్టాలి. దానిమీద వచ్చే లాభంతో నైట్ క్లబ్బ్, వైన్‌షాపో తెరవాలి. దాని లాభాలతో ఓ మంచి సినిమాహాలు కట్టించవచ్చు. ఆ తర్వాత ఫిలిం ప్రొడ్యూసర్, ఆపై మినిస్టర్.... ఇలా ఆలోచిస్తూ నడుస్తున్నాడు బాటసారి.

ఈలోగా నక్షత్రాలు మళ్ళీ కనుమరుగై గాఢాంధకారం అలుముకుంది. ఎత్తయిన టేకు వృక్షాలు, ఇతర గుబురు చెట్లు తలలు విరబోసుకున్న రాకాసుల్లా నిలిచి నేలపై మరిన్ని చీకటి పొరలను పరిచాయి. దాంతో పాపం బాటసారి దారి తప్పాడు. అతను ఆలోచనల్లో మునిగిపోయి చీకటిలో తచ్చాడుతూ నడుస్తున్నాడేగాని, సంచిలోని బ్యాటరీలైట్ తీసి వాడుకోవాలన్న ఆలోచనే అతనికి తట్టలేదు. అసలు తన దగ్గర వెలుగునిస్తూ దారిచూపే ఓ టార్చిలైట్ ఉందన్న సంగతే మరచిపోయాడు పిచ్చివాడు! పైగా సంచిలో ఓమూల బరువుగాఉన్న బ్యాటరీలైట్‌ని పట్టుకొని, దయ్యాలను పారదోలేం దుకు ఇవ్వబడిన మంత్రదండమని భావించాడు. ఆ భావనతోనే అతను అంతటి తీవ్రమైన ఆలోచనల్లోనూ అప్పుడప్పుడు దాన్ని భక్తిశ్రద్ధలతో కళ్ళకు అద్దుకుంటూ, దాన్ని తనకిచ్చి ఎంతో మేలుచేసిన ఫారెస్టు రేంజర్‌ని తెగ పొగుడుతూ నడుస్తున్నాడు.



నేల మీద ముళ్ళు గుచ్చుకుంటున్నా, ఎదురాయి దెబ్బలు తగులుతున్నా, చెట్లరెమ్మలు ఒరుసుకుంటున్నా ఖాతరుచేయకుండా హుషారుగా ఈలవేస్తూ నడుస్తు న్నాడు బాటసారి. అతను నడిచే దారిలో దయ్యాలయితే ఎదురు కాలేదుగాని, అంతకంటే ఘోరమైన ప్రమాదమే పొంచిచూస్తోంది. అది క్రూరమృగాలు ఉంటున్న ఓ భయంకరమైన లోయ. మృత్యువు కోరలు చాచి అతనివైపే చూస్తోంది. బాటసారి మరో ఫర్లాంగు ముందుకు నడిస్తే చాలు, అతని దేహంలో ఒక్క మాంసపు ముక్క కూడా మిగలదు. అంతటి ప్రమాదకర స్థితిలో కూడా ఆ బాటసారికి టార్చిలైట్ సంగతి గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది కదూ?

అచ్చం ఇలాగే ఉంది ఈనాటి ముస్లింల పరిస్థితి. వీరు తమకు రుజుమార్గం చూపిన దైవప్రవక్త (సల్లం)నయితే ఘనంగా కీర్తిస్తారు. ఆ మహోపకారి చేసిన మేలుకు కృతజ్ఞతగా ఆయన కోసం మాటిమాటికి దరూద్ కూడా పఠిస్తారు. ప్రతి ఏడూ ఆయన జన్మదినోత్సవాన్ని కూడా వైభవంగా జరుపుతారు. కాని ఆయన అందజేసిన జ్ఞానజ్యోతిని బీరువాలో భద్రపరచి అజ్ఞానపు కారుచీకట్లలో తచ్చాడుతున్నారు. వారి వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో జ్ఞానజ్యోతి కానరాదు. వారి దైనందినవ్యవహారాల్లో, వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఆ జ్యోతి కాంతులు ప్రసరించవు.

దీనికిభిన్నంగా వారి జీవితాలపై మూఢాచారాలు, అంధవిశ్వాసాల కారు చీకట్లు ముసురుకున్నాయి. భౌతికారాధనా కారుమేఘాలు కమ్ముకున్నాయి. మిథ్యావాదాలు వారిని చుట్టుముట్టాయి. వారు ప్రాపంచికమైకంలో పడి తమ దగ్గరున్న జ్ఞానజ్యోతిని మంత్రదండమని తలచి, దాన్ని అల్ప ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. పైగా, దాన్ని కాలం గడచిన కారణంగా బ్యాటరీలు మాడిపోయిన టార్చిలైట్‌లా భావించి అటకపై ఎత్తిపెట్టారు.

వారు మహాప్రవక్త (స)ను మానవమహోపకారిగా నయితే అంగీకరిస్తారు. కాని ఆచరణలో ఆయన్ని సమగ్రమార్గదర్శిగా తలచడంలేదు. ఆయన బోధనలను ఆధునిక కాలపు అవసరాలు తీర్చే విషయాలుగా భావించడం లేదు.

ఈ కారణంగా వారు పూజాపురస్కారాల్లో, కర్మకాండల్లో, వివాహాది శుభ కార్యాల్లో మాత్రమే దైవప్రవక్త (స)ను మతనాయకులుగా అంగీకరించి రాజకీయ-ఆర్థిక వ్యవహారాల్లో, పరిపాలన-పార్లమెంటు విషయాల్లో ఇతరుల్ని తమ నాయకులుగా చేసుకున్నారు. వారు ప్రజాసంబంధాలను, విద్యా, ఉపాధి వ్యవహారాలను దైవధర్మంతో సంబంధంలేని ప్రాపంచిక విషయాలుగా పరిగణించారు. మహాప్రవక్త (స) ఆచరించి చూపిన సంపూర్ణ జీవన వ్యవస్థను రెండు భాగాలుగా విభజించి ఇది ప్రపంచ వ్యవహారం, అది పరలోక వ్యవహారమని చెబుతూ ప్రపంచ వ్యవహారాల్లో కన్పించే ప్రతి సజీవవిగ్రహాన్ని ఆరాధించసాగారు.

అయినప్పటికీ తాము మహాప్రవక్త ముహమ్మద్ (స) చూపిన మార్గం లోనే పూర్తిగా నడుస్తున్నామని, ఆయన హామీ ఇచ్చి చూపిన శుభగమ్యానికి నేరుగా చేరుకుంటామని భ్రమిస్తున్నారు టార్చిలైట్ మరచి దారితప్పిన బాటసారిలా. మరి వీరి పరిస్థితి ఆశ్చర్యంగా లేదూ? నిజానికి వీరి పరిస్థితి పట్ల ఆశ్చర్యపడక పోవడమే అత్యంతాశ్చర్యకరం.

ముస్లింలలో ఒక వర్గం ప్రజలను ఖుర్ఆన్ అనువాదానికి దూరంగా ఉంచడానికి ఇప్పటికీ ప్రయత్నిస్తోంది. దాంతో అనేకమంది ఖుర్ఆన్ని తమకు తెలిసిన భాషలో చదివి అర్థం చేసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. వారిలో కొందరు ఖుర్ఆన్ని తమకు తెలిసిన భాషలో చదివితే దాని ప్రకారం ఆచరించవలసి వస్తోందని, చదవక పోవడం వల్ల జరిగే పాపాలకు పరలోకం లో తమకేమీ తెలియదని చెబితే దేవుడు తమను క్షమించి వదలిపెడ్తాడని భావిస్తున్నారు. ఈ భావన వారి భ్రమ మాత్రమే.

ఒప్పందంలో సంతకం చేసిన కాంట్రాక్టర్ దాని షరతుల ప్రకారం పనులు చేయించకుండా ఇష్టానుసారం చేస్తే అతని ఒప్పందం రద్దయిపోవడమే గాక అతనిపై జరిమానా కూడా పడే ప్రమాదం ఉంటుంది. అదేవిధంగా దేవునికి, దాసునికి మధ్య జరిగే ఒప్పందం లాంటి కలిమా (సద్వచనం) పఠించగానే మనిషి దానికి అనుగుణంగా తనజీవితాన్ని సంస్కరించుకోవలసి



ఉంటుంది. ఆ సంస్కరణ ఖుర్ఆన్, హదీసుల అధ్యయనం ద్వారానే సాధ్యమవుతుంది. అలా చేయకుండా పాపపంకిలంలో పడి అదే స్థితిలో చనిపోతే విశ్వప్రభువు ముందు అతని సాకులు ఏమాత్రం పనిచేయవు.

నమాజ్, రోజాలు పాటించడానికి, ఇతర సత్కార్యాలు చేయడానికి బద్ధకించేవారు; జకాత్ నెరవేర్చడానికి, దైవమార్గంలో ధనత్యాగం చేయడా నికి పిసినారితనం వహించేవారు కూడా ఖుర్ఆన్ని తమకు తెలిసిన భాషలో చదవడానికి సిద్ధపడరు. ఇక్కడ నా మిత్రుడు ఒకతనికి ఎదురైన సంఘట నను పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది.

ఆ మిత్రుడు మా దగ్గర ఖుర్ఆన్ భావామృతం ప్రతులు కొని వాటిని ఖతర్కు పంపేందుకు కార్గో ఆఫీసుకు వెళ్ళాడు. కార్గో ఆఫీసులో అధికారితో పాటు ఆర్గురు ఉద్యోగులున్నారు. ఆ ఉద్యోగులు ఖుర్ఆన్భావామృతం చూసి దాన్ని చదువుతాం, తమకివ్వమని అడిగారు. మా మిత్రుడు ఆరు ప్రతులు తీసి వారి ముందు పెట్టాడు. ఆ ఆర్గురిలో ముగ్గురు హిందువులు, ఇద్దరు క్రైస్తవులు, ఒకడు ముస్లిం. ముగ్గురు హిందువులు, ఇద్దరు క్రైస్తవులు ఖుర్ఆన్ భావామృతం తీసుకున్నారు. ముస్లిం ఉద్యోగి మాత్రం ఖుర్ఆన్ అనువాద గ్రంథాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తూ, తనకు తెలుగులిపిలో ఉండే అరబీ (ఉచ్చారణ) గ్రంథం కావాలని అన్నాడు. దీన్నిబట్టి ఖుర్ఆన్ అనువాదం పట్ల నేటి ముస్లింల వైఖరి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

అయితే ప్రస్తుత పరిస్థితి మరీ నిరాశాజనకంగా లేదు. నిరాశాచీకట్లలో ఆశాజ్యోతులు వెలిగించడానికి నడుం కట్టారు కొందరు ముస్లింలు. తత్ఫలి తంగా ఈనాడు తెలుగులో కూడా ఇస్లాంకు సంబంధించిన వివిధ విషయా లపై అనేక పుస్తకాలు వెలువడుతున్నాయి. పాత తరాలవారు పాతమార్గం లోనే ప్రయాణం సాగిస్తూ బతుకు పొలిమేరలో ప్రవేశిస్తుంటే, నవతరాల వారు మారుతున్న ప్రపంచపరిస్థితుల్ని గమనిస్తూ ఖుర్ఆన్ వైపు మరలు తున్నారు. అది మానవాళికి అందజేస్తున్న అద్భుత సందేశం ఏమిటో తెలుసు కోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

## ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్టపథకాలు-17

అయినప్పటికీ మరికొందరు స్వార్థబుద్ధితో ఇస్లాంవ్యతిరేక శక్తులకు పావులుగా ఉపయోగపడుతున్నారు. వాటి దుష్ప్రచారజాలంలో చిక్కుకొని వాస్తవాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. కమ్యూనిజానికి కంచుకోట, క్యాపిటలిజానికి బద్ధశత్రువైన సోవియట్ రష్యా ముక్కచెక్కలయిన తర్వాత యూదుల పెట్టుబడిదారీ వ్యవస్థకు, వారి జాత్యహంకారానికి అతివేగంగా విస్తరిస్తున్న ఇస్లాం పెద్ద అవరోధమై నిల్చింది. అంచేత ఇస్లాం ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు జియోనిస్టులు అమెరికాను, దాని మిత్ర దేశాలను రంగంలోకి దించారు. ఈ విషయంపై త్రైదిన ఉర్దూ పత్రిక 'దావత్'లో డాక్టర్ అబ్దుల్‌బారీ గారు 1992 మేలో రాసిన వ్యాసానికి అలిఫైన్ చేసిన సంక్షిప్త అనువాదాన్ని ఇక్కడిస్తున్నాను:

నేటి పాశ్చాత్యప్రపంచం, దాని కుటిల అనుచరగణం తీవ్ర ఆందోళనకు గురై తమ పాదాల కింద భూమి కంపిస్తున్నట్లు అదరిపోతున్నాయి. గల్ఫ్‌యుద్ధంలో ఇరాఖ్‌ని సర్వనాశనం చేయడం, అరబ్ నేతలను తమ కనుసన్నలలో మెలిగేలా చేసుకోవడం, వారి చమురుసంపదపై పెత్తనం సంపాదించడం, ఆపై సోషలిస్టు రష్యా ముక్కచెక్కలయి కూటి కొరకు తమ ముంగిట నిల్చోవడం వగైరా విజయాలు సాధించినప్పటికీ అమెరికా, దాని మిత్రదేశాలను ఓ భయంకరమైన అనుమానపు పెనుభూతం వెంటాడుతూ వాటికి నిద్రాహారాలు లేకుండా చేసింది.

ఇంతకూ ఈ అనుమానపు పెనుభూతం ఏమిటీ? వాటి నూతన ప్రపంచ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) బాటలో "ఇస్లాం పునరుజ్జీవనోద్యమం" ఓ పెద్ద అవరోధంగా నిలిచి వాటి సుందర ఊహాసౌధానికి తూట్లువేస్తోంది. ఈనాడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఎగిసిపడుతున్న ఇస్లామీయ ఉద్యమ కెరటాలను చూసి అవి గగ్గోలుపెడుతూ, ఈ నూతన చైతన్యానికి మతఛాందస వాదమని, పునాదివాదం (Fundamentalism) అని, పేర్లుపెట్టి ప్రజాస్వామ్యానికి, సెక్యులరిజానికి బద్ధ



విరోధి అని మానవహక్కులకు, స్వేచ్ఛాప్రియత్వానికి పెద్దప్రమాదం ముంచుకొచ్చిందని దుష్ప్రచారం చేస్తున్నాయి.

నిజానికి ఈ దేశాల పరిస్థితి గమనిస్తుంటే పెట్టుబడిదారీ వాదం, ఆర్థిక దోపిడి, జూదం, వడ్డీ ప్రాతిపదికలపై ఏర్పడిన పాశ్చాత్యనాగరికతా ప్రాసాదం ఇస్లాం ప్రభంజనానికి తట్టుకోలేక ఊగిపోతున్నట్లు గోచరిస్తోంది. మరోవైపు అభివృద్ధి, ఆధునికీకరణ, మానవ మైత్రి, ఉదారవాదం (Liberalism), పాశ్చాత్య తరహా ప్రజాస్వామ్యం, ఐరోపా తరహా జీవన సరళి అనే పేర్లతో మొన్నటిదాకా మోసంలో పడివున్న పీడిత జాతులు ఇప్పుడు ఈ మోసపుటెత్తుగడల నుండి బయటపడటానికి ప్రయత్నించడంతో అమెరికా, దాని మిత్రదేశాలు బెదిరిపోతున్నాయి.

ఐరోపాలో కమ్యూనిజం తుడిచిపెట్టుకుపోవడం, మధ్యప్రాచ్యంలో తన సర్వాధికార పతాకాన్ని ఎగరవేయడం జరిగాక అమెరికా ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా నిలిచింది. కాని అదే సమయంలో దానికి తన పతన ఛాయలు కూడా గోచరించసాగాయి. సమతావాదానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, ఆర్థిక న్యాయాని (Economical justice)కి ప్రతీకగా పైకి ఎదిగివస్తున్న ఇస్లాంను చూసి బిత్తరబోయి తత్తరపాటుతో దానిపై నిరాధారమైన దుష్ప్రచారానికి పాల్పడింది.

ఐరోపా తన పెట్టుబడిదారీ శక్తి, ఆయుధాలు రాజకీయ జిత్తులు, ఎండమావి సిద్ధాంతాలతో ఈ శతాబ్దం ఆరంభంలో యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయగలిగింది. పేద, వర్ధమాన దేశాల్లో అది తన ఔన్నత్యపు బావుటాను ఎగరవేయడానికి తననుతాను అందరికంటే గొప్ప మానవ మిత్రునిగా, మానవహక్కుల పరిరక్షకునిగా, స్వేచ్ఛాశాంతుల కాముకునిగా నిరూపించుకోవడానికి ప్రయత్నించింది. అంతేగాక ప్రజాస్వామ్య తరహా పాలనా వ్యవస్థను తన ప్రత్యేక ఆవిష్కరణగా ప్రచారం చేసుకున్నది. కాని ఆ తర్వాత సంభవించిన అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దాదాపు అన్ని దేశాలు ఆంగ్లేయుల రాజకీయ బానిసత్వం నుంచి విముక్తి పొంద

గలిగాయి. అయితే పాశ్చాత్య జాతుల ఆర్థిక, సాంస్కృతిక దాస్యం నుంచి బయట పడేందుకు తూర్పు జాతులు సాగిస్తున్న స్వాతంత్ర్య సమరం అమెరికాకు ఇంకా తలనొప్పిగానే ఉంది.

అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, అతని మిత్రకూటమి తమ సర్వసాధన సంపత్తితో, యావత్తు యంత్రాంగంతో, తమ రాజకీయ చదరంగంతో, సైనిక శక్తితో దీన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నం నుంచి పుట్టుకొచ్చిన ఆలోచనే New World Order (నూతన ప్రపంచ వ్యవస్థ). కాని ఈ న్యూ వరల్డ్ ఆర్డర్ వాస్తవానికి కొత్తసీసాలో పోసిన పాతసారా లాంటిదే తప్ప మరేమీకాదు. దీని ఉద్దేశ్యం యావత్తు ప్రపంచజాతులు అమెరికా అడుగుజాడల్లో నడుస్తూ స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ (Free Economy)ను, ఉదారసమాజాన్ని (Liberal Society) ఏర్పరచుకోవాలి; సెక్యులర్ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి; మతవిశ్వాసాలను ప్రజల సామూహిక వ్యవహారాలకు దూరంగా ఉంచాలి; రాజకీయాలపై నైతికఆంక్షలు ఉండకూడదు; ఐరోపాతరహా సమాజ విధానాన్ని, ఉదారవాదాన్ని నవసమాజ నిర్మాణానికి ప్రాతిపదికలుగా చేసుకోవాలి. ఈవిధంగా ప్రపంచదేశాలను న్యూ వరల్డ్ ఆర్డర్ పేరుతో తమకు అనుకూలంగా మలచుకొని, వాటిపై పెత్తనం చలాయించాలని అమెరికా, దాని మిత్రదేశాలు కలలు కంటున్నాయి.

అయితే యూరప్‌లోనే కొన్నిచోట్ల పాశ్చాత్యవ్యతిరేక పవనాలు వీస్తున్నాయిప్పుడు. పశ్చిమ యూరప్‌లో ప్రస్తుతం తొంబై లక్షల మంది ముస్లింలు నివసిస్తున్నారు. 'న్యూస్‌వీక్' పత్రిక కాలమిస్టు 'స్కార్ట్ సెల్యూన్' కథనం ప్రకారం ఇటీవల అల్జీరియాలో సంభవించిన పరిణామాలు యావత్తు పశ్చిమ యూరప్ ముస్లింలను ఎంతో ప్రభావితం చేశాయి. దాంతో తమ ఉద్యోగ, వ్యాపార వ్యవహారాలు మాత్రమే చూసుకుంటూ గుట్టుగా జీవితం సాగిస్తున్న ఈ ముస్లింలు తమ ముస్లిమేతర పొరుగు ప్రజలకు వేరుగా (ఇస్లామీయ) జీవితం గడపడానికి, తమ ప్రత్యేక ప్రతిపత్తిని కాపాడుకోవడానికి అనువైన వాతావరణం జనించింది. అల్జీ



రియా (సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన) ఇస్లామిక్ సాల్వేషన్ ఫ్రంట్ మీద వారు ఎనలేని అభిమానం పెంచుకున్నారు.

**తా చెడ్డ కోతి వనమెల్లా చెరచున్ :** స్కార్ట్ సెల్యూన్ అభిప్రాయం ప్రకారం ఈ ముస్లింలలో ఒక వర్గం ఆయతుల్లా ఖుమైనీ మతఛాందస ఆలోచనా వైఖరితో ఏకీభవిస్తున్నది; యూరప్ ముస్లింలు తమ(ధార్మిక) ప్రత్యేకతలను ఏర్పరచుకునే హక్కు కోసం పోరాడేందుకు వారిని ఉసి గొల్పడం జరుగుతోంది. ఈ సందర్భంలో గమనించ వలసిన విషయాలు-ప్యారిస్‌లో సల్మాన్‌రుష్దికి వ్యతిరేకంగా ముస్లింలు పెద్దఎత్తున ప్రదర్శనలు జరిపారు. రుష్ది పైశాచిక నవలను ఇటాలియన్ భాషలో అనువదించిన ఇటలీ రచయితపై దాడి జరిగింది. ఫ్రాన్స్‌లోని ఒక కళాశాలలో ముగ్గురు మొరాకో బాలికలు 'స్కార్ఫ్'ని బురఖాగా వాడి ఫ్రాన్స్ విద్యాశాఖాధికారుల్ని చికాకుపరిచారు. వీటితో పాటు అనేక ప్రాంతాలలో హలాల్‌మాంసం లభించే ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు కూడా చేయడం జరిగింది.

న్యూస్‌వీక్ పత్రిక (27-1-92) ప్రకారం పాశ్చాత్యులు ముస్లింల ధార్మిక ప్రతిపత్తిని, ఇస్లామీయ రాజకీయాలను ఏమాత్రం సహించరు. ఆస్ట్రియా, స్వీడన్, బెల్జియం, జర్మనీలలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ముస్లిం వ్యతిరేక పార్టీలు సాధించిన ఘనవిజయాలే ఇందుకు తార్కాణం. జర్మనీలో నాజీవర్గాలు విదేశీపౌరులపై 2368 సార్లు దాడిచేశాయి. వీరిలో అత్యధిక మంది టర్కీ, మొరాకోకు చెందిన శ్రామికులే ఉన్నారు.

పాశ్చాత్యదేశాల్లో ఇస్లాంవ్యతిరేక ప్రచారం ఎంతగా సాగుతున్నప్పటికీ దైవానుగ్రహం వల్ల ఇస్లాం అతివేగంగా వ్యాపిస్తోంది. ముస్లింలు ఇస్లాం బోధనలను స్వయంగా ఆచరించడమేగాక వాటిని ముస్లిమేతరులకు కూడా పరిచయం చేస్తున్నారు. 1965లో ఫ్రాన్స్‌లో పది మసీదులేఉండేవి. ఇప్పుడక్కడ వేయికి పైగా వెలిశాయి. డెబ్బయి వేల మంది ముస్లింలు నివసిస్తున్న ఇంగ్లాండులో 34 మసీదులు ఉన్నాయి. రోమ్‌లో యావత్తు ఐరోపాలోకెల్లా అతిపెద్ద మసీదు నిర్మించబడుతోంది.

యూరప్‌లో ముస్లింలు ఎక్కడెక్కడయితే నివసిస్తున్నారో ఆయా ప్రాంతాల్లో ఖురాన్ బోధనాకేంద్రాలు నెలకొన్నాయి. వారు తమ పండుగ దినాలను సెలవులుగా ప్రకటించమని తమ ప్రభుత్వాలను కోరుతున్నారు. కార్యాలయాల, కర్మాగారాల వద్ద మసీదులు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించమని, హలాల్‌మాంసం సరఫరాకై తగిన పశువధ శాలలు ఏర్పాటుచేయమని అడుగుతున్నారు. ఇంగ్లాండులో కలీంసిద్దీఖి ముస్లింల సమస్యల పరిష్కారం కొరకు 'ముస్లిం పార్లమెంట్'ను ఏర్పరచబోతున్నట్లు ప్రకటించారు. ఇది బ్రిటన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరచింది.

ఉదారసమాజం, సెక్యులర్ ప్రజాస్వామ్యం, మానవహక్కులు, నవ నాగరికతల పేరిట ఇప్పటిదాకా తూర్పుదేశాలను మోసగిస్తున్న పాశ్చాత్య సిద్ధాంతాల, తాత్వికచింతనల గుట్టును రట్టుచేసే శక్తి ఇస్లాంకు మాత్రమే ఉంది. ఈ కారణంగానే పాశ్చాత్య దేశాలు, ప్రత్యేకంగా అక్కడి ప్రచార ప్రసార సాధనాలు ఇస్లాంపై కత్తిగట్టాయి. ఇస్లాం మీ జీవనసరళిని నాశనం చేసే అతి ప్రమాదకరమైన ఐడియాలజీ అని, మీ పొరుగు ముస్లింలు ఇస్లాంపై తమ అభిమానం వ్యక్తపరుస్తూ మిమ్మల్ని ప్రమాదంలో పడవేస్తు న్నారని ఈ ప్రచారసాధనాలు పాశ్చాత్య క్రైస్తవ, యూదు ప్రజానీకాన్ని హెచ్చరిస్తున్నాయి. ముస్లింలు ఐరోపా జీవనస్రవంతి నుండి వేరైపోయి ఇస్లామీయ జీవనసరళి అవలంబిస్తే, అది తమ భోగభాగ్యాలకు, విలాస జీవితానికి, విశృంఖలత్వానికి ఆటంకం కల్గిస్తుందని పాశ్చాత్యులు భయ పడ్తున్నారు. అంచేత ముస్లిందేశాల్లో ఇస్లామీయ ఉద్యమాలు తలెత్తడాన్ని, అక్కడ ఇస్లాంచట్టాల ప్రవేశాన్ని వారు సహించలేకపోతున్నారు.

పాశ్చాత్యుల దృష్టిలో నియంతృత్వం చెడ్డ వ్యవస్థ. అయితే ఆ స్థానంలో ఇస్లామీయ పాలనావ్యవస్థ ఏర్పడితే అది వారి దృష్టిలో మరింత చెడ్డ వ్యవస్థ అవుతుంది. పైగా అది 'నూతన ప్రపంచవ్యవస్థ' మార్గంలో అన్నిటి కంటే అతిపెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. అందుకే వారు ఇస్లామీయ వ్యవస్థను అప్రతిష్ఠ పాలుచేయడానికి దుష్ప్రచారోద్యమం ప్రారంభించారు.



వారి అభిప్రాయం ప్రకారం మానవహక్కులను గౌరవించే, ప్రజలకు ఆర్థికస్వేచ్ఛ, ఆర్థిక సుఖాలను అందజేయగలిగే విస్తృత దృక్పథం గల ప్రభుత్వాన్ని స్థాపించే సత్తా ఇస్లాంకు లేదు. వారి దృష్టిలో మానవహక్కుల్ని గౌరవించడమంటే వ్యక్తికి అతని వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో సమస్త చెడులకు, అశ్లీల చేష్టలకు, విచ్చలవిడితనానికి పాల్పడే స్వేచ్ఛ ఉండాలి. ఫ్రాన్స్‌లో స్వజాతిసంపర్కం లాంటి నీచకార్యానికి వ్యతిరేకంగా ముస్లింలు మాట్లాడితే, అక్కడి సమాజమంతా అభ్యంతరం తెలుపుతూ ముస్లింలు వ్యక్తి స్వాతంత్ర్యంలో జోక్యం చేసుకుంటున్నారని గగ్గోలుపెట్టింది.

పాశ్చాత్యుల దృష్టిలో ఆర్థికస్వేచ్ఛ అంటే వడ్డీతో కూడిన ఆర్థిక విధానాల ద్వారా పేదల రక్తాన్ని పిండుకునే స్వేచ్ఛ పెట్టుబడీదారులకు ఉండాలి; ఎలాంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా వారి హద్దుమీరిన లాభార్జనా కార్యకలాపాలు సాగేందుకు పూర్తి స్వాతంత్ర్యం ఉండాలి.

ఇలా అసభ్యకరాలకు, కుచేష్టలకు సైతం పాల్పడేందుకు వ్యక్తికి విశృంఖల స్వేచ్ఛ; పేదల రక్తం పీల్చుకునేందుకు పెట్టుబడిదారులకు, భూస్వాములకు ఆంక్షలులేని ఆర్థికస్వాతంత్ర్యం ఉండాలన్నదే పాశ్చాత్య సమాజం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రాతిపదికపై ప్రపంచ జాతులను తమకు అనుకూలంగా మలచుకొని వాటిపై ఆధిపత్యం వహించడానికి పాశ్చాత్యులు ప్రయత్నిస్తున్నారు. కాని సమానత్వం, సాంఘికన్యాయాలతో కూడిన ఇస్లామీయ వ్యవస్థ ముందు ఈ సిద్ధాంతం ప్రాతిపదికలు ప్రపంచ జాతుల్ని ఎంతోకాలం కట్టి ఉంచలేవని వారీనాడు భావించసాగారు. ఈ కారణంగానే వారు ఇస్లాంకు బద్ధ శత్రువులైపోయారు.

పాశ్చాత్యదేశాలు ప్రపంచంలో తాము ప్రజాస్వామ్య జ్యోతిని వెలిగించి హింసాదౌర్జన్యాల చీకట్లు పారదోలడానికి ఎంతో కృషి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటారు. కాని ఆసియా, ఆఫ్రికాలలో ప్రజాస్వామ్యం వృద్ధిచెంద డాన్ని వారు ఏనాడూ చిత్తశుద్ధితో అంగీకరించలేదు. పైగా అక్కడ సైనిక పాలనకో లేదా ఏకపార్టీ నియంతృత్వానికో కొమ్ముకాస్తూ వస్తున్నారు. ఈ

శతాబ్దం ఆసియా, ఆఫ్రికా దేశాలలో ప్రభుత్వాలను నడిపిన నియంత లలో దాదాపు అందరూ పశ్చిమదేశాల్లోని విద్యానాగరికతలను వంటబట్టిం చుకొని వచ్చినవారే. వారు తమ దేశప్రజలను భావదాస్యంలో మగ్గిపోయే లా ఉంచడానికి ప్రయత్నించారు. పాశ్చాత్యదేశాల నుండి పెద్దఎత్తున ఆయుధాలు తెప్పించుకొని తమకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రతి ప్రజా స్వామ్య ఉద్యమాన్ని కఠినంగా అణచివేశారు. వారి అణచివేత చర్యలకు పశ్చిమదేశాలు వత్తాసు పలికాయి.

దైవభీతి, పరలోక జవాబుదారీ భావన ప్రాతిపదికలపై ఏర్పడే ఇస్లామీయ ప్రజాస్వామ్యం మానవహక్కులను గౌరవిస్తూ సాంఘిక, ఆర్థిక న్యాయాన్ని, నైతిక ప్రమాణాలను, శాంతీ సుస్థిరతలను నెలకొల్పగల ఏకైక సైద్ధాంతిక వ్యవస్థ అని పశ్చిమదేశాలకు తెలుసు. అదీగాక, పాశ్చాత్యులు మానవహక్కుల కొరకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించి సాధించలేకపోయారు. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో దాన్ని సునాయాసంగా సాధించవచ్చని కూడా వారికి తెలుసు. అయితే వారు ఎలాంటి విషయంలోనూ తూర్పు దేశాల ముందు తలవంచడానికి సిద్ధంగా లేరు.

అల్జీరియా సార్వత్రిక ఎన్నికల్లో ఇస్లామిక్ సాల్వేషన్ ఫ్రంట్ ఘన విజయం సాధించినప్పుడు పాశ్చాత్యమేధావులు చిరెత్తిపోయి అక్కడ మత ఛాందసులు అధికారం చేజిక్కించుకో బోతున్నారంటూ గగ్గోలు పెట్టారు. ఈ ఎన్నికల ఫలితాలపై అమెరికా ప్రభుత్వ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానిస్తూ "మేము ప్రజాస్వామ్యాన్ని తప్పకుండా గౌరవిస్తాం. కాని దీని ద్వారా అల్జీరియాలో మితిమీరిన అధికారప్రాబల్యంతో ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను గౌరవించని వర్గం అధికారంలోకి వస్తే మాత్రం, అది మాకు సంతోషకరమైన విషయం కాదు" అని అన్నారు. (అంటే ఇస్లాం మానవ హక్కుల్ని గౌరవించదని అతని అభిప్రాయమన్నమాట.) ఇస్లాం పట్ల అమెరికా అవలంబించిన ఈవైఖరి, ఇస్లామిస్టులకు వ్యతిరేకంగా అల్జీరియా సైనికనియంతలు మరింత బరితెగించారు. (తత్ఫలితంగా అక్కడ ఎన్నికల



ఫలితాలను రద్దుచేసి ఎమర్జెన్సీ విధించడం, సైనిక పాలకులు ఇస్లాం ప్రియులపై హింసాదౌర్జన్యాలకు పాల్పడటం జరిగిపోయాయి.)

పాశ్చాత్య ఆలోచనాసరళికి అద్దంపట్టే 'న్యూస్‌వీక్' రిపోర్టర్ 'టోనీ ఎయిర్సన్' రాచరికవ్యవస్థకు దుష్ట స్మారకచిహ్నంగా మిగిలిన (జోర్డాన్ రాజు) హుసైన్ చేసిన వ్యాఖ్యను ఇలా పేర్కొన్నాడు: "ఫండమెంటలిజం ఎంతో ప్రమాదకరమైనది. ఇది నియంతృత్వానికి సంబంధించి ఏదో ఒక అతి ప్రమాదకరమైన పోకడను తప్పక తెచ్చిపెడ్తుంది." అలాగే పశ్చిమ దేశాలకు ఇష్టమైన మరో సైనికనియంత జైనుల్ ఆబిదీన్ (టునిషియా అధ్యక్షుడు) ఇస్లామిస్టులను అణచడానికి సైన్యాన్ని అప్రమత్తం చేశాడు. ఇస్లామిస్టులే దేశానికి అత్యంత ప్రమాదకారులంటూ, ఆయన పాశ్చాత్య ప్రభువుల పట్ల తనకున్న స్వామిభక్తి చాటుకున్నాడు.

ప్రస్తుతం ఇస్లాంకు, అజ్ఞానికి మధ్య విశ్వవ్యాప్త సంఘర్షణ జరుగు తోంది. అమెరికా తన 'న్యూ వరల్డ్ ఆర్డర్' ద్వారా యావత్తు అజ్ఞాన, అనాగరిక శక్తులకు నాయకత్వం వహిస్తోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలలో-ప్రత్యేకంగా ముస్లిందేశాలలో భోగలాలసులైన, పాశ్చాత్య నాగరికతాభి మానులైన నియంతలను ప్రోత్సహిస్తోంది. తనకు విధేయులయిన ఆ నియంతల ద్వారా అక్కడి ప్రజాఉద్యమాలను ఉక్కుపాదంతో అణచి వేస్తోంది. ఇస్లాంను గురించి, ఇస్లాం అభిమానులను గురించి అసత్య ప్రచారంచేస్తూ ప్రపంచాన్ని అపమార్గం పట్టిస్తోంది.

ఈవిధంగా అమెరికా సోవియట్ యూనియన్ పతనానంతరం తన 'న్యూ వరల్డ్ ఆర్డర్' మార్గంలో అతిపెద్ద అవరోధంగా మిగిలిన ఇస్లామీయ శక్తిని కూడా తొలగించి యావత్ ప్రపంచానికి నాయకత్వం వహించాలని ఉవ్విళ్ళూరుతోంది. కాని అమెరికా దుష్టపథకాలు ఎంతోకాలం సాగవు. ఈ అసత్యం, అన్యాయం, అణచివేతల కారుమేఘాల చాటునుంచే ఏదో ఒక రోజు శాంతీసుస్థిరతలు, నీతిన్యాయాలకు ప్రతీక అయిన ఇస్లాంభానుడు తప్పకుండా తన సహస్ర కిరణాలతో ఉదయిస్తాడు.

# అమెరికా జియోనిస్టుల క్రూసేడ్ యుద్ధాలు-18

పైన పేర్కొనబడినవన్నీ పాత విషయాలు. అమెరికా ఇప్పుడు వాటికి కొత్తరంగు పులిమి మరింత శక్తితో విజృంభించింది. అది తన వాడిగోళ్ళ చేతుల్ని మరింత సాగదీసి ముస్లిందేశాలపై విరుచుకుపడింది. టెర్రరిజంపై యుద్ధప్రకటన పేరుతో ఇస్లాంధర్మాన్ని అభిమానించే, ఇస్లాం సంప్రదాయాలను అనుసరించే ముస్లింలకు, ముస్లిందేశాలకు వ్యతిరేకంగా క్రూసేడ్ యుద్ధాల పరంపర ప్రారంభించింది. 'నూతన ప్రపంచ వ్యవస్థ' పథకంలోని రెండవ ఘట్టంగా అమెరికా అఫ్గనిస్తాన్‌లో ప్రజాస్వామ్య పద్ధతి ద్వారా అధికారంలోకి వచ్చిన తాలిబాన్ ప్రభుత్వాన్ని కూలదోసింది.

ఇస్లామీయ విలువల ప్రాతిపదికపై చట్టబద్ధంగా ఏర్పడిన తాలిబాన్ ప్రభుత్వాన్ని కూలదోయడంవల్ల ఇస్లాం దురభిమానులైన జియోనిస్టులు సంబరపడ్డారు గాని, అఫ్గనిస్తాన్‌లో అమెరికాకు లభించిన సిరులూగిరులూ ఏమీ లేవు. కాకపోతే తాలిబాన్ ప్రభుత్వం నిషేధించిన గంజాయి పంటను తన కీలుబొమ్మ ప్రభుత్వం ద్వారా మళ్ళీ పండించుకుంటూ పాశ్చాత్య మత్తుభాయీల పంటను పండిస్తోంది. అసలు సిరులూ గిరులూ ఉన్న ఇతర ముస్లిందేశాలపై పంజా జాపడానికి అఫ్గనిస్తాన్‌పై దాడి అమెరికాకు ఒక వారధి మాత్రమే. ముస్లిందేశాలకు తాలిబాన్ యోధుల టెర్రరిజం బూచీని మాటిమాటికి చూపిస్తూ వాటిని బెదరగొట్టి పూర్తిగా లోబరచుకోవడానికి కూడా అమెరికాకు మంచి అవకాశం లభించింది.

అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్‌ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత ఈ అవకాశం అమెరికాకు ఇరాఖ్‌లో లభించింది. కాని అఫ్గనిస్తాన్ విషయంలో చూపిన టెర్రరిజం బూచీ ఇరాఖ్‌లో ఏదీ లేకపోయినా కేవలం చమురు సంపద కోసం అక్కడ జీవరసాయనిక ఆయుధాలున్నాయంటూ ప్రపంచమంతటా గోలగోల చేసిమరీ ఆ దేశాన్ని సర్వనాశనం చేసింది. అయినా దాని యుద్ధ దాహం తీరలేదు; ఇస్లాం పట్ల రగులుతున్న దాని విద్వేషాగ్ని చల్లారలేదు. అమెరికా తన 'నూతన ప్రపంచ వ్యవస్థ' పథకానికి అన్నిటికంటే పెద్ద



అడ్డంకిగా ఉన్న ఇస్లాంను పూర్తిగా తుడిచిపెట్టేందుకు ఆరాటపడుతోంది. అఫ్గనిస్తాన్, ఇరాఖ్ పర్యవసానాలతో బెంబేలు పడిపోయి అమెరికాకు పూర్తిగా దాసోహమైపోయిన ముస్లిందేశాలు ఇప్పుడు అమెరికా నుంచి ఇస్లాం విషయంలో ఏచిన్న హెచ్చరిక వచ్చినా వణికిపోతున్నాయి.

జియోనిస్టులు తమ అసలు లక్ష్యమైన 'అఖండ ఇజ్రాయీల్' సాధన కోసం క్రైస్తవజనాభా అధికంగావున్న అమెరికా, బ్రిటన్, ఇతర యూరప్ దేశాలకు ముస్లిందేశాలపై రాజకీయ పెత్తనాన్ని, అక్కడి సిరిసంపదల్ని ఎరగా చూపి వాటిని పావులుగా వాడుకుంటున్నారు. ఈ మార్గం సుగమం చేయడానికి మొట్టమొదట అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌ల నడుములు విరగ్గొట్టి తద్వారా ముందుకు సాగాలన్నది వారి దుష్టపథకం. ఈ దుష్టపథకంలో వారు చాలావరకు విజయం సాధించారనే చెప్పాలి. అయితే ఇస్లామిస్టుల రూపంలో వారికి కన్పిస్తున్న 'టెర్రరిజంభూతం' వారినింకా వెంటాడుతూనే ఉంది. ముఖ్యంగా అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, ఇరాఖ్‌లలో ఈ 'భూతం' మాటిమాటికి కన్పిస్తూ వారిని చికాకు పరుస్తోంది.

అఫ్గనిస్తాన్‌లో ఇస్లాంయోధులకు వ్యతిరేకంగా తమకు మద్దతునిస్తున్న నార్దన్ అలైయన్స్ ట్రైబల్ ముస్లింల ముందు అమెరికా సైనికాధికారులు కొన్ని డాలర్ నోట్లు పడవేయడం మినహా వారిని ఇప్పటికీ కుక్కలకన్నా నీచంగా చూస్తున్నారు. ఆ నార్దన్ అలైయన్స్‌లో పనిచేసి మానేసిన ఒక ముస్లిం అనుభవాలు అతని నోటే వినండి:

"నేను చెప్పుకోవడానికి ముస్లింనే. ముస్లిం కుటుంబంలోనే పుట్టాను. కాని ఇస్లాం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో, సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో, మంచేమిటో, చెడేమిటో నాకు బొత్తిగా తెలియదు. నేను పుట్టుకతోనే యుద్ధప్రియుడ్ని, కొండగుహలలో పెరిగివాడ్ని. ఆయుధాలు ప్రయోగించడం, ఆయుధాలతో ఆడుకోవడం నాకు వారసత్వంలో లభించిన వ్యాపకాలు. మా తెగలలో విరోధాలు తరతరాల నుంచి సాగుతూ వస్తున్నాయి......

అఫ్గనిస్తాన్‌పై అమెరికా దాడి చేసినప్పుడు అమెరికా అధికారులు మాకు పెద్దఎత్తున డాలర్లు పంచిపెట్టారు. డాలర్లు తమ పని చేసుకుపోయాయి. తాలిబాన్లు, అరబ్‌యోధులు తమ శక్తినంతా ధారపోసి చివరివరకు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని అమెరికా భారీఆయుధాల ముందు వారు నిలువలేక పారిపోయారు. ఆ తర్వాత అఫ్గనిస్తాన్‌లో అమెరికా సైనికులు, నార్త్రన్‌అలైయన్స్ వారు జరిపినంతటి దుర్భర దౌర్జన్యకాండ మరెక్కడా జరగ లేదు. హింసాదౌర్జన్యాలు జరిపిన నార్త్రన్‌అలైయన్స్‌లో అప్పుడు నేనూ ఉన్నాను. అమెరికన్లు జరిపిన హింసాకాండను కూడా చూశాను.

**అంతంకాని ఆగడాలు** : నార్త్రన్‌అలైయన్స్ ముస్లింలు అమెరికన్లకు మద్దతు ఇవ్వడంలో, వారిఆజ్ఞల్ని పాటించడంలో అతిగా ప్రవర్తించారు. వారు అమెరికన్ల ప్రసన్నత కోసం తమ స్వమతస్థులైన, తమ దేశపౌరులైన వారిపైనే తుపాకులు ఎక్కుపెట్టారు. వాళ్ళను ఇండ్లలో మూసేసి సజీవ దహనంచేశారు. వారిస్త్రీల మానాలు దోచుకున్నారు. అనేకమంది కుటుంబ స్త్రీలను వేశ్యగృహాలకు అప్పగించారు. అరబ్ యోధుల స్త్రీలను, పిల్లల్ని వివస్త్రచేసి వారి నగ్నశరీరాలపై అమెరికాజెండాలు చిత్రీకరించారు..... ఈ హింసాకాండలో ఎక్కువగా అమెరికన్ యూదులే పాల్గొన్నారు...... నార్త్రన్ అలైయన్స్ సహకారం లేకుండా తాలిబాన్‌లను, అరబ్ ముజాహిద్‌లను అణచడం తమకు సాధ్యమయ్యేది కాదని అమెరికన్లు కూడా ఒప్పుకుంటారు. కాని మేము ఇంత చేసినా వారు మమ్మల్ని (నార్త్రన్‌అలైయన్స్ వారిని) పరమ అసహ్యంగా దూషించేవారు.

ఖైదీలను కొన్నాళ్ళు ఖంధార్, బగ్రామ్ పట్టణాలలో ఉంచిన తరువాత వారిని క్యూబా జైళ్ళకు తరలించేవారు. అలా క్యూబాకు పంపే ఖైదీలతో "మీ కష్టాలకు మేము బాధ్యులం కాము; మీపై హింసాకాండ సాగించిన మీ సోదర ముస్లింలైన నార్త్రన్ అలైయన్స్‌వారే బాధ్యులు. ధనాశతో వారు మా తరపున గూఢచారులుగా పనిచేస్తూ మిమ్మల్ని మాకప్పగించారు" అని చెప్పేవారు అమెరికన్లు. ....మేము అమెరికన్ల తరపున గూఢచారులుగా పనిచేస్తూ తాలిబాన్లను, అరబ్‌యోధులను పట్టించి ఇస్తుంటే వారు మాకు



కృతజ్ఞతలు చెప్పడానికి బదులు మమ్మల్ని, ధనాశాపరులైన కుక్కలని, గాడిద కొడుకులని, పందులని పిలిచేవారు.....

ఖందార్‌లో ఒక అమెరికన్ సైనికాధికారితో నాకు స్నేహమయింది. మేమిద్దరం పిచ్చాపాటిగా మాట్లాడుకునేవాళ్ళం. ఇద్దరం కలసి మద్యం సేవించేవాళ్ళం. ఓసారి నేను అతనితో మాట్లాడుతూ "మీరు తాలిబాన్లను, అరబ్‌యోధులను దూషించడానికి కారణం అర్థమవుతోంది కాని, మేము శక్తివంచనలేకుండా మీకు మా సహాయసహకారాలు అందజేస్తున్నా మమ్మల్ని మీరు దూషించడమే నాకర్థం కావడంలేదు" అని అన్నాను."

**అమెరికా పథకం** : అమెరికన్ అధికారి ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నాడు. అతను నా మాటలు వినగానే మొదట నన్ను, యావత్తు ముస్లింలను ఘోరమైన ఒక తిట్టు తిట్టాడు. తరువాత ఇలా అన్నాడు: "ఎవరైనా ఒక్కసారి కలిమా పఠించడంగాని, ముస్లిం కుటుంబంలో పుట్టడంగాని జరిగితే అతనిలో ఎక్కడో ఓచోట ఇస్లాం విశ్వాసకణం తప్పక మిగిలివుంటుంది. జీవితంలో ఎప్పటికైనా దాన్నతను వ్యక్తపరుస్తాడు. కనుక మా దృష్టిలో ఈ రోగానికి ఒకేఒక చికిత్స ఉంది. మొదట మేము ముస్లింలకు ధనాశచూపి వాళ్ళను కొని వారి మతవిశ్వాసాన్ని బలహీనపరుస్తాం. తర్వాత వాళ్ళను శాశ్వతంగా అంతమొందిస్తాం. బోస్నియాలో మేము ఈపనే చేశాం. పాలస్తీనాలోనూ ఈ పనే చేస్తున్నాం. ఇప్పుడు అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌లలో కూడా మేము ఈ పనే చేస్తున్నాం."

"మోమింద్‌ఖాన్! బోస్నియా ముస్లింల కంటే మీరేమంత ధైర్యవంతులు, స్వేచ్ఛాప్రియులు కాదు. వారి రెండు మూడు తరాలవారు మాతో కలసి తిన్నారు, తాగారు. వారి వృద్ధులకు ఖుర్‌ఆన్ ఏమిటో, మసీదులేమిటో తెలియదు. వారి యువకులు మాతో కలిసి నైట్‌క్లబ్బుల్లో రేయింబవళ్ళు గడిపేవారు. వారు మాతో కలసి మద్యం కూడా సేవించేవారు, పందిమాంసం కూడా తినేవారు. అయినప్పటికీ మా మతస్థులు వారి పట్ల ఎలా ప్రవర్తించారో నీకు తెలుసు."

"మోమింద్‌ఖాన్! బోస్నియా ముస్లింలు ఆచరణపరమైన ముస్లింలు కాదన్నది నిజమే. కాని వారి పేర్లు ముస్లింపేర్లే కదా! అలాగే నార్త్‌న్ అలైయన్స్ ముస్లింలు మాకు పూర్తి సహాయసహకారాలు అందించిన మాట కూడా నిజమే. అయితే వీరి పేర్లు కూడా ముస్లింపేర్లే కదా! పైగా వారు మాకోసం చేసిన పనులు మనస్ఫూర్తిగా చేసినవి కావు, ధనాశలో పడి చేశారు. మోమింద్‌ఖాన్! గుర్తుంచుకో. ప్రపంచంలో రెండు రకాల ముస్లింలు మాత్రమే ఉన్నారు. ఒకటి, తాలిబాన్‌లు, అరబ్‌యోధుల్లాంటి నిస్వార్థపరులైన ముస్లింలు. రెండు, నార్త్‌న్ అలైయన్స్ ముస్లిముల్లాంటి ధనాశపరులైన కుక్కలు, పందులు,...."

"వారి ముందు ఓ మాంసపుముక్క పడవేస్తే చాలు, వారు మా చుట్టూ తోకలూపుకుంటూ తిరుగుతారు; మా సైగలతో తమ స్వమతస్థుల్ని సైతం కరుస్తారు. ఇలాంటి కుక్కలు మాంసపుముక్కలు దొరుకుతున్నంత కాలం విధేయులైఉంటాయి. మాంసపు ముక్కలు దొరకటం ఆగిపోగానే అవి తమ యజమానినే కరచి తింటాయి. అలాంటి పరిస్థితి రాకముందే వారికి తగిన చికిత్స కూడా మేము చేయవలసి ఉంటుంది"

"మిత్రమా! అమెరికాలో మాకెలాంటి సౌఖ్యాలు, సౌకర్యాలున్నాయో అఫ్గనిస్తాన్‌లో వాటినిగురించి ఊహించనైనాలేము. అఫ్గనిస్తాన్ సుందరమైన దేశం కాదు. ఇక్కడ బంగారుగనులు కూడా లేవు. అయినా అఫ్గనిస్తాన్‌పై దాడిచేసి గుంతలుపడిన రోడ్లు, పంజరుకొండలున్న ఈ దేశంలో మేము కూర్చున్నామంటే దానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ప్రస్తుత శతాబ్దం క్రైస్తవులు-యూదులు ప్రాబల్యం వహించే, ముస్లింలు అంతమయ్యే శతాబ్దం కానున్నది. అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్‌లను, అరబ్‌యోధులను అంత మొందించకుండా ఇరాఖ్‌పై దాడిచేస్తే అది మాకెన్నో ఇబ్బందులు తెచ్చి పెట్టవచ్చు. అంచేత ఇరాఖ్‌పై దాడి, ఆతర్వాత మధ్యప్రాచ్యంలో అఖండ యూదసామ్రాజ్యం స్థాపనకోసం ముందుగా అఫ్గనిస్తాన్‌లోని ఇస్లామీయ యోధుల నడుములు విరగ్గొట్టవలసిన అవసరమొచ్చింది."



"ముస్లిం పంక్తులలో నీలాంటి ధనాశపరులయిన ముష్టివెధవలు ఉండటం మాకెంతో ఆనందంగా ఉంది. నీలాంటివాళ్ళ సహకారంతో మాకు అఫ్గనిస్తాన్‌లో విజయం లభించింది. ఆ తరువాత కూడా మేము ముస్లింజగత్తుపై విజయపరంపరలు సాధించడానికి, సిలువప్రాబల్య పతాకాలు ఎగరవేయడానికి ప్రారంభించే పవిత్ర యుద్ధంలో ముస్లిం జగత్తు నుంచి మాకు వేలాదిమంది మోమింద్‌ఖాన్‌లు లభిస్తారు...."

"మిత్రమా! నీకు చరిత్రపట్ల ఆసక్తిఉంటే విను. పాలస్తీనాను సాధించు కోవడానికి, బైతుల్‌మఖ్దిస్‌ను స్వాధీనం చేసుకోవడానికి క్రైస్తవులు శిలువ యుద్ధ పరంపరలు ప్రారంభించినప్పుడు ఆ యుద్ధాలలో పాల్గొన్నవారు ఈనాటి (క్రైస్తవ)సైనికుల కంటే ఎంతో ఎక్కువ తాగుబోతులు, వ్యభిచా రులు, సంస్కారహీనులుగా ఉండేవారు. మా పాలకులలో, పాదరీలలో కూడా ఇదే పరిస్థితి ఉండేది. వారు సాధారణ పరిస్థితులలో మందు మగువ మత్తులో మునిగితేలుతుంటారు. కాని సిలువ-నెలవంక సంఘర్షణ సమయం వస్తే మాత్రం శత్రువులతో ప్రాణాలు తెగించి పోరాడుతారు. మద్యపానం మా మతభావోద్రేకాలను రెచ్చగొడ్తుంది."

"సోవియట్ రష్యా పతనం తరువాత ముస్లింలు ప్రపంచంలో ఇస్లాం ఆధిక్యతాకలలు కనడం ప్రారంభించారు. సైన్సు, సాంకేతికరంగాల ప్రగతి కోసం మేము పాటుపడాలి; నేలపై-నీటిపై మానిర్వహణ సాగాలి; అంతరిక్ష విజయాలు మేము సాధించాలి. కాని రాజకీయ, మతపరమైన పటిష్ఠత, ప్రాబల్యాల కలలు మాత్రం ముస్లింలు కనాలా! ఇదెలా సాధ్యం?"....

(మోమింద్‌ఖాన్ కథనం:).......యధాప్రకారం ఓరోజు ఖంధార్ జైలు నుంచి ఇంటరాగేషన్ కోసం పొడవైన గడ్డాలున్న కొందరు అరబ్ ఖైదీలను ఖంధార్ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. మొదట వారిని ఇనుప సంకెళ్ళతో కాళ్ళుచేతులు కట్టివేశారు. తర్వాత వారి శిరోజాలు, గడ్డాలు, కనుబొమలు గొరిగించి వారిని భయంకరమైన చిత్రహింసలకు గురిచేశారు. ఆ తరువాత ఒక అమెరికన్ అధికారి వారి ముందు నిలబడి ఇలా ప్రసంగించాడు:

“మీరు గౌరవం, సాఫల్యాలు ధర్మాన్ని ఆచరించడం వల్ల లభిస్తాయిని అంటారు. మీ ముహమ్మద్ (సల్లం) ఆజ్ఞ కనుక గడ్డాలు పెట్టుకుంటున్నామని చెబుతారు. ఇస్లాం ప్రాబల్యం, సిలువను విరగొట్టే కలలు కంటున్న ముస్లింలారా! మీ స్థాయి ఏమిటో, మీరెంతటివాళ్ళో ఆలోచించుకోండి. మీకు ఎలాంటి ఇళ్ళు లేవు, స్వస్థలాలు లేవు. మీ మాతృదేశాలలో మీ కోసం ఉరితాళ్ళు ఎదురుచూస్తున్నాయి. మీ పాదాల కింది నుంచి మేము అఫ్ఘనిస్తాన్‌ని లాక్కున్నాము. మీ కిప్పుడు ప్రపంచంలో ఎక్కడా ఆశ్రయం లేదు. అఫ్గనిస్తాన్‌లో మీరు నిర్మించుకున్న ఇండ్లను మేము నేలమట్టం చేశాం. మా బాంబుదాడులు మీనుండి మీ పసిపిల్లలను లాగి వేశాయి. పరదా పాటించడం ఖుర్‌ఆన్ ఆజ్ఞ అని మీరు ఏడేసి పరదాల చాటున దాచిన మీ తల్లులు, అక్కచెల్లెళ్ళు, భార్యలు, కుమార్తెలు మా లైంగికేచ్ఛకు బలయిపోయారు....”

“బాగా వినండి. మేము మిమ్మల్ని అణచివేస్తాం, నలిపేస్తాం, తొక్కివేస్తాం. ఇతర ముస్లింలకు కనువిప్పు కలిగేలా మేము మీకు చావును కోరుకునేటటువంటి నరకయాతనలకు గురిచేస్తాం.....మీరు మొత్తం ప్రపంచంలోనే పెద్ద టెర్రరిస్టులు. మీ ధర్మం టెర్రరిజాన్ని బోధిస్తుంది. మీ ఖుర్‌ఆన్ టెర్రరిస్టు శిక్షణ ఇస్తుంది. మీ ప్రవక్త ప్రపంచంలో అందరికంటే అతిపెద్ద టెర్రరిస్టు. (దైవం క్షమించుగాక). మేము మీ మతాన్ని తుడిచిపెడతాం. మీ ఖుర్‌ఆన్‌ని కాల్చిపారేస్తాం. (దైవం క్షమించుగాక.)......”

అమెరికన్ అధికారి చేసిన ఈ ప్రసంగం తరువాత సంకెళ్ళతో బంధించబడిన ఖైదీలలో ఒక అరబ్‌ఖైదీ ముందుకొచ్చి అదురూ బెదురూ లేకుండా ఇంగ్లీషులో ఇలా ధారాళంగా మాట్లాడాడు:

**చేసిన మేలు మరచిన క్రైస్తవులు** : “మిస్టర్! జాతుల గతచరిత్ర వాటి వర్తమానచరిత్రకు అద్దంలాంటిది. రా. మన ఉభయజాతుల గత చరిత్రలను ఓసారి పరిశీలిద్దాం. మిమ్మల్ని మీరు గొప్ప ప్రజాస్వామ్య ధ్వజవాహకులని, పరమ శాంతికాముకులని చెప్పుకుంటారు. మేము



మాత్రం మీ దృష్టిలో టెర్రరిస్తులం! మేము కాదు, మీరే పెద్ద టెర్రరిస్టులు. మన ఉభయుల గత చరిత్రలేమిటో చరిత్ర గ్రంథాలలో భద్రపరచబడి ఉన్నాయి. సిలువపూజారులు బైతుల్‌మఖ్దిస్‌పై విజయపతాకం ఎగరవేసిన వెంటనే ముస్లింలపై మారణకాండ జరిపి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. వారి గుర్రాల గిట్టలు ముస్లింల నెత్తుటితో తడిసిపోయాయి. పట్టణ వీథుల్లో ముస్లింల రక్తం వర్షపు నీరులా ప్రవహించింది. మీయీ వైఖరికి భిన్నంగా సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి బైతుల్‌మఖ్దిస్‌ని జయించిన తరువాత క్రైస్తవుల పట్ల ఆయన కనబరచిన న్యాయవైఖరి ఎలాంటిదో మీ చరిత్రకారులకు కూడా తెలుసు.”

“స్పెయిన్ చరిత్రను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. స్పెయిన్‌లో మేము మీకు ఎన్నెన్నో భాగ్యాలు ఇచ్చాము. విద్య, వివేకం, వైద్యం, విజ్ఞానం, ఐశ్వర్యం- ఒకటేమిటీ, అనేక సంపదలతో స్పెయిన్ ఖజానాలు నింపేశాము. మేము యూరప్‌ని వ్రేలు పట్టుకొని నడిపించాం; చేయి పట్టుకొని వ్రాయించడం నేర్పాము. మీ విశ్వవిద్యాలయాల్లో, పరిశోధనాశాలల్లో మా మేధావులు, వైజ్ఞానికులు, తాత్వికులు వ్రాసిన పుస్తకాలను శతాబ్దాల తరబడి చదివించడం జరుగుతుండేది. అది మీ పాదరీలు, పోపులు తాము అజ్ఞానులుగా ఉండటాన్ని గర్వకారణంగా భావిస్తుండిన కాలం. ఒకవేళ ఎవరైనా క్రైస్తవుడు ముస్లింలతో ప్రభావితుడయి జ్ఞానార్జన కోసం ప్రయత్నిస్తే చర్చిఅధికారులు అతడ్ని సజీవసమాధి చేసేవారు.”

“ఈ యదార్థాలన్నీ చరిత్ర పుస్తకాలలో ఉన్నాయి. మీకు ధైర్యముంటే వాషింగ్టన్‌లోని ఏదైనా లైబ్రరీకు వెళ్దాం పదండి. నగరం మీదే, లైబ్రరీ మీదే, అందులోని పుస్తకాలు కూడా మీవే. మేము అధికారంలో, ఉచ్ఛదశలో ఉన్నప్పుడు మీపట్ల మేము ఎలా వ్యవహరించామో మీ పుస్తకాలే తీర్పిస్తాయి. ఈనాడు మీరు ఉచ్ఛదశలో ఉండి మాపట్ల మీరు ఎలా ప్రవర్తిస్తున్నారో పాలస్తీనాలోని ప్రతి అంగుళం భూభాగం సాక్ష్యమిస్తోంది. యూదులు ఈనాడు మీ తలలపై బలవంతపు కిరిటాలై కూర్చున్నారు.

వారు మీ మెడలపై ఎక్కి మీచేత ముస్లింల మీద హింసాకాండలు జరిపిస్తున్నారు. ఈ యూదులకే మేము స్పెయిన్‌లో ఆశ్రయమిచ్చాం, ఆదరించాం, గౌరవించాం. కాని స్పెయిన్ మీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీరు ఈ యూదుల్ని దేశం నుండి తరిమికొట్టారు. అప్పుడు ఉస్మానియా ఖిలాఫత్ ప్రభుత్వం వారికోసం తన ద్వారాలు తెరచిపెట్టింది.''

''రండి, మీ మేధావులు, చరిత్రకారుల సమక్షంలో నాతో సంభాషణ జరపండి. వాస్తవాలు వీటికి వ్యతిరేకంగా ఉంటే మీరన్నట్లు మేము నిజంగా టెర్రరిస్టులమే. కాని వాస్తవాలు ఇవే అయితే మీ ఇష్టం; మీ హృదయాలు, అంతరాత్మలు ఎలా మసిబారి ఉన్నాయో, అలా మీ ముఖాలక్కూడా మసిపూసుకొని పాడుచేసుకోండి. నల్ల హృదయాలతో, నల్ల అంతరాత్మలతో వున్న తెల్లమొహాలకు నల్లపనులు శోభించవు.... సత్యాసత్యాల సంగ్రామ పరంపర ప్రారంభమయింది. ఈ సంగ్రామంలో అసత్యం పరాజయం పాలవుతుంది. సత్యమే విజయం సాధిస్తుంది. ఈనాడు మేమీ సత్యవిజయం చూడలేకపోతే మా భావితరాలు దైవ చిత్తమయితే తప్పక చూస్తాయి.''

''మీరు ఉసామా బిన్ లాదిన్, ముల్లా ఉమర్‌ల పేర్లను ఆసరగా తీసుకొని ముస్లింలపై హింసాకాండకు పాల్పడ్డారు. మీ యుద్ధం అసలు ముస్లింలకు వ్యతిరేకంగా కాదు, ఇస్లాంకు వ్యతిరేకంగా జరుగుతోంది. మీరు ఇస్లాం వాస్తవికత, సత్యతల పట్ల భయపడుతున్నారు. ప్రపంచంలో పెరుగుతున్న ఇస్లాం ప్రభావం-ప్రాబల్యాలు చూసి బెంబేలెత్తి పోతున్నారు. కాని ఒక విషయం గర్తుంచుకోండి. ఇస్లాంను తుడిచిపెట్టేందుకు మీరు పన్నుతున్న కుట్రలు కుతంత్రాలు చివరికి మీకే ఉరిత్రాడులుగా మారుతాయి....''

''యుద్ధం తీవ్రరూపం దాల్చినప్పుడు మీరు పిరికిపందల్లా మడమ తిప్పి రంగం నుంచి పారిపోవడం మీ చరిత్రలో ఒక భాగమైపోయింది. ఈసా (అలైహి)ను దేవుడు సజీవంగా ఆకాశంలోకి పెకెత్తుకున్నాడని మా



ఖుర్‌ఆన్ అంటున్నది. దీనికిభిన్నంగా మీ మతగ్రంథాలు ఈసా (అలై)ను సిలువపై ఎక్కించినప్పుడు ఆయన శిష్యులు ప్రాణత్యాగం చేసి ఆయన్ని కాపాడటానికి బదులు పారిపోయారని చెబుతున్నాయి. మీకు గుర్తుందా? సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి పాలస్తీనాభూభాగం నుండి మీ నాయకులను, పెద్దలను తరిమితరిమి కొడ్తున్నప్పుడు, మీ నాయకుల్లో ఒకతను క్రైస్తవుల ప్రాణాలు కాపాడేందుకు లంచంగా తన చెల్లెల్ని సుల్తాన్ సోదరుడు మలిక్ ఆదిల్‌కు అప్పగించడానికి సిద్ధమయ్యాడు.''

**బతికితే సమరయోధులు, చస్తే అమరవీరులు** : ''మిస్టర్! మీరు మా పర్యవసానం గురించి కాదు, మీ పర్యవసానం ఏమవుతుందో ఆలోచించుకోండి. మేము సజీవంగాఉంటే సమరయోధులు అనబడతాం. మీచేతిలో మరణిస్తే అమరవీరులవుతాం. మీరిప్పుడు రానున్న భయంకర పర్యవసానం నుండి కాపాడుకోదలిస్తే ఒకేఒక మార్గం ఉంది. మీరు ఇస్లాం స్వీకరించి మాలో చేరిపోండి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆశ్రయంపొంది ఏకదైవారాధకులుగా జీవితం గడపండి. మీరు (పరలోక) దుష్పర్యవసానం నుండి కాపాడుకునే ఏకైక మార్గం ఇదే....''

ఆ తరువాత ఆ అరబ్ యోధుడు తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ, చేతులు జోడించి ఈవిధంగా ప్రార్థించాడు: ''దేవా! దేవా! నేను నీ ధర్మ సందేశాన్ని వీరికి అందజేశాను. దీనికి నీవే సాక్ష్యం. దేవా! నీయీ దాసులకు రుజుమార్గం ఏమిటో, అపమార్గం ఏమిటో తెలియదు. సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో, ధర్మం ఏమిటో, అధర్మం ఏమిటో బొత్తిగా తెలియదు. నీయీ దాసులపై దయజూపు. వీరిని నరకాగ్ని నుండి కాపాడు. నరకాగ్ని నుండి కాపాడు.....''

అరబ్ యువకుని ప్రసంగం ముగిసిన తర్వాత ఆ అమెరికన్ అధికారి బెల్లం కొట్టిన రాయిలా కాస్సేపు మౌనంగా నిలబడ్డాడు. ఆ తరువాత ఓ గావుకేక పెట్టి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. ఇతర అధికారులు కూడా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ అతని వెనకాలే నడిచారు....

ఈ సంఘటన మొదటిసారిగా నా రాతిగుండెపై సుత్తిదెబ్బ వేసింది... ఆ తరువాత ఖంధార్ ఎయిర్‌పోర్ట్ దగ్గర జరిగిన మరో సంఘటనతో నాకు పూర్తిగా కనువిప్పు కలిగింది. సంకెళ్ళతో కాళ్ళుచేతులు కట్టివేయబడిన తాలిబాన్, అరబ్ ఖైదీలు ఒకవైపు నిల్చున్నారు. ఇంతకుముందు అరబ్ యువఖైదీతో మాట్లాడిన అమెరికా సైనికాధికారి, అతని అనుచరులు వారి ముందు నిలబడ్డారు. కాస్సేపటికి అమెరికన్ అధికారి తన జేబులో నుంచి ఓ పుస్తకం బయటికి తీసి ఖైదీలకు చూపిస్తూ ఇలా అన్నాడు:

**ఖుర్ఆన్ పట్ల అపచారం** : ‘‘ముస్లింలారా! నాచేతిలో ఉన్న ఈ పుస్తకం ఏమిటో తెలుసా? మీకు తెలుసు. మీభాషలో ఖుర్ఆన్ అని చెప్పే పుస్తకమిది. దీనిప్రకారం ఆచరిస్తే ఇహపరలోకాల్లో సాఫల్యం లభిస్తుందని అంటారు మీరు. ఖుర్ఆన్ మీ ప్రవక్తపై దేవుడు అవతరింపజేసిన గ్రంథమని చెబుతారు. మీరు దీన్ని ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటూ దీనిద్వారా మీరు ప్రపంచంలో ప్రాబల్యం వహించగల్గుతామని భావిస్తున్నారు. మీ దేవుడు యావత్తు విశ్వానికి ప్రభువు, యజమాని కదా! అయితే మీ దేవుడ్ని పిలుచుకోండి, ఆయన మీకెంత సహాయం చేస్తాడో మేము చూస్తాం. నేనిప్పుడు మీఖుర్ఆన్ పట్ల ఎంతచెడుగా ప్రవర్తిస్తానో చూడండి. నన్నీ పని నుండి మీ దేవుడొచ్చి అడ్డుకుంటాడేమో చూస్తాను.’’

ఈ మాటలు చెప్పి ఆ అమెరికన్ అధికారి చేతిలోని ఖుర్ఆన్ ప్రతిని నేలకేసి విసిరికొట్టాడు. తర్వాత దానిమీద కాలుపెట్టి తొక్కివేస్తూ “ముస్లింలారా! నేనిప్పుడు మీ పవిత్రగ్రంథాన్ని కాళ్ళతో తొక్కి ఎలా పాడుచేస్తున్నానో అదేవిధంగా మేము ప్రపంచంలోని ముస్లిలందరినీ తొక్కివేసి అంతమొందిస్తాం. మరి మీలో ఎవరైనా నన్ను అడ్డుకునే వారున్నారా?’’ అని అన్నాడు. ఆ తరువాత ఆ దుర్మార్గుడు మరికొన్ని ఖుర్ఆన్ ప్రతులు తెప్పించి వాటిలో కొన్నిటిని చింపి గాలిలో ఎగరేశాడు; మిగిలిన ప్రతుల్ని పక్కనే ఉన్న మలవిసర్జన డ్రమ్ములలోకి విసరిపడేశాడు....

(ఉర్దూపత్రిక ‘దావత్’ 1-6-05, 4-6-05 సంచికల సౌజన్యంతో)



# ముస్లింల ఉత్థాన పతనాలు-19

దైవగ్రంథాన్ని విస్మరించి ప్రాపంచిక ప్రయోజనాల వెనుక పరుగులు పెడ్తున్న నేటి ముస్లింలు ఎప్పుడు కళ్ళుతెరచి వాస్తవ పరిస్థితుల్ని వీక్షిస్తారో మరి! ఖుర్ఆన్ 14శతాబ్దాలు గడచినా ఏమాత్రం ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురికాని స్వచ్ఛమైన దైవవాణి అని ముస్లింలు గొప్పలు చెప్పుకుంటారు. దాని పట్ల ఇస్లాంవ్యతిరేక శక్తులు ఏదైనా అపచారం తలపెడితే తల్లడిల్లిపోతూ నిరసనప్రదర్శనలు కూడ జరుపుతారు. కాని ఖుర్ఆన్ అధ్యయనం పట్ల వారి సంకుచిత వైఖరి ఈనాటికీ మారలేదు.

ముస్లింల ఉత్థాన పతనాలకు ప్రధాన కారణం ఖుర్ఆనే అంటే అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అంటే ఖుర్ఆన్ ఆదేశాలను, హితోపదేశాలను గట్టిగా ఆచరించడం లేదా ఆచరించక పోవడం అన్నమాట. ఈ విషయాన్ని ఖుర్ఆన్, హదీసులు కూడా సమర్థిస్తున్నాయి.

“మీరంతా కలసి దైవత్రాటిని దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడి చీలిపోకండి.” (3:105) అనే ఖుర్ఆన్ సూక్తిలోని ‘దైవత్రాడు’ అనే పదం దైవధర్మం లేక దైవగ్రంథం వైపు సూచిస్తోంది. ఖుర్ఆన్ ముస్లింల జీవిత సంవిధానం (Constitution).

ఖుర్ఆన్ గతజాతుల ఉత్థాన పతనాలను గురించి, దైవప్రవక్తల, భక్తి పరాయణుల జీవిత విశేషాలను గురించి తెలియజేస్తూ, వాటి నుంచి గుణపాఠం నేర్చుకోవలసిందిగా మానవులను కోరుతుంది. సత్యతిరస్కారులు, దుర్మార్గులు ప్రపంచంలో సయితం పరాభవం, పతనాలకు గురవుతారని అలాగే విశ్వాసులు, సదాచారులు ఇహలోకంలో కూడా ఔన్నత్య శిఖరాలను అందుకోగలరని చెబుతుంది. స్వర్ణయుగంగా భాసిల్లిన ‘‘తొలి నలుగురి ఖలీఫాల పాలనాకాలం’’లో ముస్లింల వైభవోన్నతుల ముందు యావత్ ప్రపంచం తలవంచిన సంగతి తెలిసిందే.

ఈ గ్రంథం మనిషిని దైనందిన జీవిత వ్యవహారాల నుండి సదా ఏకాంత కుహరాల్లోకి తీసికెళ్ళి తాత్విక చింతనను నూరిపోసే తత్వశాస్త్రం

కాదు. ఇది దేవునికి, దాసునికి మధ్య వుండవలసిన వాస్తవిక సంబంధాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని, దానికి బలం చేకూర్చేందుకు కావలసిన ఇతర అంశాలను ఉపవిషయాలుగా పేర్కొంటుంది. అంచేత ఇందులో జీవితసమస్యలకు సంబంధించిన సమస్త విషయాలు మనకు కనిపిస్తాయి.

ఇది సామాజికశాస్త్రం కాకపోయినా, ఇందులో సత్సమాజస్థాపనకు అవసరమైన సాంఘికన్యాయం, సభ్యతాసంస్కృతులు, కౌటుంబిక, వైవాహిక విషయాలు కూడా ఉన్నాయి. ఇది నీతులు వల్లించే నీతిశాస్త్రం కాకపోయినా ఇందులో మానవుల్ని నీతిమంతులుగా, దైవభీతిపరులుగా తీర్చిదిద్దడానికి కావలసిన అత్యున్నత నైతికనియమావళి ఉంది.

ఇది ఆర్థిక సమస్యల్ని పరిష్కరించే అర్థశాస్త్రం కాకపోయినా ఇందులో ధనార్జన, ధనవినియోగాల్ని గురించి చర్చించి ఆర్థికన్యాయానికి రాచబాట నిర్మిస్తుంది. ఈ గ్రంథం రాజకీయవ్యవహారాలను తెలిపే రాజకీయశాస్త్రం కాకపోయినా రాజనీతి, పరిపాలన, యుద్ధం,సంధి, జాతీయ, అంతర్జాతీయ సంబంధాలు మొదలైన రాజకీయవ్యవహారాల్ని కూడా స్పృశిస్తుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇది జీవితానికి సంబంధించిన సమస్త రంగాల్లో దేవుని హితవుల్ని మానవుల ముందు పెట్టి, వాటి విషయంలో మరణానంతరం దేవుని ముందు బాధ్యత వహించవలసి వుంటుందని అడుగడుగునా అతడ్ని హెచ్చరించే, ఉపదేశించే ఓ విశిష్ఠ గ్రంథరాజం.

కనుక ఈ ఆశయం నెరవేరాలంటే, విద్యార్థి సిలబస్‌లోని తన పాఠ్య గ్రంథాన్ని పఠిస్తున్నట్లు ఈగ్రంథాన్ని నిత్యం పఠిస్తూఉండాలి. అందుకే దీనికి 'ఖుర్‌ఆన్'అని పేరొచ్చింది. అంటే పాఠ్యగ్రంథం, పఠనపుస్తకం, పారాయణగ్రంథం అన్న మాట. ఈ భావంలో దీన్ని పఠణవేదమని కూడా చెప్పవచ్చు. హిందూమత గ్రంథాల్లోని కొన్ని భవిష్యత్ ప్రకటనల్ని పరిశీలిస్తే, వాటిలో ప్రస్తావించబడిన పఠణవేదం ఖుర్‌ఆనే అయి ఉండవచ్చన్న సందేహం కూడా కలుగుతుంది.



"వారు తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు. ప్రవక్తా! నీ ప్రభువు సాక్షి! (వారి కర్మల్నిగురించి ప్రళయదినాన) మీరేమి చేస్తుండే వారని మేము వారిని తప్పకుండా ప్రశ్నిస్తాము." (ఖుర్‌ఆన్–15:91–93)

ఖుర్‌ఆన్ అంటనే నిత్యపఠనానికి, దానిప్రకారం ఆచరించడానికి ఇవ్వ బడిన పాఠ్యగ్రంథం. దావూద్ ప్రవక్త (అలై)పై అవతరించిన జబ్బూర్, మూసాప్రవక్త (అలై)పై అవతరించిన తౌరాత్, ఈసాప్రవక్త (అలై)పై అవత రించిన ఇన్జీల్ గ్రంథాలు కూడా ఆయా కాలాల ప్రజలు కోసం పంపబడిన ఖుర్‌ఆన్‌లే. అంతిమ దైవప్రవక్త (స)పై అవతరించిన ఖుర్‌ఆన్ ఈనాటి ప్రజలు నిత్యపఠనానికి, దాని ప్రకారం వారు ఆచరించడానికి పంపబడిన కలియుగ పాఠ్యగ్రంథం.

యూదులు తౌరాత్‌లో ఇచ్చిన ఆజ్ఞలలో కొన్నిటిని విశ్వసించి, మరి కొన్నిటిని తిరస్కరించారు (2:85). అందువల్ల వారు తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారని దేవుడు పై సూక్తిలో తెలియజేస్తూ "మీరు కూడా యూదుల వైఖరి అవలంబించి నా ఆగ్రహానికి గురికా కండ"ని ముస్లింలను హెచ్చరిస్తున్నాడు.

"(ముహమ్మద్!) ఏమైనప్పటికీ నీవు మటుకు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపబడిన ఈ గ్రంథాన్ని దృఢంగా పట్టుకో. నిస్సందేహంగా నీవు సన్మార్గంలో ఉన్నావు. ఈగ్రంథం నీకు, నీజాతి ప్రజలకు గొప్ప హితకారిణి. త్వరలోనే మీరంతా దీని విషయమయి (దేవుని సమక్షంలో) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది." (ఖుర్‌ఆన్–43:44)

ఖుర్‌ఆన్ విషయంలో దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని పైసూక్తి ముస్లింలను హెచ్చరిస్తోంది. మరి నేటి ముస్లింలు దేవునికి ఏం సమాధానం చెప్పుకుంటారు? "మేము ఖుర్‌ఆన్ పఠిస్తూనే ఉండేవాళ్ళం కదా!" అని సమాధానం చెబుతారా? "అయితే దాని ప్రకారం మీరెందుకు ఆచరించలేదు?" అనే మరోప్రశ్న ఎదురవుతుంది. దానికి ఏమని సమాధానమిస్తారు? "ఖుర్‌ఆన్‌భాష మాకు తెలియదు.

అందువల్ల మేము దాని ప్రకారం ఆచరించలేకపోయాం" అని సమాధాన మిస్తారా? "ఖుర్ఆన్‌భాష ఎందుకు నేర్చుకోలేదు లేదా మీకు తెలిసిన భాషలో దాని అనువాదం మీరు ఎందుకు చదవలేదు?" అనే వేరొక ప్రశ్న కూడా ఎదురుకావచ్చు. దానికి వివరణ ఏం ఇచ్చుకుంటారు?

ముస్లింలు ఖుర్ఆన్‌ని విశ్వసించామని చెప్పుకుంటారు. ఖుర్ఆన్‌ని విశ్వసించడం అంటే ఏమిటీ? దాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసి కళ్ళ కద్దుకోవడమేనా? కాదు. ఖుర్ఆన్‌ని విశ్వసించడమంటే మన దైనందిన జీవితంలో దాని బోధనలు అమలు పరచాలి; అది ఆదేశించిన విషయాల్ని ఆచరించాలి; అది నిషేధించిన విషయాల్ని మానెయ్యాలి. ఈ విషయం గురించే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరు ఖుర్ఆన్ నిషేధించిన విషయాలను ధర్మసమ్మతం చేసుకున్నాడో అతను నిజానికి ఖుర్ఆన్‌ని విశ్వసించనే లేదు." (తిర్మిజి)

"దైవగ్రంథం ప్రకారం ఆచరించేవాడు ఇహలోకంలోనూ మార్గభ్రష్టుడు కాలేడు, పరలోకంలోనూ తన ప్రతిఫలాన్ని కోల్పోలేడు." ఇలా చెప్పి ఆయన "నా హితబోధను అనుసరించేవాడు ప్రపంచంలోనూ దారితప్పడు, పరలోకంలోనూ దౌర్భాగ్యానికి గురికాలేడు" అన్న ఖుర్ఆన్ సూక్తి పఠించారు. (ఇబ్నెఅబ్బాస్-మిష్కాత్)

ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే అందులోని బోధనలను ఆచరించడానికి వీలవుతుంది. రోజుకు ఐదుసార్లు నమాజ్ చేయాలని ఇవ్వబడిన దైవాజ్ఞ వెనుక 'నమాజులో భక్తులు పఠించే సూక్తుల్ని ఆచరణలో పెట్టాలన్న' లక్ష్యమే ఉంది. ఈ లక్ష్యం ఉండటం వల్లనే "నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది" అని ఖుర్ఆన్ పేర్కొంటున్నది. (29:45)

ఖుర్ఆన్‌ని అర్థం చేసుకున్నప్పుడే నమాజ్ మనిషిని చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది. ఖుర్ఆన్ భాష అర్థంకానప్పుడు వేరే సమయంలో దాని అనువాదాన్ని మనకు తెలిసిన భాషలోనైనా చదువు



కోవాలి. ఇలా ఒక విషయాన్ని మాటిమాటికి చదవడంవల్ల అది మనల్ని ఆచరణ వైపు ప్రేరేపిస్తుందని ఆశించగలం.

ఖుర్ఆన్ అసలు లక్ష్యాన్ని విస్మరించి కొందరు దాని సమక్షంలో హదీసుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు ఫిఖా విషయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంకా కొందరైతే ఖుర్ఆన్, హదీసు గ్రంథాలను వదలిపెట్టి కొన్ని ఖుర్ఆన్ సూక్తులు, కొన్ని హదీసు ఉల్లేఖనాలతో కూడిన ఒక పుస్తకం పట్టుకొని "ఇందులోనే అన్నీ ఉన్నాయి. ఇక వేరే ఖుర్ఆన్, హదీసులు చదవనవసరం లేదు" అంటున్నారు. వారి బోధకులు, ప్రచారకులు ప్రజలకు వాటినే బోధిస్తున్నారు, ప్రచారం చేస్తున్నారు.

ఈ కారణాలగానే చాలామంది ముస్లింలు రోజుకు అయిదు పూటలా నమాజ్ చేస్తున్నప్పటికీ అబద్ధమాడటం, వాగ్దానభంగం చేయడం, మోసగించడం, ఇతరుల హక్కుల్ని కొల్లగొట్టడం, మంచివాళ్ళపై అపనిందలు మోపడం, వడ్డీవ్యవహారాలు నడపడం, కుమార్తెలకు ఆస్తివాటాలు ఎగవేయడం, లక్షల రూపాయల కట్నాలు గుంజడం, నిషిద్ధవస్తువుల వ్యాపారం చేయడం, బలహీనుల్ని దోచుకోవడం, పరస్త్రీలను తదేకంగా చూడటం, వెకిలిచేష్టలకు పాల్పడటం మానుకోలేక పోతున్నారు. ఇలాంటి ముస్లింలు చేసే నమాజ్‌ని దేవుడు ఎలా స్వీకరిస్తాడు?

వీటన్నిటికి పరిష్కారం రెగ్యులర్‌గా ఖుర్ఆన్‌ని అధ్యయనం చేయడమే. ఖుర్ఆన్ అధ్యయనమే మానేస్తే ఇక దేవునికి, దాసునికి సంబంధం ఏముంటుంది? ఇలాంటి మనిషికి సమాధిలో ఖుర్ఆన్ సహాయపడుతుందని చెప్పగలమా? అతని మోక్షంకోసం దేవుని దగ్గర సిఫారసు చేస్తుందని ఆశించగలమా? ఇస్లాంవ్యతిరేక శక్తులు ముస్లింలను ఖుర్ఆన్‌కు దూరంగా ఉంచడానికి రకరకాల కుట్రలు పన్నుతున్న ఈనాటి కాలంలో ముస్లింలు తీవ్రంగా ఆలోచించవలసిన విషయమిది.

మహాప్రవక్త (సల్లం) మహితోక్తి : "దేవుడు ఈగ్రంథం ద్వారా కొందరిని ఉద్ధరిస్తాడు; మరికొందరిని అణగద్రొక్కుతాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: ''ఖుర్ఆన్ కలిగివున్న ప్రజలారా! ఖుర్ఆన్‌ని తలగడగా చేసుకోకండి. దాన్ని పఠించవలసిన విధంగా పఠిస్తూ ఉండండి. రేయింబవళ్ళు పఠిస్తూఉండండి. దాన్ని బహిరంగంగా పఠించండి. మంచి స్వరంతో పఠించండి. అందులోని విషయాలను పరిశీలించండి, ఆలోచించండి- తద్వారా మీరు సాఫల్యభాగ్యం పొందగలరని ఆశించగల్గుతారు. దాని ప్రతిఫలం మీకు పరలోకంలో తప్పక లభిస్తుంది. అంచేత ప్రపంచంలో దాని ప్రతిఫలం పొందడానికి ప్రయత్నించకండి.'' (బైహఖి)

దైవప్రవక్త (స) హితోక్తి: ''దేవుడు స్వయంగా ఇలా సెలవిస్తున్నాడు: ఏ మనిషిని ఖుర్ఆన్ నన్ను స్మరించలేనంతగా, వేడుకొనలేనంతగా ధార్మిక కార్యకలాపాల్లో నిమగ్నం చేస్తుందో నేనతనికి దుఆ చేసేవారికిచ్చేటటువంటి అత్యంత శ్రేష్ఠమైన వస్తువు ప్రసాదిస్తాను.'' (తిర్మిజి)

## దేవుని దృష్టిలో విశ్వాసి విలువ-20

ముస్లిం ఐకమత్యానికి మొట్టమొదటి సాధనం ఖుర్ఆనే. అంటే ఖుర్ఆన్ని నిత్యం పఠిస్తూ తదనుగుణంగా ఆచరించడం అన్నమాట. ఆతర్వాత పరస్పర సహకార, సౌభ్రాతృత్వాలు వారి ఐకమత్యాన్ని పటిష్ఠపరుస్తాయి. అందుకే ఇస్లాం ముస్లిం ధనమానప్రాణాలకు ఎంతో విలువనిస్తుంది.

దైవప్రవక్త (స) తమ వీడ్కోలుహజ్ సందర్భంలో ప్రసంగిస్తూ ఇలా అన్నారు: ''ప్రజలారా! మీరు పరస్పరం మీ ధనప్రాణాలను, మానమర్యాదలను నష్టపరచుకోవడం శాశ్వతంగా నిషేధించబడింది. ఈ (హజ్) దినాన్ని ఈ (జిల్‌హజ్జ)శుభమాసాన్ని, ఈ (మక్కా)నగరాన్ని మనం ఎలా గౌరవిస్తున్నామో వాటిని కూడా అలా గౌరవించాలి......'' (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉసామా బిన్ షరీక్ (రజి) కథనం:''నేను దైవప్రవక్త (స)తో కలసి హజ్‌చేయడానికి బయలుదేరాను. అప్పుడు ప్రజలు (హజ్‌ఆచారాలు తెలుసుకోవడానికి) ఆయన సన్నిధికి వస్తుంటారు. వారు వచ్చి 'దైవప్రవక్తా! కాబాప్రదక్షిణ చేయకముందు నేను 'సయీ' లేదా (మొదట చేయవల్సిన



పని తర్వాత చేశాను. లేదా (తర్వాత చేయవల్సిన పని) మొదట్లో చేశాను' అని అంటాడు. దైవప్రవక్త (స) ప్రతిమనిషికీ 'పర్వాలేదు. (అందులో నష్టమేమీ లేదు). కాని ఎవరైనా దౌర్జన్యంగా ఒక ముస్లిం పరువుప్రతిష్ఠలకు భంగంకలిగిస్తే మాత్రం నష్టమే. కనుక అలాంటి మనిషి నష్టపోయి హతమయ్యాడు (అని తెలుసుకోండి)' అని చెప్పేవారు.'' (అబూదావూద్)

ఒకముస్లిం తోటిముస్లింని దూషించడమంటే దేవుని పట్ల అవిధేయత (ఫిస్ఖ్)కు పాల్పడటమేనని, అతనితో యుద్ధం చేయడమంటే దేవుడ్ని ధిక్కరించడమే (కుఫ్ర్)నని అనేక హదీసుల్లో ఉంది.

''ఒక ముస్లిం తన సాటి ముస్లింసోదరుడ్ని అవిశ్వాసి (కాఫిర్) అని పిలిస్తే వారిద్దరిలో ఒకడు తప్పక అవిశ్వాసి అయిపోతాడు.'' (బుఖారి)

"ఎవరైనా ఒక ముస్లిం తోటిముస్లింని హతమారిస్తే దాని పర్యవసానం నరకమవుతుంది. అతను (హంతకుడు) అందులోనే పడిఉంటాడు. దేవుడు అతడ్ని ఆగ్రహిస్తాడు, శపిస్తాడు." (ఖుర్ఆన్-4:98)

దైవప్రవక్త (స) హితోక్తి: "కేవలం నోటితో ఇస్లాం స్వీకరించిన ప్రజలారా! మీ హృదయాల్లో విశ్వాసం ఇంకా చోటుచేసుకోలేదు. మీరు ముస్లింలను బాధించకండి. వారిని కించపరచకండి. వారి తప్పుల వెంట పడకండి. ఎవరు తమ తోటిముస్లింల తప్పుల వెంటపడతారో దేవుడు వారి తప్పుల వెంటపడతాడు. దేవుడు ఏమనిషి తప్పుల వెంటపడతాడో ఇంట్లో కూర్చున్నాసరే అతడ్ని పరాభవం పాల్జేసిగాని వదలిపెట్టడు.'' (తిర్మిజి)

దైవప్రవక్త(స) హితోక్తి : ''ఒకముస్లిం తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడనడానికి. ఒకముస్లింకు తోటిముస్లిం ధనమానప్రాణాలు నిషిద్ధం. దేవుడు మీ శరీరాల్ని, ముఖాలను చూడడు. ఆయన మీ ఆంతర్యాల్ని, ఆచరణల్ని మాత్రమే చూస్తాడు.'' (బుఖారి)

ఒకసారి సల్మాన్ (రజి), సుహైబ్ (రజి), బిలాల్ (రజి)ల దగ్గరికి అబూ సుఫ్యాన్ వచ్చారు. అక్కడే ఇంకొంతమంది ముస్లింలు కూడా ఉన్నారు.

(అబూసుఫ్యాన్ అప్పటికి ఇంకా ఇస్లాం స్వీకరించలేదు.) అక్కడున్న ముస్లింలు (ఆయన్ని చూసి) "దైవవిరోధిపై దేవుని ఖడ్గంవేటు సరిగ్గా పడలేదు" అన్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) ఈమాట విని "మీరు ఖురైష్ తెగ అగ్రనాయకుడ్ని పట్టుకొని అంతేసి మాటలంటారా?" అన్నారు. తరువాత ఆయన దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి వాళ్ళు అబూసుఫ్యాన్‌కు ఇంతేసి మాటలన్నారని చెప్పారు.

అది విని దైవప్రవక్త (స), "అబూబకర్! మీరు వారి భావాలను గాయ పరచారేమో అనిపిస్తోంది నాకు. ఒకవేళ (మీ మాటల వల్ల) నిజంగానే ఆ ముస్లింల మనసు నొచ్చుకొనివుంటే మీరు మీ ప్రభువును అప్రసన్నుణ్ణి చేశారు!" అని అన్నారు. దైవప్రవక్త (స) మాటలు విని హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే (పశ్చాత్తాపపడుతూ) ఆ (పేద) ముస్లింల వద్దకు వెళ్ళి "సోదరులారా! నేను మిమ్మల్ని కష్టపెట్టానా?" (మీ మనసు నొచ్చు కుందా?)" అనిఅడిగారు. దానికి వారు, "లేదు సోదరా! దేవుడు మిమ్మల్ని క్షమిస్తాడు (జరిగిన దానికి బాధపడకండి)" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "మంచి నీతినడవడికలు గల ముస్లిం వల్ల (వ్యభిచారం, దొంగతనం మొదలైన) శిక్షార్హమైన నేరాలు తప్ప ఏదైనా పొరపాటు జరిగితే అతడ్ని క్షమించండి." (అబూదావూద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "నీవు నీసోదరుని కష్టాల పట్ల సంతోషించకు. అలాచేస్తే దేవుడతడ్ని కనికరించి నిన్ను కష్టాల పాలుచేస్తాడు." (మిష్కాత్)

## సమైక్యతా సోదరభావాలు-21

దైవప్రవక్త (స) ప్రవచించిన ఈ క్రింది హితోక్తులు చూడండి:

"ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుని వంటి వాడు. అతను తోటిముస్లింపై దౌర్జన్యానికి, అన్యాయానికి పాల్పడడు. అతని సహచర్యం వదలడు. అతడ్ని కించపరచడు. తోటిముస్లిం సోదరుడ్ని కించపరచడం వంటి చెడుకు మించిన ఘోరమైన చెడులేదు." (అహ్మద్)



"ఒక ముస్లిం మరో ముస్లింకు అద్దంలాంటివాడు. ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుడు. అతను తన ముస్లింసోదరుడ్ని వినాశం నుండి రక్షిస్తాడు. అతనికి మద్దతునిస్తూ కాపాడుతుంటాడు." (బుఖారీ, ముస్లిం)

"మీరు ముగ్గురు ఉన్నప్పుడు మూడోవాడ్ని వదలి మిగతా ఇద్దరు రహస్యాలు మాట్లాడుకోకండి. ఈవైఖరి వల్ల ఆ మూడోవ్యక్తికి బాధ కలగ వచ్చు. అయితే మీరు మరికొందరితో కలిసివుంటే ఫర్వాలేదు." (బుఖారీ)

"శిరస్సుకు, శరీరానికి ఎలాంటి సంబంధం ఉంటుందో ఒక విశ్వాసి తోటివిశ్వాసులతో అలాంటి సంబంధమే కలిగివుంటాడు. శరీరంలోని ప్రతి అవయవం అనుభవించే బాధను శిరస్సు ఎలా పాలుపంచుకుంటుందో తోటి విశ్వాసులు అనుభవించే బాధను కూడా ఆ విశ్వాసి అలాగే పాలు పంచుకుంటాడు." (అహ్మద్)

"విశ్వాసులారా! మితిమీరిన అనుమానాలకు పోకండి. కొన్ని అను మానాలు (మీకు) పాపాలుగా పరిణమించవచ్చు. (ప్రజల) రహస్య విషయాల వెనుక పడకండి." (ఖుర్ఆన్-49:12)

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఓసారి అర్ధరాత్రివేళ ఒకతను తనఇంట్లో ఏదోపాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే గస్తీ తిరుగుతున్న హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ఇంటి గోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవవిరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టుచేయడని భావించావా?" అని అరిచారు.

"విశ్వాసులనాయకా! తొందరపడకండి. నేను ఒకపాపం చేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీతీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీగోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నాఅనుమతి లేకుండానే నాఇంట్లో ప్రవేశించారు." అన్నాడతను.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కాకపోతే అతనిచేత దుష్కార్యాలు మానేసి నీతిమార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "మీరు చెడ్డ అనుమానాలకు దూరంగా ఉండండి. సమస్త విషయాల్లో పచ్చి అబద్ధం చెడ్డ అనుమానమే. ఇతరుల తప్పుల్ని ఎన్నకండి. కూపీలు తీయకండి. ఇతరుల హక్కుల్ని కబళించే ప్రయత్నంలో ఒండొకరిని మించిపోవటానికి ప్రయత్నించకండి. పరస్పరం అసూయ చెందకండి. ద్వేషించుకోకండి. ఎడమొహం పెడమొహంతో ఉండ కండి. దైవదాసులారా! దేవుడు ఆదేశించినట్లు మీరు పరస్పరం అన్న దమ్ముల్లా ఉండండి. ముస్లిం ముస్లింకు సోదరుడు. తను అతని మీద దౌర్జన్యం చేయరాదు. అతడ్ని నిస్సహాయునిగా వదలిపెట్టరాదు. అతన్ని అల్పునిగా భావించరాదు. తఖ్వా (దైవభీతి) అనేది ఇక్కడుంటుంది. తఖ్వా ఇక్కడుంటుంది." ఈ మాట ఆయన తన ఛాతీ వైపు సైగ చేస్తూ చెప్పారు.

"(ముస్లింలారా!) మీరు లేనిపోని అనుమానాలకు పోకండి. లేనిపోని అనుమానంతో ఏదైనా మాటంటే అది అన్నిటికంటే పెద్ద అబద్ధమవు తుంది. ఇతరుల్ని గురించి కూపీ లాగుతో తిరగకండి. వారి తప్పులు బయట పెట్టేందుకు కాచుకొని ఉండకండి. పరస్పరం పోట్లాడుకోకండి. ఒకర్నొకరు ద్వేషించుకోకండి. ఒకరి మాటను మరొకరు ఖండించుకోకండి. పరస్పరం అన్నదమ్ముల్లా మనుగడ సాగించండి." (బుఖారి, ముస్లిం)

"మీలో ఎవరూ ఇతరుల్ని పరోక్షంగా నిందించకూడదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా? (ఇష్టపడరు.) చూశారా, మీరే దాన్ని అసహ్యించుకుంటారు. దేవునికి భయపడండి. దేవుడు ఎంతో క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్-49:12)

దైవప్రవక్త(స) "పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైనపాపం" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైనపాపం ఎలా అవుతుంది?"అనడిగారు. దానికి ఆయన జవాబిస్తూ



"మనిషి వ్యభిచారం చేసిన తర్వాత పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు. కాని పరోక్షనిందకు పాల్పడినవాడ్ని నిందితుడు క్షమించనంతవరకు దేవుడు అతడ్ని క్షమించడు" అనిఅన్నారు (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "పరోక్షనిందకు ఒక ప్రాయశ్చిత్తం- నీవు ఎవరి పై నిందమోపావో అతనికి దేవుడు క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకోవాలి. అతను 'దేవా! నాకు, అతనికి క్షమాభిక్ష పెట్టు' అని ప్రార్థించాలి." (మిష్కాత్)

ఎంతో అవసరమైనప్పుడు, పరోక్షనిందకు పోకుండా పని నెరవేరని పరిస్థితి ఏర్పడినప్పుడే పరోక్షనింద ధర్మసమ్మతం అవుతుంది.

ఉదా:- పీడితుడు దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా తననా దౌర్జన్యం నుండి కాపాడగల వ్యక్తి ముందు నిందారోపణ చేయవచ్చు. సంస్కరణాభి లాషతో ఒకవ్యక్తి లేక ఒక వర్గంలోని చెడుల్ని గురించి వాటిని దూరంచేయ గలవారికి చెప్పవచ్చు. దుర్మార్గుడి దుర్మార్గపు పనుల్ని గురించి ప్రజల్ని హెచ్చరించవచ్చు. సాక్షుల లోపాలను ఎత్తిచూపవచ్చు. పెళ్ళాడదలచిన వారికి సంబంధిత వరుడు లేక వధువులోని లోపాల్ని తెలియజేయవచ్చు.

దైవప్రవక్త (స) ప్రవచనం : ప్రళయదినాన దేవుడు, "నా ఔన్నత్యం ప్రాతి పదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య) ఛాయ తప్ప మరేఛాయా లభించని ఈరోజు నేను వారికి నా నీడపట్టున ఆశ్రయం కల్పిస్తాను" అని అంటాడు. (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఒక ముస్లిం తోటిముస్లింకు సోదరుడు (లాంటివాడు). ఒక సోదరుడు తన సోదరునిపై దౌర్జన్యం చేయడు; అతడ్ని దౌర్జన్యపరునికి అప్పగించడు. ఎవరు తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో నిమగ్నుడైవుంటాడో, దేవుడు అతని అవసరాలు తీర్చేబాధ్యత తీసుకుంటాడు. ఎవరు (తోటి)ముస్లింకు వచ్చిన కష్టాల్లో ఒక కష్టం దూరం చేస్తాడో ప్రళయదినాన దేవుడు అతని కష్టాలలో ఒక కష్టం దూరంచేస్తాడు. మరెవరు (తోటి)ముస్లిం పొరపాట్లను కప్పిపుచ్చుతాడో, ప్రళయదినాన

దేవుడు అతని పొరపాట్లు కప్పిపుచ్చుతాడు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒకరి మీద ఒకరు అసూయ చెందకండి. పగ పెంచుకోండి. కూపీలు తీయకండి. ఇతరుల తప్పులు ఎత్తిచూపకండి. ఇతరుల్ని మోసగించే ఉద్దేశ్యంతో బేరం మీద బేరం చేయకండి. దైవ దాసులారా! పరస్పరం అన్నదమ్ముల్లా జీవించండి. (బుఖారి, ముస్లిం)

అబూరుఖయ్యా తమీమ్ (రజి) కథనం: దైవప్రవక్త (స) "ధర్మంఅంటే మంచిని అభిలషించటం" అన్నారు. మేము "ఎవరి మంచిని అభిలషిం చాలి?" అని అడిగాం. దానికి దైవప్రవక్త (స) "దేవుడు, ఆయన గ్రంథం, ఆయన ప్రవక్త, ముస్లింనేతలు, సామాన్య ముస్లింలందరి విషయంలోనూ మంచిని అభిలషించటమే ధర్మం" అని చెప్పారు. (ముస్లిం)

## ఐకమత్యం, అంతఃకలహాలు-22

"మీరంతా కలసి దైవత్రాటిని (దైవధర్మాన్ని) దృఢంగా పట్టుకోండి. విభేదా లలో పడి చీలిపోకండి. దేవుడు చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసుకోండి. మీరు పరస్పరం శత్రువులుగా ఉన్నప్పుడు దేవుడు మీ హృదయాలను కలిపాడు. ఆయన అనుగ్రహం వల్లనే మీరు అన్నదమ్ములై పోయారు. మీరు అగ్నిగుండం అంచుకు చేరినప్పుడు ఆయన మిమ్మల్ని కాపాడాడు." (ఖుర్ఆన్-3:103)

'దేవుని అనుగ్రహం వల్లనే మీరు పరస్పరం అన్నదమ్ములై పోయారు' అనే ఈ ఖుర్ఆన్ సూక్తి మదీనాలో ముహాజిర్ ముస్లింలు, అన్సార్ ముస్లిం ల మధ్య జరిగిన సోదరీకరణ సంఘటనను గుర్తుచేస్తోంది. మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తగా నియమించబడక పూర్వం అరబ్బులు ప్రతి చిన్న విషయానికీ కత్తులు దూసుకొని రక్తపుటేరులు ప్రవహింపజేసేవారు.

"దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులైఉండండి. పరస్పరం కలహించు కోకండి. అలాచేస్తే మీలో ధైర్యం సన్నగిల్లి మీశక్తి నిర్వీర్యమయి పోతుంది. సహనం, సంయమనాలతో వ్యవహరించండి. సహనం వహించే వారికి దేవుడు తప్పకుండా తోడుగా ఉంటాడు." (ఖుర్ఆన్-8:46)



ముస్లింలు ఇస్లాంసేవలో, దాని సంస్థాపనాకృషిలో నిరంతరం నిమగ్న లయిఉండాలి. అదే వారి జీవనధ్యేయం. ఈధ్యేయాన్ని విస్మరించి ధర్మం లో అంతగా ప్రాముఖ్యంలేని విషయాలపై వాదించుకోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి తిరిగి విభేదాలు పొడసూపుతాయి. దైవప్రవక్త (స) ముస్లింల పరస్పర సమైక్యత, సోదరభావాలను గురించి చేసిన ఈ క్రింది ఉపదేశాలు ఎంతో ఆలోచించదగినవి:

"ముస్లింలు ఒకరితోనొకరు కలిసి పటిష్ఠమైన కట్టడంలా రూపొందు తారు. అందులో ఒకభాగం మరొక భాగానికి బలం చేకూర్చుతుంది." (బుఖారి)

"ఒక కట్టడంలోని ఇటుకలు ఒకదానికొకటి ఊతమిస్తూ ఆ కట్టడం పటిష్ఠతకు కారణమైనట్లే విశ్వాసులు (ముస్లింలు) కూడా (ఒకరి కొకరు సహకరించుకుంటూ సమాజ సమైక్యతకు దోహదపడతారు)." దైవప్రవక్త (స) ఈ విషయం చెబుతూ తమ చేతుల వ్రేళ్ళను ఒక దానిలో మరొకటి జొప్పించి చూపించారు. (బుఖారి, ముస్లిం)

"నీవు నీ ముస్లిం సోదరుడ్ని కలుసుకుంటే అతనికి సలాం చెయ్యి. అతను విందుకు ఆహ్వానిస్తే ఆ ఆహ్వానాన్ని స్వీకరించు. అతను నీ ద్వారా ఏదైనా సహాయం కోరితే అతనికి సహాయం చెయ్యి. అతను తుమ్మి 'అల్‌హమ్దులిల్లాహ్' (సకల ప్రశంసలకు దేవుడే అర్హుడు) అనంటే, నీవు 'యర్‌రహ్మకుల్లాహ్' (దేవుడు నిన్ను కరుణించుగాక) అని బదులుపలుకు. అతడు వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు. చనిపోతే అతని జనాజా (శవాని)కి తోడుగా వెళ్ళు." (ముస్లిం)

"తన కోసం ఇష్టపడిన దాన్నే తన (ముస్లిం) సోదరుని కోసం కూడా ఇష్టపడనంతవరకూ ఏవ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు." (బుఖారి, ముస్లిం)

"ఏ మనిషికీ తన (ముస్లిం) సోదరునితో మూడు రోజుల కన్నా మించి మాట్లాడకుండా ఉండటం, దారిలో పరస్పరం తారసపడినప్పుడు ఇద్దరు ఎడముఖం పెడముఖంగా ఉండిపోవడం ఏమాత్రం ధర్మసమ్మతంకాదు. వారిద్దరిలో సలాం చేయడంలో ముందంజవేసేవాడే మంచివాడు." (ముస్లిం)

"ఏ ముస్లిమైనా తోటి సోదరునిపై కోపంతో మూడు రోజులకు మించి అతనితో మాట్లాడకుండా ఉండరాదు. మూడురోజులకు మించి మాట్లాడ కుండా ఉన్నస్థితిలో చనిపోతే అతను నరకానికి పోతాడు." (అబూదావూద్)

" ఏ ముస్లిమైనా తన సోదరముస్లింతో ఒక ఏడాది పాటు తెగత్రెంపులు చేసుకొనివుంటే తను అతడ్ని ఖూనీ చేసినట్లే లెక్క. (అబూదావూద్)

"ఒక విశ్వాసి తోటివిశ్వాసితో మూడురోజులకు మించి సంబంధం లేకుండా ఉండ రాదు. ఒకవేళ అదే స్థితిలో మూడురోజులు గడిచిపోతే ఆ తర్వాత అతడ్ని కలుసుకొని అతనికి సలాం చేయాలి. అతనా సలాంకు ప్రతిసలాం చేస్తే ఇద్దరికీ పుణ్యం లభిస్తుంది. ఒకవేళ అతను ప్రతిసలాం చేయకపోతే అతను పాపాత్ముడవుతాడు. సలాం చేసినవాడు మాత్రం తెగత్రెంపుల పాపం నుండి బయటపడతాడు." (అబూదావూద్)

దైవప్రవక్త (స) తన వీడ్కోలుహజ్ సందర్భంలో ముస్లింలకు హితోప దేశంచేస్తూ ఇలా అన్నారు: "జాగ్రత్త! మీరు ముస్లిములై ఉండి కూడా నా తదనంతరం మెడలు నరుక్కునే అవిశ్వాసులుగా మారకండి." (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "సోమ, గురు వారాల్లో స్వర్గద్వారాలు తెరువబడతాయి. ఆరోజు అల్లాహ్ దైవత్వంలో ఇతరులకు సాటికల్పించని ప్రతిఒక్కరి పాపాలు మన్నించబడతాయి. కాని తనకూ తన (ముస్లిం) సోదరునికి మధ్య శత్రుత్వం ఉన్నవాడి పాపాలు మన్నించబడవు. వారిని గురించి "వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునే వరకు గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునే వరకు గడువు ఇవ్వండి" అని అనటం జరుగుతుంది. (ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మాతో "మీ సోదరుడు దౌర్జన్యపరుడైనా, పీడితుడైనా అతనికి సహాయం చేయండి" అన్నారు. ఒకతను ఈమాట విని "దైవ ప్రవక్తా! పీడితునికి మాత్రం నేను సహాయం చేస్తాను. కాని దౌర్జన్యపరుడికి నేనెలా సహాయం చేయాలి?" అనడిగాడు.



దానికి దైవప్రవక్త (స) "అతడ్ని దౌర్జన్యం నుండి నిరోధించు. ఇదే అతనికి నీవు చేసే సహాయం" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఓసారి తన అనుచరులతో మాట్లాడుతూ "దైవదాసు లలో కొందరు ప్రవక్తలు, అమరగతులు కానప్పటికీ దేవుడు వారికి ప్రసాదించిన హోదాఅంతస్తులు చూసి దైవప్రవక్తలు, అమరగతులు కూడా (పరమ సంతోషంతో) అసూయపడతారు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! వారు ఎవరై ఉంటారు?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "వారు పరస్పరం బంధువులు కానప్పటికీ, ధనం ఇచ్చిపుచ్చుకోవడాలు చేయనప్పటికీ కేవలం దైవధర్మం ప్రాతిపదికపై ఒకర్నొకరు ప్రేమించుకునేవారు. వారి ముఖాలు దేదీప్య మానంగా వెలిగిపోతుంటాయి. వారి నలువైపులా జ్యోతిర్మయంగా ఉంటుంది. (ప్రళయదినాన) ప్రజలు భయాందోళనలకు గురయి ఉన్నప్పుడు వారు నిర్భయంగా ఉంటారు. ప్రజలు విచార సముద్రంలో మునిగి ఉన్నప్పుడు వారికి ఎలాంటి విచారం ఉండదు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "అరబ్ ద్వీపంలోని నమాజీలు ఇక తనను ఆరాధించరని షైతాన్ నిరాశచెందాడు. అయితే వారిమధ్య గొడవలు సృష్టించటంలో మాత్రం అతను (విజయం సాధిస్తాడు)." (ముస్లిం)

ఈ గొడవలు అరేబియా ముస్లింలవరకే పరిమితమై ఉండలేదు. ఇవి ఈనాడు యావత్ప్రంచ ముస్లింలకు విస్తరించాయి. ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని విషయాల్లో రేకెత్తిన ఈగొడవలు విభేదాలతో ప్రారంభమై విరోధస్థాయికి చేరుకున్నాయి. వీటి ద్వారా ఇస్లాంవ్యతిరేక శక్తులు ఎంత ప్రయోజనం పొందుతున్నాయో, తమ ఐకమత్యం నానాటికి ఎలా క్షీణించి పోతోందో ముస్లింలు గ్రహించకపోవడం ఎంతో విచారకరం.

"సత్యతిరస్కారులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండికూడా) పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది." (ఖుర్ఆన్-8:73)

ఒక పార్టీకి లేదా సంస్థకు బయటివారి కన్నా అంతర్గత కలహాలే చాలా ప్రమాదకరమైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ఆ పార్టీ లేదా సంస్థ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ కార్యకర్తలకు తమ పార్టీనిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యం పట్ల అమిత శ్రద్ధాసక్తులు ఉండటంతో పాటు, కార్యకర్తల్లో పరస్పరం ప్రేమాభిమానాలు, స్నేహసోదరభావాలు కూడా ఉండటం ఎంతో అవసరం.

దేవుణ్ణి, ఆయన అంతిమప్రవక్త (స)ను విశ్వసించినవారి పార్టీ 'ఇస్లాం.' వారి పార్టీ నిబంధనావళి 'ఖుర్‌ఆన్.' దాని కార్యాచరణ విధానం 'హదీస్.' పార్టీలక్ష్యం 'ధర్మసంస్థాపనం.' దాని ప్రేరకాలు దైవప్రసన్నత, పరలోక సాఫల్యాలే. ఈ ఉన్నతలక్ష్యం కోసం పనిచేసేవారి భావాలు కూడా ఎంతో ఉన్నతంగా ఉండాలని, పార్టీ(ధర్మం)లో అంతగా ప్రాముఖ్యంలేని విష యాలపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాలదృక్పథం అలవరచుకో వాలని ఇస్లాం బోధిస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణ విధానాన్ని, దాని ఆశయాల్ని ఎంత గట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.

పార్టీ నిబంధనావళిలో, దాని కార్యాచరణ విధానంలో విషయాలన్నీ స్పష్టంగా ఉన్నాయి. కనుక కార్యకర్తలు పరస్పరం కలహించుకొని, ముఠా లుగా చీలిపోయి తన్నుకుచచ్చే అగత్యంలేదు. ఒకవేళ స్వార్థం, సంకుచిత భావాలతో ఎవరైనా అలాచేస్తే వారికి కఠినశిక్ష పడుతుందని పార్టీ నిబంధ నావళి (ఖుర్‌ఆన్)లోని ఒక అధికరణ (3:105) కార్యకర్తల్ని హెచ్చరిస్తోంది.

అయితే ఈనాటి కార్యకర్తలు (ముస్లింలు) పార్టీ మౌలికసూత్రాలకు దూరమై, విభిన్న వర్గాలుగా, ముఠాలుగా చీలిపోయి ఒకర్నొకరు నరుక్కునే దుస్థితికి దిగజారిపోయారు. తోటి కార్యకర్తలను గౌరవించడం అలాఉంచి, వారిపై బురదచల్లడానికి, వారిని అన్నివిధాలా అణగద్రొక్కి తమ ఆధిక్యత చాటుకోవడానికి సైతం ప్రయత్నిస్తున్నారు. దీనిక్కారణం వారికి పార్టీ



నిబంధనావళిపై, దాని కార్యాచరణవిధానంపై గట్టినమ్మకం, పూర్తి అవగా హన లేకపోవడమే. లేదా ప్రాపంచిక వ్యామోహం ఆవహించడం కావచ్చు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనం : "నేనొక రోజు ఒకతను ఖుర్‌ఆన్ పఠిస్తున్న తీరును గమనించాను. దైవప్రవక్త (సల్లం) ఇలాంటి తీరుతో పఠించడం నేనిదివరకు ఎన్నడూ వినలేదు. అంచేత నేనా వ్యక్తిని దైవప్రవక్త (స) దగ్గరకు పిలుచుకెళ్ళి విషయం చెప్పాను. కాని ఈమాట విని దైవప్రవక్తకు కోపం వచ్చినట్లు అన్పించింది నాకు. ఆయన మా ఇద్దర్ని ఉద్దేశించి "మీరిద్దరూ బాగానే పఠిస్తున్నారు. పరస్పరం విభేదించుకోకండి. (ఇలాంటి)విభేదాల వల్లనే మీకుపూర్వం గతజాతులు నాశనమయ్యాయి" అని అన్నారు." (బుఖారి)

## ఫిఖా విభేదాలు-23

ఖుర్‌ఆన్-హదీసుల క్రియాత్మకఅన్వయింపు (Application) విషయ మయి ధర్మంలో భేదాభిప్రాయం సహజమే. ప్రజలలో బుద్ధి, వివేకం, అవగాహనా తీరులు విభిన్నంగా ఉంటాయి ప్రతివ్యక్తీ వాటి ప్రకారమే మాట్లాడుతాడు. అంచేత వివిధ అభిప్రాయాలు, వాటికి సంబంధించిన ప్రమాణాలన్నీ సలహా సంప్రదింపుల వేదికపైకి తీసుకొస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించడానికి, ఎవరి అభిప్రాయం, ప్రమాణాలు బలమైనవో తెలుసు కోవడానికి అవకాశం లభిస్తుంది. అప్పుడు వాటిలో అన్నిటికంటే సముచిత మైన, సహేతుకమైన విషయాన్ని అవలంబించవచ్చు.

ఒక వ్యక్తి తన అభిప్రాయానికి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో మాత్రమే బలమైన ఆధారాలు చూపగలిగినప్పుడు, ఆ అభిప్రాయాన్ని కేవలం దేవుని ప్రసన్నత కోసం, సమాజ సంక్షేమం కోసం మాత్రమే అలా వెలిబుచ్చినప్పుడు అతను ధర్మంలోని సమిష్టి విషయాలలో ఇతరుల పట్ల సమైక్యతా సహకారాల భావంతో మసలుకుంటాడు. అంతేకాదు, తాను విభేదించిన అత్యల్ప విషయాలకు మౌలిక విషయాల స్థాయినిచ్చి తాను తప్ప ఇతరులంతా దారి తప్పారని భావించడు. షరీఅత్‌లోని అత్యల్ప

విషయాల స్థాపనను ధర్మసంస్థాపనగా తలచి ఆ లక్ష్యసాధన కోసం మిల్లత్‌లో వర్గసృష్టికి కారకుడు కాజాలడు.

అభిప్రాయభేదాన్ని సృజనాత్మక సలహా అని భావించకుండా మనిషి తన మాటే నెగ్గాలన్న పంతానికిపోతే విషయం అనుకూల వైఖరికి బదులు ప్రతికూలవైఖరి సంతరించుకొని చివరికి జగడాలకు దారితీస్తుంది. ధర్మ దృక్పథంలో తలెత్తే అవగాహనావిభేదాలు వర్గసృష్టికి కారణమవుతాయి.

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: రెండు విషయాల్లో ఒకదాన్ని అవలంబించే స్వేచ్ఛ ఇవ్వబడినప్పుడు దైవప్రవక్త (స) ఆ రెండిటిలో సులభమైన విషయాన్నే ఎంచుకునేవారు. అయితే ఆ విషయం పాప కార్యమై ఉండకూడదు. ఒకవేళ అది పాపకార్యమైతే అందరికంటే ఆయనే దానికి దూరంగా ఉంటారు. దైవప్రవక్త (స) ఏనాడూ తన స్వవిషయంలో ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోలేదు. కాని దైవాజ్ఞల పట్ల అపచారం జరిగితే మాత్రం ఆయన తప్పకుండా ప్రతీకారం తీర్చుకునేవారు. (బుఖారి)

ధర్మావగాహనలో పూర్వీకుల మధ్యకూడా అభిప్రాయభేదాలు కలిగేవి. వారు తమ విద్యాయోగ్యత, ధార్మికఅవగాహన, అనుభవాల ఆధారంగా తమ అభిప్రాయాలు ప్రకటించేవారు. అయితే వారెంతో రుజువర్తనులు. వారు తమ భావాలతో ఏకీభవించనివారి పట్ల ద్వేషం ఉంచుకునేవారు కాదు. పైగా వారు తమ ప్రత్యర్థి భావాల్ని గౌరవించేవారు. ఇజ్తెహాద్ (అనువర్తన)కు సంబంధించిన వ్యవహారాల్లో వారు ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవిస్తూ పరస్పరం సద్భావం కలిగివుండేవారు.

అంతేకాదు, ఒక్కోసారి వారు యుక్తి, అవసరాల దృష్ట్యా తమ భావాలకు, అభిప్రాయాలకు వ్యతిరేకంగా కూడా తీర్పులు (ఫత్వాలు) ఇచ్చేవారు. అలా ఇవ్వడం తప్పని భావించేవారు కాదు. ఆ సమయంలో వారు ప్రత్యర్థిఅభిప్రాయాన్ని "ఇది ఎక్కువ సరైన దృక్పథం"---"ఇది హృదయాన్ని ఆకట్టుకుంటోంది"---"ఇది ఎక్కువ సమంజసమైన అభిప్రాయం" అని ప్రశంసించేవారు. ఖుర్‌ఆన్, హదీసుల స్వభావానికి అనుగుణంగా ఉండే,



స్పష్టమైన ఆదేశాల నుండి గ్రహించిన ఏ అభిప్రాయాన్నయినా వారు సంతోషంగా అంగీకరించేవారు.

సహాబీలలో, తాబయీలలో, ఆ తర్వాతి వారిలోనూ ఎన్నో విభేదాలు ఉండేవి. కొందరు నమాజ్‌లో 'ఆమీన్'ని బిగ్గరగా పలికితే, మరికొందరు మౌనంగా పలుకుతారు. ఖుర్‌ఆన్ పఠనానికి ముందు కొందరు బిస్మిల్లా పఠిస్తే, మరికొందరు ఏమీ పఠించరు. కొందరు 'రఫయదీన్' చేస్తే, మరికొందరు చేయరు. కొందరు ఫజ్ర్ నమాజ్‌లో 'ఖునూత్ దుఆ' పఠిస్తే, మరికొందరు పఠించేవారు కాదు. వాంతి అయిన తర్వాత లేక ముక్కు దూలం పగిలి రక్తం కారిన తర్వాత నమాజ్ చేయడానికి  కొందరు కొత్తగా 'ఉజూ' అవసరమని భావిస్తారు. మరికొందరు అవసరం లేదని తలచేవారు.

ఇన్ని విభేదాలున్నా వారు ఒకరి వెనుక ఒకరు నమాజ్ చేయడాన్ని చీదరించుకునేవారు కాదు. ఉదా: మదీనాప్రజలు మాలికీ ఫిఖా ననుసరించి నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠనానికి ముందు మనసులోగాని, పైకిగాని 'బిస్మిల్లా' పఠించరు. కాని ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫయి అనుయాయులు మదీనాలో మాలికీ దృక్పథం ఇమాముల నేతృత్వంలో ఎలాంటి సంకోచంలేకుండా నమాజ్ చేసేవారు. అలాగే జోరీగ కాటుకు చికిత్స చేయించుకున్న తర్వాత రోగి చేసిన పూర్వపు ఉజూ భంగమవుతుందని ఇమామ్ అబూయూసుఫ్ అభిప్రాయం. కాగా ఆయన అలాంటి చికిత్స చేయించుకున్న హారూన్‌రషీద్ నాయకత్వంలో నమాజ్ చేశారు.

శరీరం నుండి రక్తం కారితే కొత్తగా ఉజూ చేసి నమాజ్ చేయాలన్న విషయాన్ని ఇమామ్ అహ్మద్ ఒప్పుకుంటారు. కాని ఆయన ఈ అభిప్రాయంతో ఏకీభవించని ఇమామ్ మాలిక్, ఇమామ్ ముసయ్యిబ్‌ల నేతృత్వంలో నిస్సంకోచంగా నమాజ్ చేశారు. ఇమామ్ షాఫై ఫజ్ర్ నమాజ్‌లో ఖునూత్‌దుఆ పఠించడం తప్పనిసరి అని భావించేవారు. అయితే ఓరోజు ఆయన ఇమామ్ అబూహనీఫా మస్జిద్‌లో ఫజ్ర్ నమాజ్ చేయవలసి వచ్చినప్పుడు ఖునూత్‌దుఆ పఠించలేదు. అప్పుడొకతను "మీ దృక్పథం

(మస్లక్)ని ఎందుకు వదిలేశార''ని అడిగితే "నేను ఆయన పరిశోధనను ఎలా రద్దు చేయగలను, అయినా మనం ఇరాఖ్‌ప్రజల పద్ధతి పాటిస్తే వచ్చే నష్టమేమిటీ?'' అని ఇమామ్ షాఫయి ఎదురుప్రశ్న వేశారు.

ఒకసారి ఖలీఫా మన్సూర్‌కు ఒక ఆలోచన తట్టింది. ఇమామ్ మాలిక్ రాసిన ముపత్తా గ్రంథానికి అనేక నకళ్ళు తీయించి వివిధ పట్టణాల్లోని ఖాజీలకు పంపి దాన్ని అమలు పరచుదామని భావించాడు. అయితే ఈ సంగతి ఇమామ్ మాలిక్‌కు తెలిసి మన్సూర్‌ని ఆపని చేయడాన్ని వారిస్తూ 'ప్రజల్ని తాము ఎంచుకున్న దృక్పథం (మస్లక్) ప్రకారం నడచుకోవడానికి స్వేచ్ఛగా వదిలేయండి' అని చెప్పారు.

ఇవి భేదాభిప్రాయాలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీటిని బట్టి మన పూర్వీకులు, పెద్దలు ఫిఖా వ్యవహారాల్లో, అత్యల్ప విషయాల్లో ఏర్పడిన విభేదాల విషయమై ఎంతటి విశాలదృష్టి కలవారో అర్థం చేసుకోవచ్చు. వారు ఇస్లాం స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న అత్యున్నత విద్యాధికులైన ధర్మవేత్తలు, తత్వవేత్తలు అయి నప్పటికీ ప్రజలు తమ దృక్పథాన్నే అనుసరించాలన్న ఉద్దేశ్యంతో వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

ప్రాముఖ్యంలేని విషయాల్లో పెద్ద రాద్ధాంతం లేవదీస్తూ పోట్లాడుకునే నేటి ముస్లింలకు ఇందులో ఎంతైనా గుణపాఠం ఉంది. ఇస్లాంవ్యతిరేక శక్తులు వ్యాపింపజేసిన, చేస్తున్న అపార్థాల వల్ల నేడు ఇస్లాం మౌలిక విషయాలకే పెద్ద ప్రమాదం వచ్చి పడింది. ఇలాంటి పరిస్థితిలో ముస్లిం మేధావులు, నాయకులు ఇస్లాం మౌలికవిషయాలను, దాని సమగ్రస్వరూ పాన్ని ప్రజలకు పరిచయంచేస్తూ ధర్మసంస్థాపనకోసం కృషి చేయవలసింది పోయి ప్రతిచిన్న విషయంలోనూ విభేదించుకొని పోట్లాడుకోవడం, మసీదులు వేరుచేసుకోవడం, వేర్వేరువర్గాలుగా విడిపోయి ఆ విషయాలనే ప్రచారం చేసుకుంటూ దాన్ని మించిన గొప్పధర్మకార్యం లేదని భావిం చడం ఎంతో శోచనీయం!



"గుమ్మడికాయ పోయే దారి ఎరగడు కాని, ఆవగింజ పోయే దారిని అట్టే పట్టిచూస్తాడు'' అన్న సామెతను స్ఫురణకు తెచ్చే ఈ పరిస్థితి మారి పోవాలి. ముస్లింలు ప్రాముఖ్యంలేని ఫిఖా విభేదాలను పక్కనబెట్టి మౌలిక విషయాలపై సమైక్యమవ్వాలి. మనిషిని ఆర్థికజంతువుగా మార్చే భౌతిక వాద జీవనదృక్పథాలను, నాస్తికభావాలను ఎదుర్కొంటూ, ఇస్లాంకు నిజమైన ప్రతినిధులుగా తమ వాక్కాచరణల ద్వారా తోటి ప్రజలకు దాని నిజరూపాన్ని పరిచయం చేయవలసిన అవసరం గుర్తించాలి.

## విభేదాలతో విడిపోతే వినాశం తప్పదు-24

మన దేశంలో హనఫీయుల తరువాత అహ్లెహదీస్ ప్రజలే ఎక్కువ మంది ఉన్నారు. కాబట్టి ఈ ఉభయవర్గాల ధర్మావగాహనా దృక్పథాలను గురించి ఇక్కడ కొన్ని విషయాలు తెలుసుకుందాం.

**రఫేయద్దైన్** : ఈ విషయంలో హనఫీదృక్పథం అహ్లెహదీస్ దృక్పథా నికి భిన్నంగా ఉంది. హనఫీయులు నమాజ్‌లో తక్బీర్ చెప్పేటప్పుడు చేతులు చెవుల వరకు ఎత్తుతారు. అహ్లెహదీస్ వారు భుజాల వరకే ఎత్తుతారు. వీరి దృక్పథాన్ని సమర్థిస్తున్న ఈ క్రింది హదీసు చూడండి.

"దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేయదలచుకున్నప్పుడు రెండు చేతులు భుజాలదాకా పైకెత్తేవారు. చేతులు పైకెత్తుతూ అల్లాహుఅక్బర్ అని పలికేవారు.'' (అబూదావూద్)

హనఫీలు పరదానియమాల్ని దృష్టిలో పెట్టుకొని ఈ హదీసును స్త్రీలకు మాత్రమే వర్తింపజేశారు. స్త్రీలు పురుషుల్లా చేతులు చెవులదాకా పైకెత్తితే వారి 'సతర్' అవయవాల ఆకృతి బహిర్గతమయ్యే అవకాశం ఉన్నందున వారు నమాజ్‌లో చేతులు భుజాలవరకే పైకెత్తాలని వారు అన్నారు.

దైవప్రవక్త (సల్లం) చెవుల దాకా చేతులెత్తినట్లు కూడా ఉల్లేఖనాలు ఉన్నాయి. అబూదావూద్, నసాయి, హాకిమ్, అహ్మద్, తబ్రానీ, దారెఖుత్నీ, తహావీ, ముస్లిం గ్రంథాలలో ఈ ఉల్లేఖనం ఉంది.

హజ్రత్ వాయిల్ బిన్ హుజర్ (రజి) కథనం: "మేము మదీనా వచ్చినప్పుడు మదీనా ప్రజలు చేతులు చెవులదాకా ఎత్తడం చూశాము. నేను ఆ తరువాత సంవత్సరం మదీనా వచ్చి చూస్తే మదీనా ప్రజలు ఉన్నిటోపీలు, పొడుగుచొక్కాలు ధరించి తీవ్రమైన చలి కారణంగా చేతులు భుజాల వరకే ఎత్తడం గమనించాను."

'రఫేయదైన్' గురించి ఇమామ్ ఔజాయి (రహ్మ), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ)ల మధ్య ఓ సంభాషణ జరిగింది. అందులో ఇమామ్ ఔజాయి (రహ్మ) హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: "దైవప్రవక్త (స) రుకూలోకి పోయేటప్పుడు, రుకూ నుండి లేచేటప్పుడు కూడా చేతులు పైకెత్తేవారు." ఇమామ్ అబూహనీఫా (రహ్మ) హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనంతో ఇలా తెలిపారు: "దైవప్రవక్త (స) తక్బీరెతహ్రీమా (మొదటి తక్బీర్) చెప్పేటప్పుడు మాత్రమే చేతులు పైకెత్తేవారు. ఆ తరువాత చేతులు పైకెత్తేవారు కాదు."

దైవప్రవక్త(స) హితోక్తి: "ఏడు సందర్భాలలో తప్ప మరెప్పుడూ చేతులు పైకెత్తకూడదు. (1) తక్బీరెతహ్రీమా (నమాజ్‌లోని మొదటి తక్బీర్) చెప్పేటప్పుడు, (2) దుఆయే ఖునూత్‌కు సంబంధించిన తక్బీర్ చెప్పేటప్పుడు, (3) ఈద్‌నమాజ్ తక్బీర్‌లు చెప్పేటప్పుడు, (4) అరఫాత్ తక్బీర్ చెప్పేటప్పుడు, (5) జమ్రాల తక్బీర్ చెప్పేటప్పుడు, (6) సఫా-మర్వాల తక్బీర్ చెప్పేటప్పుడు, (7) ఇస్తిలాంతక్బీర్ చెప్పేటప్పుడు." (హదాయ వదరాయ)

**చేతులు కట్టుకునే స్థానం**: నమాజ్‌లో చేతులు రొమ్ముపై కట్టుకునే విషయంలోనే గాకుండా, నాభికింద కట్టుకునే విషయంలో కూడా ఎన్నో హదీసులున్నాయి. ఈ రెండు విభిన్న విషయాలను గురించి హజ్రత్ వాయిల్ ఇబ్నెహుజర్ (రజి) ద్వారానే రెండు ఉల్లేఖనాలు ఉన్నాయి.

ఆయన ఒక ఉల్లేఖనంలో తమ తండ్రిగారు ఈవిధంగా చెప్పారని తెలిపారు: "దైవప్రవక్త (స) తమ కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచి నాభి కింద కట్టుకున్నట్లు నేను చూశాను." (ఇబ్నెఅబీ షైబా).



రెండవ ఉల్లేఖనంలో ఆయనిలా తెలిపారు: "నేను దైవప్రవక్త (స)తో కలసి నమాజ్ చేశాను. అప్పుడాయన తమ కుడిచేతిని ఎడమ చేతిపై ఉంచి రొమ్ముపై కట్టుకున్నారు." (ఇబ్నెమాజ).

హనఫీదృక్పథం పరదానియమాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఉల్లేఖనాన్ని స్త్రీలకు మాత్రమే వర్తింపజేసింది. అహ్లెహదీస్ వారు దీన్ని స్త్రీ పురుషులు ఇరువురికీ వర్తింపజేశారు.

పోతే హనఫీ, షాఫయి, హంబలీ, అహ్లెహదీస్ దృక్పథాలవారికి పూర్తి భిన్నంగా మాలికీదృక్పథంవారు చేతులు కట్టుకోకుండానే నమాజ్ చేస్తారు. వీరు కూడా ప్రపంచంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు.

**స్త్రీల సజ్దా పద్ధతి** : స్త్రీల సజ్దా విషయంలో కూడా అహ్లెహదీస్ దృక్పథానికి, హనఫీదృక్పథానికి తేడా ఉంది. అహ్లెహదీస్ దృక్పథం ప్రకారం స్త్రీలు పురుషుల్లా పిరుదులు ఎత్తిపెట్టి సజ్దాచేస్తారు. హనఫీదృక్పథం ప్రకారం స్త్రీలు పురుషులు చేసే సజ్దాకు భిన్నంగా పిరుదులు కాళ్ళకు ఆనిచ్చి, తొడలు కడుపుతో కలిపి, చేతులు పక్కటెముకలతో కలిపి సజ్దా చేస్తారు. ఈరెండు దృక్పథాలక్కూడా అనుకూలమైన ఉల్లేఖనాలున్నాయి.

దైవప్రవక్త (స) ఇద్దరు స్త్రీలు నమాజ్ చేస్తున్నప్పుడు వారి దగ్గరకు వెళ్ళి "మీరు సజ్దా చేసేటప్పుడు నేలకు అతుక్కుపోవాలి; (అంటే) మీ శరీరాన్ని నేల మీద ఆనిచ్చి పెట్టండి" అని చెప్పారు. (అబూదావూద్)

దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో ఇలా ప్రవచించారు: "స్త్రీ సజ్దా చేస్తున్నప్పుడు పొట్టను తొడలతో కలపాలి." (బైహఖీ)

**ఫాతిహా సూరా సమస్య** : ఇమామ్ వెనుక ఆయన అనుచరులు (ముఖ్తదీలు) ఫాతిహాసూరా పఠించాలన్న విషయంతోపాటు ఫాతిహాసూరా పఠించకుండా మౌనంగా ఉండాలన్న విషయం గురించి కూడా అనేక హదీసులు ఉన్నాయి. ఉదాహరణకు దైవప్రవక్త (స) ప్రవచించిన ఈక్రింది హితోక్తులు చూడండి:

"(నమాజ్‌లో) ఇమామ్ అల్లాహుఅక్బర్ అన్నప్పుడు మీరూ అల్లాహు అక్బర్ అనండి. అయితే ఇమామ్ ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉండండి." (ఇబ్నెమాజ, అబూదావూద్, నసాయి, తహావి)

"ఎవరికి ఇమామ్ ఉంటాడో ఆ ఇమామ్ చేసే పఠనం (ఖిరాత్) వారి పఠనం అవుతుంది." (ఇబ్నెమాజ, దారెఖత్నీ, బైహఖీ)

దైవప్రవక్త (స) హితోక్తి : "ఎవరు ఇమామ్ వెనుక నమాజ్ చేస్తుంటాడో ఇమామ్ (ఖురాన్)పఠనం ఆ ముఖ్తదీ పఠనంగా పరిగణించబడుతుంది." (ముఅత్తా-ఇమామ్ ముహమ్మద్)

అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (స) జుహ్రీ నమాజ్‌లో ముఖం తిప్పి (సలాం చేసి) ముగించిన తర్వాత 'ఖుర్ఆన్ పఠనంలో ఈ ఘర్షణ ఏమిట'న్నారు. అప్పటి నుంచి జుహ్రీనమాజ్‌లో ఇమామ్ వెనుక ప్రజలు ఖుర్ఆన్ పఠించడం మానేశారు." (అబూదావూద్, తిర్మిజి, తహావి)

'హదాయా' గ్రంథకర్త ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించకూడదనే విషయం మీద సహాబీల ఏకగ్రీవ అంగీకారం ఉందని తెలిపారు. అలాగే ఇమామ్ వెనుక ఖుర్ఆన్ పఠించరాదనే విషయాన్ని ఎనభైమంది సహాబీల అభిప్రాయం నిరూపిస్తోందని అల్లామా అయినీ తన గ్రంథంలో వ్రాశారు.

ఈ విషయాన్ని "దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఇమామ్ (ఖుర్ఆన్) పఠిస్తున్నప్పుడు మీరు మౌనంగా ఉండండి." (ముస్లిం)

ఇమామ్ వెనుక ముఖ్తదీలు కూడా ఫాతిహాసూరా తప్పక పఠించాలని చెప్పేవారు ప్రమాణంగా ఈ క్రింది హదీసు పేర్కొంటారు:

"ఫాతిహా సూరా లేనిదే నమాజ్ నెరవేరదు" అన్నారు దైవప్రవక్త (స).

ఈ హదీసు నిజమైన హదీసే. కాని దైవప్రవక్త (స) ఈమాట వ్యక్తిగత నమాజ్ విషయంలో చెప్పారా లేక సామూహిక నమాజ్ విషయంలో చెప్పారా అనేది వివరించలేదు. ఒకవేళ రెండిటికీ ఈమాట వర్తిస్తుందను



కుంటే సామూహికనమాజ్‌లో ఇమామ్ ముఖ్తదీలకు ప్రాతినిధ్యం వహించి వారందరి తరఫున ఫాతిహాసూరా పఠించే బాధ్యత నిర్వహిస్తున్నాడు కదా! ఇక ముఖ్తదీలు ఫాతిహాసూరా పఠించాల్సిన అవసరమేమిటీ? సామూహిక నమాజ్ విషయంలో ఆసక్తికరమైన రెండు హదీసులున్నాయి.

దైవప్రవక్త (స) హితోక్తి: "మీ నమాజులు స్వీకరించబడాలని మీరు కోరుకుంటే మీకు నాయకత్వం మీ ధర్మవేత్తలే వహించాలి. వారు మీకు, మీ ప్రభువుకు మధ్య ప్రతినిధివర్గం (నాయకులు)." (హాకిం, బైహఖీ)

ప్రతినిధివర్గం నాయకుడు మాట్లాడుతున్నప్పుడు అనుచరులు అతనికి వంతపాడకుండా మౌనంగా ఉంటారు.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "(నమాజ్‌లో) ఇమామ్‌ని మీరి పోకండి. ఇమామ్ (అల్లాహు అక్బర్ అని) తక్బీర్ చెబితే మీరూ తక్బీర్ చెప్పండి. అతను 'వలజ్జాల్లీన్' అంటే మీరు 'ఆమీన్' అనండి. ఇమామ్ రుకూ చేస్తే మీరూ రుకూ చేయండి. అతను 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అంటే మీరు 'అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్' అనండి." (బుఖారి, ముస్లిం)

పై హదీసులో దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పఠనం గురించి ప్రస్తావించ లేదు. ఫాతిహా సూరాలోని చివరి పదాన్ని మాత్రమే ప్రస్తావించి అప్పుడు ముఖ్తదీలు 'ఆమీన్' చెప్పాలని అన్నారు. ఒకవేళ సామూహిక నమాజ్‌లో ఇమామ్‌తో పాటు ముఖ్తదీలు కూడా ఫాతిహా సూరా పఠించవలసివుంటే, దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని పైహదీసులో తప్పకుండా ప్రస్తావించి ఉండేవారు. కాని అలా జరగలేదు.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజి) ఉల్లేఖనం: "ఎవరైనా నమాజ్‌లో ఒక రకాత్ పఠించినప్పుడు అందులో ఫాతిహా సూరా పఠించక పోతే అతను నమాజ్ చేయనివాడవుతాడు, ఇమామ్ వెనుక నమాజ్ చేస్తు న్నప్పుడు తప్ప." (ముఅత్తా-ఇమామ్ మాలిక్)

ఫాతిహా సూరా పఠించనిదే నమాజ్ నెరవేరదనే హదీసు సమక్షంలో ఖుర్ఆన్‌లో కూడా ఒక ఆసక్తికరమైన సూక్తి ఈవిధంగా ఉంది:

"మీ ముందు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి, మీరు కరుణించబడతారు." (7:204)

ఈ సూక్తిలోని ఆజ్ఞ సాధారణమైనది. కనుక ఖుర్ఆన్ సూక్తులు నమాజ్‌లో పఠిస్తున్నా, నమాజ్ బయట వేరే సమయాల్లో పఠిస్తున్నా వాటిని వినేవారు మౌనంగా ఉండి, శ్రద్ధగా ఆలకించాలి. అంతేగాని వాటిని నెమ్మదిగానైనా పునరుద్ఘాటించ కూడదని హనఫీ దృక్పథం పేర్కొన్నది.

నా స్నేహితుడొకడు మాట్లాడుతూ "ఫాతిహాసూరా పఠించనిదే నమాజ్ నెరవేరదని హదీసు ఉన్నా హనఫీయులు ఇమామ్ వెనుక ఫాతిహాసూరా పఠించరు" అన్నాడు. నేనీ మాట విని "మీముందు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి శ్రద్ధంగా వినండని ఖుర్ఆన్‌లో ఉందిమరి"అని అన్నాను. దానికి నా స్నేహితుడు తీవ్రంగా స్పందిస్తూ "ఆ...స్పష్టమైన ఒక హదీసు సమక్షంలో ఖుర్ఆన్‌ని తీసుకొస్తావా?" అన్నాడు. నేను చిరునవ్వుతో "హదీసు సమక్షంలో ఖుర్ఆన్ కాకపోతే మరేమిటీ? ఖుర్ఆన్‌లో లభించక పోతేకదా హదీసు దగ్గరకు పోయేదీ?" అని అన్నాను.

**పంక్తుల క్రమబద్ధీకరణ**: నమాజ్‌లో హనఫీదృక్పథంగల ముఖ్తదీలు భుజానికి భుజం కలిపి నిలబడతారు. అహ్లెహదీస్ ముఖ్తదీలు పాదానికి పాదం కలిపి నిలబడతారు. హదీసు వెలుగులో పరిశీలిస్తే ఈ రెండు పద్ధతులు కూడా సరయినవి కావని చెప్పవచ్చు.

హజ్రత్ అనస్(రజి) కథనం: "పంక్తులు సరిచేసుకోండి. నేను మిమ్మల్ని వెనుక వైపునుండి కూడా చూడగలను" అన్నారు దైవప్రవక్త (స). "మాలో ప్రతిఒక్కడూ భుజానికిభుజం, పాదానికిపాదం కలిపేవాడు." (బుఖారి)

రఫేయదైన్ ఒకటికంటే ఎక్కువ సార్లు చేస్తే లేక చేయకపోతే ఆ చర్య శిక్షార్హమైన పాపమని ఏ హదీసులోనూ లేదు. అలాగే నమాజ్‌లో చేతులు



రొమ్ముపై లేక నాభిపై లేక నాభి క్రింద కట్టుకుంటే లేదా అలా కట్టుకోక పోతే లేదా అసలు చేతులు కట్టుకోకుండా వదిలేస్తే అది శిక్షార్హమైన పాపమని కూడా ఏహదీసులో లేదు. అదేవిధంగా ఇమామ్ వెనుక ముఖ్తదీలు ఫాతిహా సూరా పఠిస్తే లేక పఠించకపోతే శిక్షార్హమైన పాపమని కూడా ఏహదీసులో లేదు. అలాంటప్పుడు ఇలాంటి చిన్నచిన్న విషయాల్లో వాదులాడుకోవడం, వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం ఎందుకు? దీనివల్ల ముస్లింల ఐకమత్యం బలహీనమైపోయి ఇస్లాంవ్యతిరేక శక్తులకు వారిపై దెబ్బతీయడానికి అవకాశం కల్పించదా?

ఖుర్ఆన్-హదీసుల పట్ల సరైనఅవగాహన ఉన్న ధర్మవేత్తలు ప్రపంచ పరిస్థితుల్ని విశ్లేషణాదృష్టితో గమనిస్తున్న మేధావులు, ఉమ్మత్ శ్రేయోభి లాషులు ఈ రెండువర్గాలు సత్యమార్గంలో ఉన్నాయని చెబుతున్నారు. అయినా ప్రతి వర్గం ప్రజలు తామే సత్యమార్గంలో ఉన్నామని చెప్పుకుం టున్నారు. గ్రంథప్రజలు కూడా ఇలాగే చెప్పుకుంటారు.

"యూదులైపోతే సన్మార్గంలో ఉంటారని యూదులు, క్రైస్తవులుగా మారి తేనే రుజుమార్గం లభిస్తుందని క్రైస్తవులు అంటారు. చెప్పు: "ఇబ్రాహీం అనుచర సముదాయమే సన్మార్గంలో ఉంది." (ఖుర్ఆన్-2:135)

ప్రవక్త (స)నోట ఒక విషయాన్ని విన్న లేక ఆయన ఆచరించిన ఒక విషయాన్ని చూసిన అనేకమంది సహాబీలు వాటిని తమ సొంతమాటల్లో వ్యక్తపరిచారు. అదే విషయాన్ని సహాబీల నోట విన్న ఇతరులు కూడా దాదాపు తమ సొంతమాటల్లోనే హదీసు సేకరణకర్తలకు చేరవేశారు. అంచేత అందులో కొద్దో గొప్పో తేడా ఉండటం సహజం. అదీగాక హదీసు కళ, ధర్మావగాహనల దృష్ట్యా కూడా కొంచెం తేడాలు ఉండే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ ఈ తేడాలు ధర్మంలోని మౌలికఅంశాల రూపు రేఖల్ని మార్చగలిగేటంతటి భయంకరమైన విషయాలు కావు.

స్తోమత కలిగిన ముస్లింలు ఈదుల్అజ్హా రోజు పశువుని ఖుర్బాని (బలి) ఇవ్వడం విధియే. అందులో సందేహంలేదు. కాని మనిషి భక్తి

పరాణతకు అదే అసలువిషయం కాదు. “విశ్వాసి విశ్వప్రభువుకు భయపడుతూ ఏమేరకు ఆయన ఆదేశాన్ని పాటిస్తున్నాడు?” అనే విషయం ప్రస్ఫుటం కావడానికే ఆయన ఖుర్బాని విధిని నిర్ణయించాడు.

“దేవుని వద్దకు వాటి రక్తమాంసాలు చేరవు. మీ భయభక్తులే ఆయన దగ్గరకు చేరుతాయి.” (ఖుర్ఆన్–22:37)

అలాగే నమాజ్ చేస్తున్నపుడు కాబాకు అభిముఖంగా నిలబడి నమాజ్ చేయడం విధి అనేది నిజమే. అయితే దైవారాధనల్లో, ఇతర సత్కార్యాల్లో కాబా వైపు తిరిగి నమాజ్ చేసే విధి ఒక్కటే ముఖ్యమైన విషయం కాదు. ప్రయాణావస్థలో కాబావైపు తిరిగి నమాజ్ చేయడానికి వీలులేకపోతే, వీలున్నవైపు తిరిగి నమాజ్ చేయవచ్చని ధర్మశాస్త్రం అనుమతిస్తుంది.

“మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుడ్ని, అంతిమదినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ) గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చుచేయాలి; ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలి; (పేదల జకాత్ చెల్లించాలి; ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసే వారే సన్మార్గగాములు.” (ఖుర్ఆన్–2:177)

కనుక ముస్లింలు ఫిఖ్హా విభేదాలను విద్వేష-విరోధాల స్థాయికి తీసుకుపోకుండా ఉండటంలోనే వారి శ్రేయస్సుంది. ప్రపంచవ్యాప్తంగా దుష్టశక్తులు ఇస్లాంను వక్రీకరిస్తూ ముస్లింలపై, ముస్లిందేశాలపై ఎడతెరిపిలేని దాడులు చేస్తున్న ఈరోజుల్లో ముస్లింలు ఫిఖ్హా విభేదాలతో పాటు వ్యక్తిగత, రాజకీయ స్వప్రయోజనాలు వదలి ఇస్లాం మౌలికవిషయాలపై, ముఖ్యంగా ధర్మసంస్థాపనా కార్యకలాపాలపై పూర్తిదృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఎంతయినా ఉంది.



“సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. పాపకార్యాల్లో, హింసాదౌర్జన్యాల్లో ఎవరితోనూ సహకరించకూడదు. దేవునికి భయపడండి.” (5:2); “పరస్పరం ఉదారస్వభావంతో మసలుకోవడం మరచిపోకండి.” (ఖుర్ఆన్–2:237)

## సంఘ వ్యవస్థీకరణ-25

“విశ్వాసులారా! దేవుని పట్ల, ఆయనప్రవక్త పట్ల విధేయత కలిగిఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీలో వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపునకు, ఆయనప్రవక్త వైపునకు మరల్చండి. మీరు నిజంగా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరైన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే ఉత్తమ విధానం.” (ఖుర్ఆన్–4:59)

ముస్లింలు ఐకమత్యంతో సామూహిక జీవితం గడపాలని, జీవితంలోని ప్రతిరంగంలో ఖుర్ఆన్, హదీసుల ఆజ్ఞల్ని పాటించాలని; దాంతోపాటు వారి నాయకులిచ్చే ఆజ్ఞల్ని కూడా పాటించాలని పైసూక్తి తెలియజేస్తోంది. “దేవుని పట్ల విధేయత కలిగివుండండి” అంటే ఖుర్ఆన్ ఆజ్ఞల్ని పాటించాలని; “ప్రవక్త పట్ల విధేయత కలిగివుండండి” అంటే హదీసు బోధనలు అనుసరించాలని అర్థం. నాయకులిచ్చే ఆజ్ఞలు ఈ రెండిటి వెలుగులోనే ఉండాలి. ఖుర్ఆన్, హదీసులే ఇస్లాం బోధనలకు మూలాధారాలు. కనుక ముస్లింలు సంఘజీవితంతో పాటు ఖుర్ఆన్, హదీసులకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. దైవప్రవక్త (స) చేసిన ఈ హితోపదేశం చూడండి:

“నేను మీదగ్గర రెండు వస్తువులు వదలి వెళ్తున్నాను. వాటిని గట్టిగా పట్టుకొని (ఆచరిస్తూ) ఉన్నంత కాలం మీరెన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్ఆన్). రెండు, నా సంప్రదాయాలు.” (మిష్కాత్)

ముస్లింలు సంఘజీవితం గడపాలని, ఇస్లామీయ సంఘవ్యవస్థను అంటిపెట్టుకొని ఉండాలని కూడా పైసూక్తి సూచిస్తోంది. దైవప్రవక్త (స) బోధించిన ఈక్రింది హితోక్తులు చూడండి:

"ఒంటరి మనిషికి షైతాన్ చేరువవుతాడు. మనుషులు ఒకరికి ఇద్దర యినప్పుడు వాడు దూరమైపోతాడు. కనుక తమ గృహాన్ని స్వర్గం మధ్య నిర్మించుకోదలచేవారు ఇస్లామీయ సాంఘిక వ్యవస్థను అంటిపెట్టుకొని ఉండాలి." (మిష్కాత్)

"సంఘం(తో కలసివుండటం) దైవకారుణ్యం, చెల్లాచెదురు(గా ఉండటం) (యమ)యాతన" (హదీస్)

సంఘం అంటే సజ్జనులయిన ముస్లింలతో కూడిన సంఘం. ఇలాంటి సంఘాన్ని వదలి స్వార్థప్రయోజనాలు, పేరుప్రతిష్ఠల కోసం ఇస్లాంవ్యతిరేక శక్తులతో ముస్లింలు ఎన్నటికీ చేతులు కలపకూడదు. అదేవిధంగా దేవుని ఆదేశాలను, దైవప్రవక్త (స) హితవుల్ని తుంగలో తొక్కి ఇస్లాందురభి మానుల దుష్ప్రచారానికి, దుష్టపథకాలకు పావులుగా ఉపయోగపడే నామమాత్రపు ముస్లింలతో కూడా సహకరించకూడదు.

'కేవలం ముగ్గురు వ్యక్తులు ప్రయాణమయినా సరే, వారు తమలో ఒకణ్ణి నాయకుడిగా నియమించుకోవాలి." (అబూదావూద్)

"దేవుడు నాకు ఆదేశించిన ఐదు విషయాలను గురించి నేను మీకు ఆజ్ఞాపిస్తున్నాను. 1-సంఘం(జమాఅత్), 2-వినడం, 3-విధేయత, 4-వలస (హిజ్రత్), 5-దైవమార్గంలో పోరాటం(జిహాద్). వినండి! (ముస్లింల) సంఘం నుండి ఒక జానెడు దూరం కూడా బయటుండేవాడు ఇస్లాం హారాన్ని తన మెడలో నుంచి తీసేసిన వాడవుతాడు. ఇస్లామీయ సంఘ జీవితవిధానం వదిలేసి అజ్ఞానం-అనాగరిక జీవితవిధానం వైపు పిలిచే వాడికి నరకమే నివాసస్థలం అవుతుంది" అన్నారు దైవప్రవక్త (స).

ప్రజలు ఈమాట విని "ఏమిటీ! నమాజ్ చేస్తుండేవాడైనా, ఉపవాసం పాటించేవాడైనా నరకనివాసి అవుతాడా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఆ...నమాజ్ చేస్తుండేవాడైనా, ఉపవాసం పాటించేవాడైనా, తనను తాను ముస్లింఅని భావిస్తుండేవాడైనా సరే" అని అన్నారు. (మిష్కాత్)



అబూనజీ ఇర్బాజ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "మీరు దేవునికి భయపడుతుండాలని, మీకు నాయకుడిగా నియమించ బడేవాడు నీగ్రోజాతికి చెందిన బానిసయినాసరే, (అతను చెప్పినట్లు) విని విధేయత చూపాలని నేను మీకు ఉపదేశిస్తున్నాను. (జాగ్రత్త!) మీలో ఎవరైనా (నా తదనంతరం) బ్రతికివుంటే త్వరలోనే అతను ఎన్నోవిభేదాలు చూస్తాడు. (అలాంటి పరిస్థితుల్లో) మీరు నా సంప్రదాయాన్ని (హదీసుల్ని), సన్మార్గగాములయిన ఖలీఫాల విధానాన్ని అనుసరించాలి. వాటిని మీరు పళ్ళతోనైనా సరే గట్టిగా పట్టుకోండి. ధర్మంలో కొత్తపోకడ (బిద్అత్)లకు దూరంగా ఉండండి. (ధర్మంలో ప్రవేశపెట్టబడే) ప్రతి కొత్తపోకడ మార్గ భ్రష్టతే అవుతుంది." (అబూదావూద్, తిర్మిజీ)

## నాయకానుచరుల సంబంధాలు-26

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎల్లప్పుడూ (జన) సముదాయానికి సేవ చేయడంలో నిమగ్నుడై ఉంటూ జాతికి సేవ చేసేవాడే జాతి నాయకుడవు తాడు. ఇంతకంటే గొప్ప సదాచరణ మరెవరిదీ కాజాలదు, ఒక్క అమర గతుడి ఆచరణ తప్ప." (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి : "ముస్లింలు తమకిష్టమున్నా, లేకపోయినా తమ పైఅధికారి చెప్పే మంచిమాట విధిగా వినాలి. ఒకవేళ అతను చెడు మాట చెబితే అప్పుడతనికి విధేయత చూపకూడదు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ఓ సైనికదళానికి ఒక అన్సారీ ముస్లింని సేనాపతిగా నియమించి పంపారు. అప్పుడాయన సేనాపతికి విధేయులై మసలుకోవా లని సైనికుల్ని ఆజ్ఞాపించారు. అయితే ఆ సేనాపతి (ఒక సందర్భంలో) వారిపై ఆగ్రహం వెలిబుచ్చుతూ "మీరంతా నాకు విధేయులై ఉండాలని దైవప్రవక్త మిమ్మల్ని ఆదేశించలేదా?" అని అడిగాడు. దానికి వారంతా "నిజమే, ఆదేశించారు" అన్నారు. "అయితే నేనొక నిర్ణయం తీసుకున్నాను. దానిప్రకారం మీరు కట్టెలు తెచ్చి ఒకచోట పేర్చండి. తరువాత దానికి నిప్పుపెట్టి అందులోకి దూకండి" అన్నాడు సేనాపతి.

సైనికులు తమ నాయకుని ఆదేశం పాటిస్తూ కట్టెలు తెచ్చి పేర్చారు. దానికి నిప్పు కూడా పెట్టారు. అయితే అందులోకి దూకాలనుకున్నప్పుడు వారు (అయోమయంగా) ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు. వారిలో కొందరు మాట్లాడుతూ "మనం (నరకా)అగ్ని నుండి తప్పించుకోవడానికే కదా దైవప్రవక్త (స)కు విధేయులయ్యాం! అలాంటిది ఇప్పుడు మనం అగ్నిలో దూకడం ఏమిటీ?" అన్నారు. ఇలా మాట్లాడుకుంటుండగా ఆ నిప్పు కాస్తా ఆరిపోయింది. అటు సేనాపతి కోపం కూడా చల్లారిపోయింది.

ఆతర్వాత దైవప్రవక్త (స) ముందు ఈ సంఘటన ప్రస్తావన వచ్చింది. అది విని ఆయన "వారు గనక అప్పుడు అగ్నిలో దూకివుంటే ఇకఎన్నటికీ అగ్ని నుంచి బయటపడేవారు కాదు. శాశ్వతంగా నరకాగ్నిలోనే కాలిపోతుండేవారు. ధర్మసమ్మతమైన వ్యవహారాల్లో మాత్రమే అధికారులకు విధేయత చూపాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ధర్మసమ్మతమైన వ్యవహారాల్లోనూ ఒక్కోసారి విషయావగాహనా విభేదం వల్లగాని, మరేదైనా కారణంవల్లగాని అనుచరులు నాయకుని ఆదేశానికి భిన్నంగా ప్రవర్తించే అవకాశం ఉండొచ్చు. అప్పుడు నాయకుడు అనుచరుల చిత్తశుద్ధిని, కార్యదీక్షను లెక్కలోకి తీసుకోవాలి.

(1) దైవప్రవక్త (స) కందకం యుద్ధం ముగిసిన తరువాత అక్కడ్నుంచి తిరిగొచ్చి "బనీఖురైజా (యూదుల)వాడకు చేరుకోనంత వరకు ఎవరూ అసర్ నమాజ్ చేయకూడద"ని ఆదేశిస్తూ ఒక ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ప్రవక్త అనుచరులంతా (జట్లుజట్లుగా) బయలుదేరారు. కొందరు కొంతదూరం నడిచిన తర్వాత దారిలోనే అసర్ వేళయింది. అప్పుడు వారిలో కొందరు "మనం బనూఖురైజా వాడకు చేరు కోనంత వరకు అసర్‌నమాజ్ చేయకూడదు" అన్నారు. మరికొందరు దీన్ని వ్యతిరేకిస్తూ "కాదు, మనం ఇక్కడే నమాజ్ చేయాలి. దైవప్రవక్త (స) ఆదేశానికి అర్థం అసర్‌నమాజ్ 'ఖజా' చేయాలని కాదుకదా?" అన్నారు.



(మొదటి అభిప్రాయంతో ఏకీభవించినవారిలో కొందరు సూర్యాస్తమయమైన తర్వాత, మరికొందరు ఇషావేళకు బనీఖురైజా వాడకు చేరుకొని అసర్‌నమాజ్ చేశారు.) చివరికీ విషయం దైవప్రవక్త (స) దృష్టికి తీసికెళ్ళారు. ఆయన అంతా విని వారిలో ఎవర్నీ కోపగించుకోలేదు. (బుఖారి, ముస్లిం)

(2) దైవప్రవక్త (సల్లం) ఒకసారి కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బనీ ఉమర్ బిన్ ఔఫ్ తెగప్రజల మధ్య సయోధ్య కుదర్చడానికి వారి దగ్గరకు వెళ్ళారు. ఆ సందర్భంలో నమాజ్ వేళయింది. అప్పుడు ముఅజ్జిన్, హజ్రత్ అబూబకర్ (రజి)తో "నేను తక్బీర్ (ఇఖామత్) చెబుతాను, మీరు నమాజ్ చేయిస్తారా?" అని అడిగాడు. దానికి అబూబకర్ (రజి) "సరే, చేయిస్తాను" అన్నారు. ఆ తరువాత ఆయన నమాజ్ చేయించడం ప్రారంభించారు. నమాజ్ ఇంకా పూర్తికాలేదు. అంతలో దైవప్రవక్త (సల్లం) వచ్చి జనాన్ని దాటుకుంటూ వెళ్ళి మొదటి వరుసలో నిలబడ్డారు. ఆయన్ని చూసి ప్రజలు చప్పట్లు చరుస్తూ, అబూబకర్ (రజి)ని సైగ చేయడానికి ప్రయత్నించారు.

హజ్రత్ అబూబకర్ (రజి) నమాజ్ చేస్తున్నప్పుడు ఇతర విషయాలపై మనస్సు పోనివ్వరు. అందువల్ల ఆయన ఆ విషయాన్ని పట్టించుకోలేదు. చివరికి ప్రజలు మరింత గట్టిగా చప్పట్లు చరచడంతో ఆయన విషయం గమనించారు. దైవప్రవక్త (స)ను చూడగానే ఆయన (ఇమామత్ స్థానం నుంచి) వెనక్కి జరగడానికి ప్రయత్నించారు. అయితే దైవప్రవక్త (స) ఆయన్ని తన స్థానంలోనే నిలబడి ఉండమని ఆదేశించారు. కాని అబూబకర్(రజి) దైవప్రవక్త (స) ఆజ్ఞ విని (ఆయన తనను అంతటి యోగ్యుడిగా గుర్తించినందుకు) రెండు చేతులెత్తి కృతజ్ఞతగా దేవుడ్ని స్తుతించారు. తర్వాత వెనక్కిజరిగి అందరితోపాటు సమానంగా పంక్తిలో నిల్చున్నారు.

అప్పుడు దైవప్రవక్త (స) ముందుకెళ్ళి నమాజ్ చేయించారు. నమాజ్ ముగిసిన తర్వాత "అబూబకర్! నీ స్థానంలోనే నిలబడమని నేను ఆజ్ఞాపించినా నీవలా ఎందుకు చేయలేదు?"ని ప్రశ్నించారు. దానికి అబూబకర్

(రజి) "అబూఖహాఫా కొడుక్కి దైవప్రవక్త ముందు నిలబడేటంత శక్తి, సాహసం ఎక్కడున్నాయి?" అన్నారు. (బుఖారి, ముస్లిం)

"భవిష్యత్తులో మీపై కొందరు వ్యక్తులు పాలకులవుతారు. వారి పాలనలో మీకు కొన్ని మంచివిషయాలు, మరికొన్ని చెడువిషయాలు గోచరిస్తాయి. అప్పుడు చెడు విషయాలపట్ల నిరసన వెలిబుచ్చేవాడిపై ఎలాంటి బాధ్యత ఉండదు. అలాగే ఆ చెడువిషయాల్ని ఇష్టపడనివాడు కూడా (ప్రచారబాధ్యత నుండి) తప్పించుకుంటాడు. అయితే చెడు విషయాల్ని అంగీకరించి వాటిని అనుసరించేవాడ్ని మాత్రం (దైవన్యాయ స్థానంలో) ప్రశ్నించడం జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు అనుచరులు "అలాంటి ఆజ్ఞలు జారీఅయ్యే కాలం వస్తే మేము వారితో (పాలకులతో) యుద్ధం చేయవచ్చా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "చేయకూడదు. వారు నమాజు చేస్తున్నంత కాలం (వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు) చేయకూడదు" అని చెప్పారు. (ముస్లిం)

## మధ్యేమార్గమే మనకు మంచిది-27

"ప్రవక్తా! చెప్పు: 'తూర్పుపడమరలన్నీ దేవుని దిక్కులే. ఆయన తాను కోరినవారికి సన్మార్గం చూపుతాడు.' ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము, మీరు ప్రపంచప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని." (ఖుర్ఆన్-2:142)

ఎలాంటి అతిశయానికి, అతివాదాలకు పోకుండా జీవిత సమస్త రంగాల్లో మధ్యేమార్గం అవంబించి న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే సమాజాన్ని "ఉమ్మతె వసత్" లేక మధ్యస్థ సమాజం అంటారు. ఏ విషయంలోనైనా అతివాదం ఎల్లప్పుడూ అనర్థదాయకమే.

"దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (ఖుర్ఆన్-59:7)



మహాప్రవక్త (స) మహితోక్తి: "దేవుడు కొన్ని విధులను నిర్ణయించాడు, వాటిని మీరు నిర్లక్ష్యం చేయకండి. కొన్ని విషయాలను నిషేధించాడు, వాటి జోలికి పోకండి. కొన్ని హద్దులు ఏర్పరచాడు, వాటిని అతిక్రమించ కూడదు. కొన్నిటి విషయంలో కావాలని మౌనం వహించాడు, వాటి లోతులకు పోయి తరచిచూడటానికి ప్రయత్నించకండి." (జాబిర్-మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "ధర్మం ఎంతో సులువైనది. ఎవరైనా ధర్మాను సరణలో అనవసరంగా కాఠిన్యం కోరితెచ్చుకుంటే ధర్మమే అతనిపై ఆధిక్యత సాధిస్తుంది (ఆ కాఠిన్యం భరించలేక ధర్మాన్ని ఆచరించడమే వదిలేస్తాడు). కనుక మీరు సన్మార్గంలో నడవండి. మధ్యేమార్గం అనుసరించండి. మీప్రభువు తరఫున లభించే పుణ్యానికి సంబరపడండి. ఉదయం, సాయంత్రం రాత్రిపూట కొంత సేపు (ఆరాధన చేయటం) ద్వారా దైవసహాయాన్ని అర్థించండి." (బుఖారీ)

ప్రళయదినాన మానవులందరూ పునర్జీవులయి హష్ర్ మైదానంలో గుమికూడుతారు. దైవన్యాయస్థానంలో మానవుల కర్మవిచారణ జరుగుతుంది. దైవప్రవక్తలంతా తమకు అందజేయబడిన దైవబోధనలను ప్రజలకు అందజేశామని దేవుని ముందు సాక్ష్యమిస్తారు. అంతిమ దైవప్రవక్త (స) కూడా తనకు అందజేయబడిన దైవబోధనలను ప్రజలకు చేరవేశానని సాక్ష్యమిస్తారు. ఆయన అనుచరులు దాన్ని ధృవీకరిస్తారు. దాంతో దైవప్రవక్త (స) బాధ్యత తీరిపోతుంది.

ఆతర్వాత ఈబాధ్యతను గురించి దేవుడు ముస్లింలను అడుగుతాడు. ముస్లింలు తమకు దైవప్రవక్త(స) ద్వారా అందిన బోధనలను వాక్క్రియల ద్వారా తోటి మానవులకు అందజేశామని సమాధానమిచ్చుకోవాలి. ఈ విషయాన్నే ఈసూక్తిలో సాక్ష్యం ఇవ్వడమని చెప్పబడింది. వారు తోటిమానవులకు ఇస్లాం బోధనలను చేరవేయడమే గాక, వాటిని ఆచరించి కూడా చూపాల్సిన అవసరముంది. అంటే వారి మాటలకు-చేతలకు మధ్య పొంతనఉండాలి. భక్తిపరాయణత అంటే ఇలా ఉంటుంది; నీతీనిజాయతీ

లంటే ఇలాఉంటాయి; న్యాయం-ధర్మం అంటే ఇలా ఉంటాయి అని ప్రజలు భావించేలా వారు పూర్తిగా ధార్మికజీవితం గడపాలి.

ముస్లింలు సైద్ధాంతికసమాజానికి చెందిన సభ్యులు. బాధ్యతా యుత మైనజాతి ప్రజలు. వారు దైవప్రవక్త (స) ప్రతినిధులుగా మసలుకుంటూ ప్రపంచాన్ని నీతిమార్గాన నడిపించవలసి ఉంటుంది. చెడుల్ని అరికట్టాలి. అన్యాయం, అధర్మాలను అంతమొందించాలి. నీతిన్యాయాలను, శాంతి సుహృద్భావాల వాతావరణం నెలకొల్పాలి. దేవునిధరిత్రి హింసాదౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు, అశ్లీలం, అరాచకాలతో నిండిపోతే దానికి దైవం ఎదుట ముందుగా ముస్లింలే బాధ్యులవుతారు. 'నా భూమీమ్మద ఇన్ని ఘోరాలు, దురంతాలు జరుగుతుంటే మీరేం చేస్తుండేవార'ని దేవుడు వారిని నిలదీస్తాడు. వారు తమ వంతు కృషి ఏమేరకు చేశారని ప్రశ్నిస్తాడు. సత్యానికి సాక్షులుగా నియమించబడిన ముస్లింలు దైవన్యాయస్థానంలో ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది.

"మీలో ఒకవర్గం (ప్రజల్ని) మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడుల నుండి వారించేవారు తప్పక ఉండాలి. అలాంటివారే (ఇహపర లోకాల్లో) సాఫల్యం చెందేవారు" (ఖుర్ఆన్-3:104)

ఈ సూక్తిలో సృష్టికర్త ముస్లిం జీవితలక్ష్యం ఏమిటో తెలియజేశాడు. దీన్నిబట్టి ప్రతి ముస్లిం తన శక్తిమేరకు సమాజంలోని చెడుల్ని అరికడ్తూ మంచిని వ్యాపింపజేస్తూ ప్రజల్ని సంస్కరించడానికి కృషి చేయాలని అర్థ మవుతోంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"దైవాజ్ఞల్ని ఉల్లంఘిస్తున్నవారిని, ఆ ఉల్లంఘనపై వారిని విమర్శిం చనివారిని ఇలా రెండస్థుల ఓడలోని ప్రయాణీకులతో పోల్చవచ్చు- చీటి వేయడం ద్వారా కొందరు పైఅంతస్థులో, కొందరు క్రిందిఅంతస్థులో కూర్చున్నారు. క్రింది అంతస్థువాళ్ళు బకెట్‌తో సముద్రం నుండి నీళ్ళు తోడుకోవడానికి పైఅంతస్థుకు వెళ్తున్నప్పుడల్లా పైఅంతస్థువాళ్ళకు ఇబ్బంది కలిగేది. దాంతో వాళ్ళు క్రిందిఅంతస్థువాళ్ళను విసుక్కునే వాళ్ళు.



అప్పుడు క్రింది అంతస్థువాళ్ళు ఓ గొడ్డలి తీసుకొని ఓడ అడుగున ఉన్న పలకలను ఊడబెరకడం ప్రారంభించారు. పైఅంతస్థువాళ్ళు (విస్తు బోయి) 'ఇదేమిటీ ఇలా చేస్తున్నారు?' అని అడిగారు. దానికి క్రింది అంతస్థువాళ్ళు 'మాకు నీళ్ళు కావాలి. నీళ్ళ కోసం మేము మాటిమాటికి పైకి వస్తుంటే మీకు బాధ కలుగుతోంది కదా! అందుకని మేము ఓడ పలకలను ఊడబెరికి నీళ్ళు తీసుకోదలిచాము' అని చెప్పారు.

పైఅంతస్థు వాళ్ళు క్రింది అంతస్థువాళ్ళను ఆ పనినుండి అడ్డుకుంటే వారినీ కాపాడగలరు, తమనూ కాపాడుకుంటారు. అలా అడ్డుకోకపోతే వారినీ ముంచివేస్తారు, తాము కూడా మునిగిపోతారు." (బుఖారి)

"మీలో ఎవరైనా సమాజంలో ఏదైనా చెడ్డపని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు ఆ చెడుకు వ్యతిరేకంగా గళం విప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడా ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి నిరోధించే శక్తి లేని వాడు కనీసం మనసులోనైనా ఆ చెడును ద్వేషిస్తే అతను కూడా జవాబు దారీబాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ (చివరి)వైఖరి అన్నిటికంటే అత్యల్పస్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది." (నిసాయి)

## శ్రేష్ఠసమాజం బాధ్యతలు-28

"విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు. దేవుడ్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు." (ఖుర్ఆన్-3:110)

ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతన జనింపజేసి తద్వారా వారిని నీతిమంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దగోరుతోంది. అంధ విశ్వాసాలు, దురాచారాలతో సహా లోకంలోని వివిధ చెడుల్ని నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పదలచింది. ఈ లక్ష్యం కోసం

ఖుర్‌ఆన్ ముస్లింలపై మంచినిపెంచే, చెడును త్రుంచే పని నిర్బంధం చేసింది. దీనికోసం ముస్లింలలో ఒక వర్గం వ్యవస్థీకృత సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెబుతోంది.

ఈ ఆశయం, అవసరాల దృష్ట్యానే దైవప్రవక్త (సల్లం) కాలంలో, ఆ తరువాత సద్వర్తునులైన ఖలీఫాల కాలంలో ముస్లింలు ధర్మసంస్థాపన కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషి చేశారు. సమాజంలో ఏ కొద్ది చెడు కన్పించినా వారు ప్రశాంతంగా నిద్రపోయేవారు కాదు. ప్రజలలో దైవభీతి కలిగిస్తూ వారిని దుష్కార్యాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. తత్ఫలితంగా ఆనాడు సమాజంలో సర్వత్రా నీతి, న్యాయం, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. భక్తిపరాయణత, బాధ్యతాభావం, పరస్పర గౌరవాభిమానాలు ఎల్లడెల్లడలా విస్తరించాయి.

అదొక స్వర్ణయుగం. ముస్లిమేతర మేధావులు సైతం కీర్తించిన కాంతి యుగం. కాని ఆ యుగం అంతరించింది. ఆ కాంతి కనుమరుగయి పోయింది. ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా అరాచకమే గోచరిస్తోంది. అవినీతి, అన్యాయం. అశ్లీలం, అత్యాచారాలు సర్వసామాన్యమైపోయాయి. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోనేగాక వారి సామూహిక జీవితాల్లో కూడా ఈ చెడులు చేరాయి. చివరికి రాజకీయ వ్యవహారాలు, చట్టసభలు సైతం వివిధ చెడులతో దుర్గంధ భూయిష్టమై పోయాయి.

అంతకంటే విచారకరమైన విషయం- ధర్మసంస్థాపనా బాధ్యత నిర్వహించవలసిన ముస్లింలు కూడ ఈ చెడుల్లో కూరుకుపోయారు. ఇలాంటి పరిస్థితిలో ధార్మిక, సామాజిక స్పృహ కలిగిన ముస్లింలపై చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత మరింత అధికమయింది. ఈపని నిర్వహించక పోతే సమాజపతనానికి దేవునిముందు ప్రధానబాధ్యులు వారే అవుతారు. దైవప్రవక్త (స) దీన్ని ఓ తార్కాణంద్వారా ఇలా తెలిపారు:

"దేవుడు, ఒక ఊరిని ఆ ఊరిప్రజలతో సహా తల్లక్రిందులు చేయమని (దైవదూత) జిబ్రీల్ (అలై)ని ఆజ్ఞాపించాడు. జిబ్రీల్ (అలై) ఆ ఊరిని



చూసి వచ్చి 'ప్రభూ! అక్కడ ఒక్కక్షణం కూడా నీకు అవిధేయత చూపని నీ దాసుడు కూడా ఒకడున్నాడు కదా (నేనెలా ఆ ఊరిని శిక్షించను)?' అని అన్నారు. 'కాని నా ధర్మం అగౌరవం, అపచారాలకు గురవుతుంటే అతని ముఖం ఏనాడూ (ఆగ్రహంతో కాస్తయినా) జేవురించ లేదు. కనుక ఇతరులతోపాటు అతడ్ని కూడా కలిపి మొత్తం ఊరిని తల్లక్రిందులు చేసెయ్యి' అని దేవుడు మళ్ళీ ఆదేశించాడు." (మిష్కాత్)

సమాజమంతా భ్రష్టుపట్టి పోయినప్పుడు, దాన్ని సంస్కరించడానికి కృషి చేయకుండా వ్యక్తిగత సత్కార్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఈ హదీసు వివరిస్తోంది. అంతేకాదు, అలాంటి భ్రష్టసమాజంపై విరుచుకుపడే దైవశిక్ష నుండి వ్యక్తిగతసత్కార్యాలతో తృప్తిపడే ముస్లింలు కూడా తప్పించుకోలేరని ఇది ప్రస్ఫుటం చేస్తోంది.

"వారిలో (అంటే ఇస్రాయీల్ సంతతిలో) కొందరు (సత్యసందేశ ప్రచారం చేస్తున్నవారిని విమర్శిస్తూ) 'దేవుడు అంతమొందించనున్న లేక తీవ్రంగా శిక్షించనున్న వారికి మీరు అనవసరంగా ఎందుకు హితబోధ చేస్తారు?' అనడిగారు. దానికి వారు 'మీప్రభువు సన్నిధిలో మా పాపమన్నింపుకు కారణమవుతుందన్న ఉద్దేశ్యంతో, వారాయన అవిధేయతకు దూరంగా ఉంటారన్న ఆశతో మేమిలా చెబుతున్నాం' అని సమాధానమిచ్చారు."

"అయితే వారు తమకు బోధించిన విషయాలన్నీ మరచిపోయారు. అప్పుడు మేము చెడులను నివారిస్తుండేవారిని రక్షించి, అవిధేయతకు పాల్పడిన దుర్మార్గుల్ని పట్టుకొని తీవ్రంగా శిక్షించాం." (ఖుర్‌ఆన్-7:164)

నైతికంగా పతనం చెందిన సమాజంలో మనిషి వ్యక్తిగత సత్కార్యాల్లో కూడా ఎంతోకాలం స్థిరంగా ఉండలేడు. చుట్టూ స్వైరవిహారం చేసే చెడులు క్రమేణా అతడ్ని కూడా తమలో ఇముడ్చుకుంటాయి. ఏమైనప్పటికీ దేవుడు ముస్లింల నుండి వారి వ్యక్తిగత సదాచరణను మాత్రమే కోరడం లేదు. ఆయన కోరుతున్న అసలు విషయం- సంఘసంస్కరణకై నిరంతర కృషి, ధర్మసంస్థాపనకై ఎడతెగని పోరాటం.

దైవప్రవక్త(స) సంఘసంస్కరణ గురించి పలికిన పలుకులు చూడండి:

“నాప్రాణం ఏశక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు సత్కార్యాలు చేయమని ఆదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనైనా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనయినా దించుతాడు. అప్పుడు మీరెంత మొరపెట్టుకున్నా ఆయన మీ మొరలు ఆలకించడు.” (మిష్కాత్)

“ఏ జాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతిలో ఉండే సంస్కరణ సామర్థ్యమున్న వ్యక్తులు (మేధావులు, పండితులు) దాన్ని సంస్కరించక పోతే దేవుడు ఆ జాతి ప్రజలందరిపై ఏదైనా శిక్ష దించే సమయం ఆసన్న మైందని తెలుసుకోవాలి.” (మిష్కాత్)

ఈ రెండు హదీసులు సమాజసంస్కరణ ఆవశ్యకతను మరింత నొక్కి చెబుతున్నాయి. సమాజసంస్కరణ ధర్మసంస్థాపనా బాధ్యతలోని భాగమే. అందువల్ల ముస్లిములు చెడుల్ని చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవ డానికి వీల్లేదు. దైవప్రవక్తలు ఏకదైవారాధన నినాదమిస్తూ మొట్టమొదట ప్రారంభించిన కార్యం ఇదే. సమాజాన్ని పట్టిపీడించే చెడులకు వ్యతిరేకంగా వారు ఉద్యమం లేవదీశారు.

హజ్రత్ లూత్ (అలై) చెడులకు వ్యతిరేకంగా ఇలా గళంవిప్పుతారు:

“మీరెంత సిగ్గుమాలిన పనికి పాల్పడుతున్నారు! మీకుపూర్వం లోకంలో ఎవరూ ఇలాంటి పని చేయలేదే!! మీరు (స్త్రీలను వదలి) పురుషుల వెంట పడ్డారా? దారిదోపిడీలు కూడా చేస్తున్నారు. నిండుసభలలో సైతం (సిగ్గు విడిచి ఈ) పాడుపని చేస్తున్నారేమిటీ?” (ఖుర్ఆన్- 29:28,29)

మద్యన్ జాతికి వారిప్రవక్త హజ్రత్ షుఐబ్ (అలై) ఇలా ఉపదేశించారు:

“మీరు తూనికలు, కొలతలు సరిగా పాటించండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో శాంతీసామరస్యాలు ఏర్పడిన తర్వాత అరాచకం, అల్లకల్లోలాలు సృష్టించకండి.” (ఖుర్ఆన్-7:85)



సమూద్ జాతికి వారి ప్రవక్త సాలిహ్ (అలై) ఇలా ఉపదేశించారు:

“మీరు కొండలను తొలచి బడాయికోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తు న్నారా! కాస్త దేవునికి భయపడండి, నాకు విధేయత చూపండి. హద్దుమీరి ధరణిలో ఎలాంటి సంస్కరణలు చేయకుండా, అలజడులు రేకెత్తిస్తూ తిరిగేవారికి విధేయత చూపకండి.” (26:149-152)

ఆద్ జాతికి వారి ప్రవక్త హజ్రత్ హూద్ (అలై) ఇలా ఉపదేశించారు:

“మీరు ఎత్తయిన ప్రతిచోటా పనికిమాలిన స్మారకభవనాన్ని నిర్మిస్తున్నా రేమిటీ? ఇక్కడే శాశ్వతంగా ఉండాలన్నట్లు మీరు పెద్దపెద్ద మేడలు కడ్తున్నారు. మీరు ఎవరినైనా పట్టుకుంటే వారిపట్ల చాలా క్రూరంగా ప్రవర్తిస్తారు.” (ఖుర్ఆన్-26:128-130)

దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి)తో ఇలా అన్నారు: “(అలీ!) దైవసాక్షి! దేవుడు నీద్వారా ఏ ఒక్కడికి సన్మార్గం చూపినా అది నీపాలిట ఎరుపు ఒంటెల కన్నా కూడా ఎంతో విలువైనది.” (బుఖారీ)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: “మంచి వైపుకు దారి చూపించినవానికి, దాన్ని ఆచరించినవానికి సమానంగా పుణ్యం లభిస్తుంది.” (ముస్లిం)

హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఇలా అన్నారు: “ప్రజలారా! మీరు ఈ సూక్తిని పఠిస్తూనేఉంటారు. “విశ్వాసులారా! మిమ్మల్ని గురించి మీరు ఆలోచించుకోండి. మీరు సన్మార్గంలో ఉంటే, ఇతరులు మార్గభ్రష్టులైనా మీకేమాత్రం హాని కలగదు.” (5:105). కాని దైవప్రవక్త (స) “ప్రజలు ఒక దౌర్జన్యపరుడ్ని (దౌర్జన్యం చేస్తుండగా) చూసి కూడా అతణ్ణి చెయ్యిపట్టి ఆపకపోతే త్వరలోనే దైవశిక్ష వారందరినీ చుట్టుముడుతుంది” అని చెబుతుండగా నేను విన్నాను. (అబూదావూద్, తిర్మిజీ, నసాయీ)

మేము మాగ్రంథంలో యావత్మానవాళి మార్గదర్శనం కొరకు స్పష్టమైన ఆజ్ఞలు, హితవులను జారీచేశాము. అలాంటి ఆజ్ఞలు, హితవుల్ని దాచేవారిని దేవుడు శపిస్తున్నాడు. శపించేవారు కూడా వారిని శపిస్తున్నారు. అయితే

జరిగినదానికి పశ్చాత్తాపంచెంది, వ్యవహారశైలి సరిదిద్దుకొని, దాచిన దైవాజ్ఞలను ప్రజలకు వెల్లడించేవారిని నేను క్షమిస్తాను. (ఖుర్ఆన్–2:159,160)

“దేవుని వైపు (ప్రజలను) పిలిచి, సత్కార్యాలుచేసి, తాను దైవవిధేయుణ్ణని పలికినవాని మాటకంటే శ్రేష్ఠమైన మాట మరెవరిది ఔతుంది?” (41:33)

“మంచీచెడూ ఒకటి కాజాలవు. కనుక నీవు అత్యంత శ్రేష్ఠమైన ‘మంచి’ ద్వారా చెడుని నిర్మూలించు. అప్పుడు నీ గర్భశత్రువు కూడ నీకు ప్రాణ మిత్రుడయి పోవడం నీవు చూస్తావు. ఈ సద్గుణం సహనశీలురకు తప్ప మరెవరికీ అబ్బదు. ఈభాగ్యం అదృష్టవంతులకు తప్ప మరెవరికీ ప్రాప్తం కాదు.” (41:34,35)

“క్షమ, మృదు వైఖరులతో మసలుకో. ప్రజలకు మంచిని గురించి ఉపదేశిస్తూఉండు. మూఢుల జోలికిపోకు. ఎప్పుడైనా షైతాన్ నిన్ను (చెడువైపుకు) ఉసిగొల్పితే వెంటనే దేవుని శరణువేడుకో.” (ఖుర్ఆన్–7:199,200)

దైవప్రవక్త (స) హజ్రత్ అలి(రజి)తో “జాగ్రత్త! త్వరలో ఓపెద్ద సంక్షోభం చెలరేగే కాలం రానున్నది” అని అన్నారు. హజ్రత్ అలి(రజి) ఈమాట విని “అయితే దైవప్రవక్తా! ఈ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏమిటీ?” అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఈవిధంగా చెప్పారు:

“దైవగ్రంథం. (దైవగ్రంథం ద్వారానే మీరీ సంక్షోభం నుంచి బయటపడగలుగుతారు.) ఈ గ్రంథంలో మీకు పూర్వముండిన జాతులపై ఏఏ పరిణామాలు సంభవించాయో అవన్నీ ఉన్నాయి. మీ తరువాత వచ్చే జాతులకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో కూడా ఇందులో ఉన్నాయి. మీ (దైనందిన)వ్యవహారాలను గురించి నిర్ణయాలు ఎలా తీసుకోవాలో కూడా ఇందులోఉన్నాయి. ఇది ఓ గంభీరమైన, నిర్ణయాత్మకమైన గ్రంథం. ఇదేదో ఆషామాషీ గ్రంథం కాదు. ఎవరైనా దుర్మార్గుడు, చండశాసనుడు ఈ గ్రంథాన్ని వదిలేస్తే దేవుడు అతడ్ని అణగద్రొక్కుతాడు. మరెవరైనా దీన్ని వదిలేసి మరెక్కడ్నుంచయినా మార్గదర్శనం పొందడానికి



ప్రయత్నిస్తే దేవుడు అతడ్ని మార్గభ్రష్టుడిగా చేస్తాడు. ఈ ఖుర్ఆన్ దేవునికి చెందిన దృఢమైన త్రాడు. ఇది ఎంతో వివేకవంతమైన ఉపదేశం. ఇదే రుజుమార్గం. ఈఖుర్ఆన్ ఎలాంటి భావస్రవంతి కూడా మనిషిని తప్పుడు మార్గాలపైకి తీసుకుపోజాలదు. ఇందులో ఏ మానవవాక్కుతో నైనా కల్తీ చేయడం సాధ్యంకాదు. పండితులు దీన్ని ఎంత పరిశోధించినా ఎన్నటికీ తృప్తిచెందలేరు. (పరిశోధించిన కొద్దీ మరికొన్ని కొత్తకోణాలు వెలుగు చూస్తూనేవుంటాయి.) ఎంతచదివినా ఇది పాతపడిపోదు. దీని వింతలు, మహిమలు ఎన్నటికీ అంతం కావు. జిన్నులు ఈ గ్రంథం(లోని సూక్తులు) విన్న తరువాత ‘మేము రుజుమార్గం చూపే ఓ విచిత్రమైన ఖుర్ఆన్ విన్నాం. అందువల్ల మేము దీన్ని విశ్వసించాం’ అని అనకుండా ఉండలేకపోయారు. ఎవరు ఖుర్ఆన్ ప్రకారం మాట్లాడుతాడో అతను సత్యం మాట్లాడిన వాడవుతాడు. మరెవరు ఖుర్ఆన్ ప్రకారం నడుచుకుంటాడో అతను తప్పకుండా తగిన ప్రతిఫలం పొందుతాడు. ఎవరు ఖుర్ఆన్ ప్రకారం నిర్ణయం తీసుకుంటాడో అతను న్యాయమైన నిర్ణయం తీసుకున్న వాడవుతాడు. మరెవరు ప్రజలకు దీన్ని అనుసరించమని పిలుపునిస్తాడో అతను వారికి రుజుమార్గం చూపినవాడవుతాడు.” (తిర్మిజి)

ఇలాంటి మహిమాన్విత గ్రంథం నేటి ముస్లింలకు పుట్టుకతోనే వారసత్వంలో సంక్రమించినందుకు వారు సంతోషంతో పొంగిపోతూ పండుగ జరుపుకోవాలి.

“ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీ కోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెడ్తున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది.” (ఖుర్ఆన్–10:57,58)

**(–సమాప్తం–)**